ed No. M 1714.

# ఓం

# గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్ర మాసపత్రిక.

ఆరవ సంపుటము] [మూడవ సంచిక

సంపాదకుడు: అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక

౧ ఆచారక్షయము (పద్యములు) ౭౩
రాయప్రోలు సుబ్బారావుగారు.
౨ దాసు శ్రీరామపండితులు ౭౪
దాసు దామోదరరావుగారు.
౩ పిచ్చిపిల్లా! (పద్యములు) ౮౦
దుగ్గిరాల రాఘవచంద్రయ్యగారు.
౪ చిత్రదర్శనము ౮౨
కొత్తపల్లి సుబ్బన్నాచార్యులుగారు.
౫ వాసంతస్మృతి (పద్యములు) ౮౪
నోరి నరసింహశాస్త్రిగారు.
౬ సంకేతస్థానము ,,
చింతా దీక్షితులుగారు.
౭ గ్రంథాలయములు-అప్పుడు-ఇప్పుడు
అకుండి వెంకటశాస్త్రిగారు. ౮౫
౮ పాపరాజకవి ప్రశంస (పద్యములు)
గున్నేపల్లి అక్షయలింగముగారు. ,,
౯ పశ్చిమగోదావరిమండల గ్రంథాలయ సభ - ఆహ్వానసంఘాధ్యక్షుని ఉపన్యాసము. ౮౮
అధ్యక్షుని యుపన్యాసము ౯౦
తీర్మానములు ౯౭
౧౦ వాత్స్యాయనుని కామసూత్రములు ౯౮
కావ్యవ్యాకరణతీర్థులు - పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు.
౧౧ యెఱ్రిసరదాలు (పద్యములు) ౧౦౩
నండూరి వెంకటసుబ్బారావుగారు.
౧౨ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ, పమిడిపాడు-తీర్మానములు ౧౦౩
౧౩ గ్రంథాలయములు (పద్యములు) ౧౦౬
ఏనుగు తిమ్మకవిగారు.
౧౪ ఎనిమిదవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ. ౧౦౭
౧౫ గుంటూరుమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ. ౧౦౮
౧౬ శ్రీరామారామ గ్రంథాలయము - పమిడిపాడు. ౧౧౦
౧౭ పశ్చిమగోదావరిమండల గ్రంథాలయ సభ. ౧౧౦

చిత్రపటములు.

దాసు శ్రీరామపండితులు ౭౩
కపిలతీర్థము ౮౩

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ప్రెస్. (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యచే ముద్రింపబడి ప్రకటింపబడినది.

౧౯౨౩ సం. జూన్ నెల.

వార్షికమూల్యము రు ౩-౦-౦.
విడిసంచిక వెల రు ౦-౪-౦.

# రాజపోషకులు

శ్రీ శ్రీరాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరుగారు
శ్రీ శ్రీరాజా నాయని వేంకటరంగారావు బహద్దరుగారు
శ్రీ శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు

# పోషకులు

శ్రీ శ్రీరాజా మోతే గంగరాజుగారు
శ్రీ శ్రీరాజా గోవింద కృష్ణయాచేంద్ర బహద్దరుగారు
శ్రీ శ్రీరాజా కోటగిరి వేంకట కృష్ణారావు బహద్దరుగారు
శ్రీ శ్రీరాజా చెలికాని లత్సారావుగారు
శ్రీ ఎద్దుల రామయ్యగారి కుమారుడు వేంకట చిన్నంరాజు శ్రేష్ఠిగారు
చిగురుపాటి వేంకట సుబ్బారావుగారు
శ్రీ లక్ష్మీకాంత పుస్తక భాండాగారము, కొప్పెగప్పాడు
నాళం కృష్ణారావుగారు
కుప్పా శ్రీరామశర్మగారు
పొణకా పట్టాభిరామారెడ్డిగారు

# అభిమానులు

అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రయిటరు.
కొద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.
అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బి ఏ., బి. యల్.
సూరి వేంకట నరసింహశాస్త్రిగారు బి. ఏ.
గూడూరి లక్ష్మణరావుగారు బి. ఏ.
అద్దంకి సత్యనారాయణ శర్మగారు
బొడ్డపాటి హనుమంతరావుగారు
చట్టి నరసింహారావుగారు

RSVM01A.123


గ్రంథాలయములకు    గ్రంథకర్తలకు

# ఇక శ్రమ లేదు.

# ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్.

వార్షిక వృత్తాంతములు | లెటరు పేపర్లు
ప్రకటనపత్రికలు | శుభ లేఖలు
గ్రంథములు | పోస్టర్లు

మొదలగు అన్ని విధములయిన అచ్చుపనులను బైండింగుపనులను ఎంగ్రేవింగుపనులను
తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతము, హిందీ, అరవము మొదలైన భాషలలో

## సరసమగు ధరలకు అందముగ సకాలమునకు

తయారు చేసియిచ్చును.

వలయువారిట్లు వ్రాయవలయును:—

మేనేజరు, ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.

# ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్,

# బెజవాడ.

(౧౯౧౩ సం. ఇండియన్ కంపెనీల ఆక్టు క్రింద రిజష్టరు చేయబడినది.)

భాగము ౧కి రు ౨౫ లు చొప్పున ౧౨,౦౦౦ భాగములుగ విభజింప బడినది.

భాగముల సొమ్మును దరఖాస్తుతో రు ౫ లు; అలాటుమెంటు అయినప్పుడు రు ౫ లు; మిగిలినసొమ్ము ఒక్కొక్కమాసమునకు తక్కువకాని వ్యవధిగల ౩ వాయిదాలలో ఇయ్యవలెను!

## డైరెక్టర్లు

౧ శ్రీ పైడా చినరామకృష్ణయ్యగారు, జమీందారు, బ్యాంకరు, కాకినాడ.

౨ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, ఆంధ్రపత్రికాధిపతి; డైరెక్టరు, స్వరాజ్య ప్రింటింగు అండు పబ్లిషింగుకంపెనీ; డైరెక్టరు, హేండుస్పిన్నింగు అండు వీవింగుకంపెనీ, మద్రాసు.

౩ సూరి వేంకట నరసింహశాస్త్రిగారు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ కార్యనిర్వాహకసభకు అధ్యక్షులు; రామమోహన కేంద్ర గ్రంథాలయమునకు అధ్యక్షులు; బెజవాడ.

౪ నడింపల్లి వేంకటలక్ష్మీనరసింహారావుపంతులుగారు, బార్-ఎట్-లా, మేనేజింగు డైరెక్టరు, ఆంధ్ర కర్మాగారము; రాయకూట్ ఇండస్ట్రియల్ బ్యాంకి కలకత్తా, యొక్క గుంటూరు ఆఫీసు మానేజరు; ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెసు సంఘమునకు కార్యదర్శి, గుంటూరు.

౫ వావిళ్ల వెంకటేశ్వర శాస్త్రులుగారు, ప్రొప్రయిటరు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండు సన్సు; డైరెక్టరు, ఇండియన్ పబ్లిషింగుహౌసు; శ్రోత్రియందారు, మద్రాసు.

౬. కావ్యనిధి, చెలికాని లచ్చారావుగారు, సంపాదకులు; శ్రీరామవిలాస గ్రంథమాల, అముద్రితాంధ్రగ్రంథసర్వస్వము; పత్రికాధిపతి, ఆంధ్రభాషావిలాసిని, స్థాపకులు, ఆంధ్రపరిశోధకమహామండలి; జమీందారు, చిత్రాడ, (గోదావరి).

౭ బిక్కని వేంకటరత్నంగారు, కార్యదర్శి, శ్రీబాలసరస్వతీ గ్రంథాలయము, భూస్వాములు, చోడవరము, రామచంద్రపురం తాలూకా, గోదావరిజిల్లా.

౮ బచ్చు నాగభూషణరావుగారు, కార్యదర్శి, జ్ఞానదాయినీ గ్రంథాలయము; భూస్వాములు; బ్యాంకరు; పేరుకలపూడి, గుంటూరుజిల్లా.

౯ పుతుంబాక నరసయ్యగారు, కార్యదర్శి, శ్రీ వేంకటాద్రినాయని జాతీయపాఠశాల; భూస్వాములు; పెదపాలెం, గుంటూరుజిల్లా.

౧౦ పురాణం సూరిశాస్త్రిగారు, బి. ఏ, భూస్వాములు; ప్రొప్రైటరు, మచిలీపట్టం

౧౧ బొడ్డపాటి హనుమంతరావుగారు, కార్యదర్శి, శ్రీసత్యనారాయణ వరప్రసాద గ్రంథాలయము; భూస్వాములు; బొడ్డపాడు, కృష్ణాజిల్లా.

౧౨ పుచ్చా శ్రీరామశర్మగారు, కార్యదర్శి, ఆర్యబాలసమాజము; భూస్వాములు; పెదపాలెం; గుంటూరుజిల్లా.

౧౩ అయ్యంకి వేంకట రమణయ్యగారు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ గౌరవ కార్యదర్శి, రామమోహన కేంద్రగ్రంథాలయగౌరవకార్యదర్శి, బెజవాడ.

## బ్యాంకర్లు

తాతా ఇండస్ట్రియల్ బ్యాంకి, మదాస్సు, హైదరాబాదు (డక్కన్)
కలకత్తా రాయకూట్ ఇండస్ట్రియల్ బ్యాంకియొక్క గుంటూరు బ్రాంచి.

## ఆడిటరు

జి. నరసింహంగారు, యస్.ఏ.ఏ, ఎఫ్. ఆర్.యస్ ఏ, 307 లింగిశెట్టివీధి, మద్రాసు.

## లీగల్ అడ్వయిజరు

తుర్లపాటి వేంకటేశ్వరరావుగారు, బార్-ఎట్-లా.

## మేనేజింగు డైరెక్టరు

అయ్యంకి వేంకటరమణయ్యగారు.

## రిజష్టర్డు ఆఫీసు—బెజవాడ

వివరములకై మేనేజింగు డైరెక్టరుగారికి వ్రాయుడు.

ఆంధ్రదేశాభ్యుదయమునకు అత్యంతావశ్యకములగు అమూల్యగ్రంథప్రకటనమునకు కొద్దిరోజులలోనే పూనుకొనును,

ఇదివరకే పనిని ప్రారంభించి యుండుటచేత, మొదటిసంవత్సరమునుండియు లాభము పంచిపెట్టబడును. మొదటిసంవత్సరము నుండియు లాభము పంచిపెట్టునట్టి కంపెనీ ఇదియొక్కటేను.

వివరములకు వలయువారిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.

# బాలగంగాధర తిలక్ మహారాజు
## యొక్క సంపూర్ణ ఉపన్యాసములు - జీవితచరిత్ర.

భారతవర్షముయొక్క రాజకీయ చరిత్రను మీరు చదువదలంచినారా?

భారతవర్షముయొక్క స్వాతంత్ర్య పోరాటమును మీరు గుర్తెరుంగ దలచినారా?

## అట్లయిన

బాలగంగాధర తిలక్ మహారాజుయొక్క సంపూర్ణ జీవితచరిత్రమును, సంపూర్ణ ఉపన్యాసములను తప్పక చదువుడు. ఈగ్రంథమును చదువని భారతీయుడు—దేశమననేమో, దానికై పాటుబడుటయెట్లో, ఎప్పటికిని తెలిసికొన జాలడని నిశ్చయముగా జెప్పగలను.

సుప్రసిద్ధాంధ్రదేశభక్తులును, పశ్చిమకృష్ణామండల కాంగ్రెసు సంఘమునకు కార్యదర్శియును, శ్రీకృష్ణజన్మస్థానవాసముచే పవిత్రులును అగు శ్రీ మానికొండ సత్యనారాయణశాస్త్రి, బి. ఏ. గారిచే వ్రాయబడినది. ఇట్టిమహాగ్రంథముయొక్క వెల రు 2 లు మాత్రమే.

వలయువారిట్లు వ్రాయవలెను:—ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

---

# ఆంధ్రభాషాపోషకులకు విజ్ఞప్తి.

రాజమహేంద్రవరమునగల గవర్నమెంటు కళాశాలలో సంస్కృతోపాధ్యాయులుగ పనిచేసి అయిదువత్సరములక్రింద కీర్తిశేషులైన మాతండ్రిగారగు ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రులుగారు వారి జీవితాంత్యవత్సరములలో, ఆదియాధ్యాత్మికానందము ననుభవింపఁ గాంక్షించి, సంస్కృతభారతమును నిర్వచనముగ నాంధ్రీకరింప మొదలిడిరి. ఆదిపర్వాది మొదటి నాలుగైదుపర్వములు, యుద్ధపంచకము, స్వర్గారోహణపర్వములను మొత్తముమీద సుమారు 12 పర్వములను పూర్తిచేసిరి. ఈయాంధ్రీకరణకాలమందే కవిత్రయమువారి యాంధ్రీకరణములోని స్వల్పలోపములను దిఙ్మాత్రముగ చూపుచు "భారతఘక్కి" అను పేరుగల గ్రంథమును వ్రాసి, పిఠాపురమున కొంతకాలముక్రిందట ప్రచురింపఁబడుచుండెడి "కవిత" యను మాసపత్రికలో ప్రకటించిరి. వీరు తమ భారతమునకు "ఆంధ్రవ్యాస భారతనవనీతము" అనియు, అందలి పర్వభాగములకు "ధార" లనియు పేరిడిరి. కవిత్రయమువారిచే నాంధ్రీకరింపఁబడక విడువఁబడిన సంస్కృతములోని కథాఘట్టములను వీరు విపులముగ నాంధ్రీకరించిరి. కవిత్రయమువారాంధ్రీకరించిన భాగములలో విపులముగ నున్నవానిని వీరు సంగ్రహముగనే వ్రాసిరి. కవిత్రయమువారిచే యాంధ్రీకరింపఁబడని భాగములను వీరిచే విపులముగ నాంధ్రీకరింపఁబడినట్టి వానిలో కొన్ని భాగములు:—

1. కణికుని రాజనీతి. 2. సనత్సుజాతీయము. 3. భగవద్గీత. 4. విష్ణుసహస్రనామములు మొదలైనవి.

వీరు నెనుకరించిన గ్రంథములకంటె నీభారతము చాలసులభశైలిలో వ్రాయబడినట్లు పలువురభిప్రాయపడుచున్నారు. వీరిభారతములో నేభాగములైనగాని లేక అంతయు ప్రత్యేకముగ గాని, ముద్రింపించి ప్రకటింపఁబూను కొన లక్ష్మీపుత్రులను, భాషాభిమానులను ప్రార్థించుచున్నాము. ఈగ్రంథమును అచ్చువేయింపఁదలచు యౌదార్యహృదయులు, మహాశయులు, వితరణశీలురు, యాగ్రంథమునుగూర్చి యీక్రింది ఎడ్రెసుగలవారికి వ్రాసి అన్నిసంగతులు తెలిసికొనఁ గోరుచున్నాము.

అడ్రెసు:—

ఆకుండి వ్యాసేశ్వరుఁడు
"శ్రీశాంతవ్యాసనికేతనము"
[illegible]

ఇట్లు
విన్నవించు విధేయులు,
ఆకుండి వ్యాసేశ్వరుఁడు.
[illegible]

# దేశాభిమానులకు విన్నపము

అనేకమంది గాంధిమహాత్ముని భూషించుచున్నారు. కొద్దిమంది వారికి వ్యతిరేకులై యున్నారు. వారిని భూషించువారును, వ్యతిరేకులును—వారినిబట్టి వీరును, వీరినిబట్టి వారును పోవుచున్నారేగాని, నిజముగా గాంధిగారి తత్వమును అర్థముజేసికొని, ఆచరించువారు బహుకొద్దిమంది. గాంధిమహాత్ముని తత్వమునుగూర్చి అస్తిగతము చేసికొననిది దేశమునకు మోక్షములేదు కాబట్టి

## గాంధిమహాత్మునిచే రచింపబడిన

# గాంధితత్వోపదేశము

అను గ్రంథమును వెంటనే జదువుము. అనేకమంది దేశనాయకులుగూడ ఈగ్రంథమును ఇంతవరకు జదువకుండుట విచారకరము. అసలు చదివియుండకుండుటకంటె, ఇప్పుడైన వెంటనే చదువుట మంచిదిగాదా? వెల రు 1-0-0 మాత్రమే.

వెంటనే వ్రాయుము:—ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

---

# డాక్టరు చివుకుల శ్రీరాములుగారి

# ఔషధములు

## ౧ శతభస్మరసాయనము.

శరీరము త్రివిధ శగవల్ల (పసుపు, తెలుపు, యెఱుపు;) అనేక జాడ్యములలోనికిదించి శరీరము గుల్లబారియున్నను నేపథ్యమైన సవామేహబాధయున్నను, పాండువ, కష్టు, మొదలైన వ్యాధులున్నను, శరీరమంతయు పడిగలు పడియున్నను కాళ్లుచేతులు మంటలుగాని, పట్లుపట్టియున్నను బలహీనముగాయున్నను, నరముల పటుత్వముతప్పినను తీట మొదలగు చర్మవ్యాధులచే బాధపడుచున్నను 21 విధసవామేహములకున్ను అమోఘముగా పనిచేయును, యిచ్ఛాపథ్యము. సేరు౧ కి రు 8—0—0లు పోస్టుఖర్చులు ప్రత్యేకము.

## ౨ వీర్యసంజీవి.

రక్తముక్షీణించి నరముల పటుత్వము తప్పి సంభోగేచ్ఛలేక బలహీనముగా నుండు వారలు యీఔషధమును సేవించిన వీర్యవృద్ధి రక్తవృద్ధికలిగి దేహము పుష్టీకరించి మంచికాంతికలుగును. వీర్యస్తంభన కలుగును.

శుక్లనష్టము హరించును, యిందురస విషగంధ కాదులున్నట్లు రుజువు చేయువారికి రు116—0—0నూటపదార్లి వ్వబడును.

శేరు రు ౧౦—౦—౦పదిరూపాయలు పోస్టుఖర్చు ప్రత్యేకము

3 అజీర్ణవటి:— పసిబిడ్డలకు దివ్యౌషధము. అజీర్ణము జలుబు దగ్గు పడిశము జ్వరము శైత్యము మొదలగువాటికి బాగుగా పనిచేయును. ౧౦౦మాత్రలు రు ౦—౧౨—౦లు.

౪. కస్తూరివటి. ౧౦౦మాత్రలు రు ౧—౦—౦

రాజవైద్య చివుకుల శ్రీరాములు,
ఆయుర్వేదవైద్య నిలయం, కొత్తపేట, తెనాలి.

# దక్కన్ మిల్ స్టోర్సు కంపెనీ, లిమిటెడ్, బెజవాడ.

---

(1913 సం॥ ఇండియన్ కంపెనీల ఆక్టుక్రింద రిజష్టరు చేయబడినది)

## మూలధనము రు 3,00,000.

భాగము ౧కి రు 100 లు భాగముల సొమ్మును ధరఖాస్తుతో రు 20 లును, అలాటుమెంటు అయినప్పుడు రు 20 లును, మిగిలినసొమ్ము ఒక్కొక్కమాసమునకు తక్కువకాని వ్యవధిగల 3 వాయిదాలలో ఇవ్వవలెను.

## డైరెక్టర్లు:

1 మోతే నారాయణరావుగారు, జమీందారు, విస్సన్నపేట గుండేపల్లి ఎస్టేట్సు; డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు; ఏలూరు.

2 మోతే నరసింహారావుగారు, జమీందారు, విస్సన్నపేట గుండేపల్లి ఎస్టేట్సు; డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు; ఏలూరు.

3 నంబూరి వేణుగోపాలరావుగారు, ప్రెసిడెంటు, శ్రీకృష్ణాజూట్ అండు కాటన్ మిల్సు, ఏలూరు; వైస్ ప్రెసిడెంటు, యస్. కె. పి. వి. వి. హెచ్. హెచ్. స్కూలు, బెజవాడ; ఆనరరీ బెంచిమేజస్ట్రేటు; డైరెక్టరు, విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకింగు యూనియన్, బెజవాడ; డైరక్టరు, ఏషియన్ కమ్మర్షియల్ అస్యూరెన్సు కంపెనీ బొంబాయియొక్క మద్రాసుబోర్డు; ప్రొప్రైటరు, శ్రీబాలకృష్ణారైసుమిల్లు; అండు కంట్రాక్టరు, కనకదుర్గా రయిసుమిల్లు, బెజవాడ.

4 ఉప్పలపాటి బ్రహ్మయ్యగారు, ల్యాండు లార్డు అండు ప్రొప్రైటరు, శ్రీరామలింగేశ్వర రైసుమిల్లు, గుడివాడ.

5 వీరమాచనేని రంగయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు శ్రీ వేంకటేశ్వరరైసుమిల్లు, గుడివాడ.

6 కానూరి వెంకటాచలపతయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీవెంకటకనకదుర్గా మైనింగుకంపెనీ, (నెల్లూరు;) కవుతవరం, కృష్ణాజిల్లా.

7 అడపా రంగయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీశివశంకరరైసుమిల్లు, నరసన్నపాలెం, వీరవల్లిపోస్టు, పార్టనరు ఆఫ్ శ్రీరామలింగేశ్వర రయిసుమిల్లు, గుడివాడ.

8 కలిదిండి గంగరాజుగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీరామవరప్రసాద రైసు మిల్లు, తాడేపల్లిగూడెం.

9 కన్నెగంటి వెంకయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీ రామలింగేశ్వర రైసుమిల్లు, దుగ్గిరాల.

10 గుడ్లవల్లేటి గోపాలరావుగారు, పార్టనరు ఆఫ్ బాబు ఏ. వి. రాయి అండు కో. అండు ల్యాండు హోల్డరు, బెజవాడ, (ఎక్సఅఫిషియో.)

## అక్కవుంట్సు విత్

ది ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెజవాడ.

ది రాయకట్ ఇండస్ట్రియల్ బ్యాంక్, లిమిటెడ్, గుంటూరు.

ది తాతా ఇండస్ట్రియల్ బ్యాంక్ లిమిటెడ్, మద్రాసు.

## ఆడిటర్

జి. నరసింహంగారు, యఫ్. ఏ. ఏ. యఫ్. ఆర్. యస్. ఏ., 307, లింగిశెట్టివీధి, మద్రాసు.

## లీగల్ అడ్వయిజరు

కందుకూరి వటుకభైరవమూర్తి పంతులుగారు, జిల్లాకోర్టు వకీలు, బెజవాడ.

## మేనేజింగు ఏజంటు

గుడ్లవల్లేటి గోపాలరావుగారు.

## రిజష్టర్డు ఆఫీసు—బెజవాడ.

# మాలపల్లె

లేక

# సంగవిజయం

మొదటి రెండుసంపుటములు తయారైనవి.

సంపుటం ఒకటింటికి వెల ౦-౧౨-౦

## ఆంధ్రభాషయందింతవరకు ఇట్టి మహాగ్రంథం వెలువడలేదు

దేశభక్తాగ్రేసరులగు ఉన్నవ లక్ష్మీనారాయణగారిచే వాడుకభాషయందు ముద్దులొలుకునటుల వ్రాయబడినది.

ఈగ్రంథము ఆంధ్రవాఙ్మయమునందు

**గొప్ప విప్లవమును** కలుగజేయుననుట కెంతమాత్రము సందేహములేదు.

ఆంధ్రవాఙ్మయమందు "కన్యాశుల్కం" మను గ్రంథమొక్కటే ప్రతిభగాంచియున్నది. నేడు ఈగ్రంథము దానిని మరపించి భాషకు నూతనోజ్జీవమును కలుగజేయును. వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు, ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

# "విద్యార్థి."

బెజవాడనుండి ప్రకటింపబడుచుండును.

## జాతీయ విద్యావాఙ్మయవిషయిక పక్షపత్రిక

సంపాదకుడు: కురుగంటి సీతారామయ్య, ఎం. ఏ.

ఇందు విద్యాధికుల వ్యాసములు ప్రకటింపబడుచు జాతీయవిద్యాస్వరూపనిరూపణప్రయత్నములు సలుపబడును.

చందా సం॥కు ౨—౦—౦.

విద్యాభిమానులందరును చందాదారులు కాప్రార్థితులు.



దాసు శ్రీరామ పండితులు.

పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆరవ సంపుటము.

# గ్రంథాలయసర్వస్వము.

మూడవ భాగము.

## ఆచారక్షయము.

౧

సీ. తీరు తీరుల నలం ♦ కారముల్ గ్రుక్కులఁ
జిత్రించు మవ్వంపుఁ ♦ జేతిమేస్త్రి
పూసలతో బొమ్మ ♦ పోసినయట్లు చ
క్కని కుట్టుపనులల్లు ♦ కౌశలంబు
దైవారములు లేక ♦ యేవలయను లష్ట
దళరేఖల నమర్చు ♦ కలికితనము
పాడేటి గీతాల ♦ పాలు దీసినరీతి
సన్నదారముఁ దీయు ♦ జాణతనము
గీ. తెనుఁగునాఁటి కులస్త్రీల ♦ దినదినంబు
సన్నసన్నగ నణఁగారి ♦ చచ్చుచున్న
దకట! ఈగృహజీవ ది ♦ సికలు నిలువ
స్నేహనిధికి భిక్షాటన ♦ సేయరేమొ!

౨

సీ. ఏడాది పొడుగున ♦ నింత తీరిక లేక
చేలలోఁ గష్టించు ♦ సేద్యకాండ్ర
పెద్ద పురాణాలు ♦ విన నోచుకొనక యూ
రికి దూరులగు దుర ♦ దృష్టజనుల
అప్పు కల్లుకుఁగూడ ♦ నోడ లమ్మవలసిన
ఆధార శూన్యులౌ ♦ పేదవాండ్ర
ఇంటి బానిసచాకి ♦ రే పవ్వమని తూర్పు
పడమర లెఱుఁగని ♦ పల్లెసతుల
గీ. ఎవ్వడింక తాంబూర వా ♦ యించుకొనుచు
దరసి నడుపు ప్రజాహ్లాద ♦ తంత్ర మెపుడు
అన్నకాటకి మటులుండ ♦ నావహించె
భూమి నాఁడద దుర్భిక్ష ♦ మును సఖుండ!

౩

సీ. కనువాకి కన్నీరు ♦ వినువాకగా బొంగ
సీతమ్మ కష్టాలు ♦ చెప్పి చెప్పి
వెఱ్ఱిగొల్లఁడు గూడ ♦ నశ్రుపాతలూగఁగ
వీథిభాగవతాలు ♦ వేసి వేసి
మపలిశాంద్రుఁడు మీస ♦ ముంత్రిప్పి కాకృ-
వీరబొబ్బిలికథల్ ♦ వినిచి వినిచి
ఆబాలగోపాల ♦ మావేశమున తుళ్ళ
పల్నాటియుద్ధాలు ♦ పాడిపాడి
గీ॥ పల్లెపల్లెలఁ బ్రాణము ♦ పచ్చగిల్ల
జాతిసుఖము పోషించితి ♦ పూర్వకాల
మెచ్చట మునింగిపోతి వో ♦ బిచ్చకాండ!
కవివి పాటగాఁడవు నీవ ♦ గావె సఖుఁడ!

౪

సీ॥ బుర్వామ్మ బంతులఁ ♦ గప్పించి వయసు కా
నరినుబ్బ పడుచులు ♦ పాడలేరు
గొబ్బితల్లెమువేళఁ ♦ గూడ కన్నెనెలంత
లరమున లేకాడ ♦ మఱచినారు

తద్దపండుగలసై ♦ తమయాలలూగుట
మోటుగా మగువలు ♦ మూసివారు
గుర్మణి మొదలుగా ♦ రచికొన్న బొమ్మల
పెండ్లిండ్లు బాలలు ♦ విడచినారు

గీ॥ ఏ నిగపరాధమగు క్రీడ ♦ లింతవఱకు
జాతిసుఖకెళలనదగు ♦ చానలందు
పెంచె సౌందర్యసుఖరుచి ♦ పంచయమ్మ
నా శుభము లస్తమించెడు ♦ నదయరే మొ'
—రాయప్రోలు సుబ్బారావు.

# దాసు శ్రీరాములు.

## (౧)

### జన్మము.

ఆంధ్రదేవీభాగవతకర్తయైన దాసు శ్రీరామకవి యారువేలనియోగి, ఆపస్తంబసూత్రుడు, హరితగోత్రుడు. దాసు కన్నయగారికిని కామాంబకు నేకసంతానము. వీరిపూర్వులు మహారాష్ట్రబ్రాహ్మణులనియు, గోల్కొండలో నుండుచు నక్కడనుండి యుద్యోగవశమున బందరు జేరియుండిరనియు వీరి దేవీభాగవతపీఠిక వలన తెలియుచున్నది. కృష్ణాజిల్లా (ప్రస్తుతము) కైకలూరు (పూర్వము గుడివాడ) తాలూకాలోని యల్లూరగ్రహారము వీరికి బూర్వార్జితమైన నివాసగ్రామము. ఈకవి తనమేనమామల యూరగు కూరాడలో క్రీ. శ. ౧౮౪౬ పరాభవ సం॥ చైత్రశు ౧౨ నాడు జన్మించెను.

### బాల్యము.

వీరికి ౫ సం॥లు వయస్సు వచ్చువఱకును దమ స్వగ్రామాదులలోనే యుండి, యప్పటి దేశవ్యవహారమునుబట్టి, ఆంధ్రనామసంగ్రహము, అమరకోశము, మున్నగునవి చదువుచు ఆంధ్రగీర్వాణభాషాపాండిత్యము గల్గించుకొనుచు వచ్చిరి. వీరి మేనత్తకుమారులగు ఉప్పులూరి కనకాఖ్యకవియు, కృష్ణయ్యయు వీరితోబాటు వీరి తలిదండ్రులచే సాకబడియుండుటచే వీరికి బాల్యస్నేహితులుగ నుండిరి. వీరిబాల్యదశ దేవీభాగవతపీఠికయందు రమ్యముగ వర్ణింపబడినది.

### విద్యాభ్యాసము.

వీరిని ౧౦ వయేట నాంగ్లేయ విద్యాభ్యాసమునకై బందరులో నాకాలమున నున్నతస్థితియందున్న నోబుల్ కళాశాలకు తలిదండ్రులు బంపిరి. నోబుల్ గారు క్రైస్తవమతప్రచారకుడుగ నుండి కొందఱు బాలురను యువకులను క్రైస్తవమతావలంబకులుగ జేయుచుండిరి. కీ. శే. చేవేంద్ర వెంకటాచలము పంతులుగారు ఈకవిగారి సమకాలీనులు. వారప్పటికే క్రైస్తవమతము స్వీకరించిరి. ఒకయేడక్కడ చదువుకొనిన పిదప ఈకవిగారి తలిదండ్రులు తమబిడ్డ నోబుల్ గారితో జనువుగ దిరుగుచున్నట్లు తెలియుటచేతను, కొందఱన్యమతప్రవిష్టులగుట నెఱింగియుండుటచేతను, అచట నుంచుట యుక్తముకాదని యింటికి పిలిపించిరి. ఈయన బందరులో నుండగనే తప్పులుతప్పులుగ పద్యము లల్లనారంభించెను. వీరు పాఠశాలలో విద్యాభ్యాసమొనర్చినది యొక్క సంవత్సరమే.

### కవనము.

ఇంతనుండి వీరు స్వయంకృషిచే జ్ఞానార్జన మొనర్చిరి. ఆంధ్రగీర్వాణములయందు పాండిత్యము సంపాదించుచు ౧౨ వ యేట "సోమలింగశతకము"* రచించిరి. పై కనకాఖ్యకవిగారును, వీరును గలిసి యాకాలమున "శుకరంభాసంవాద" మను చిన్నపుస్తకమును రచించి, యందు లోపము లున్నట్లు దామే గ్రహించి, దానిని జించి యల్లూరుచెఱువులో గలిపిరట్లు కవిగారు చెప్పుచుండిరి. వీరి ౧౪ వ యేట కనకాఖ్యకవిగారి సహాయముతో "సాత్రాజితీవిలాస"* మను యక్షగానమును రచించిరి. ఇయ్యది చిన్నతనమునందు వ్రాయబడినదైనను ప్రౌఢముగ గన్పట్టును. ౧౬ వ యేట కృష్ణార్జునసమరము రచించిరి.

### జ్యోతిషము.

ఇట్లు అల్లూరులో సుఖముగ కాలము వెళ్ళబుచ్చుచు దమ మాతామహులగు కూరాడ రామచంద్రయ్యగారి యొక్కయు, వృద్ధులై యాగ్రామములో నివసించుచుండిన ముక్కామల లక్ష్మీనరసుగారియొక్కయు సహాయమున జ్యోతిషశాస్త్రమునందు ప్రవేశమంది జ్ఞానాభివృద్ధి గావించుకొనుచుండిరి.

### సంస్కృతము.

ఇట్లుండ జ్ఞానార్జనమునం దభిలాష గలవారగుటచే నాకాలమున గొప్పసంస్థానములలో నొకటిగనున్న నూజి

* ఈగుఱుతు వేయబడిన గ్రంథములు లభించలేదు.

వీటిసంస్థానమునందు విద్యాస్థానమైన ఆకిరిపల్లె క్షేత్రమునకు ౧౮౬౫ సం॥ నం దెవరికి జెప్పకుండ నర్ధరాత్రమునందు బయలుదేరిపోయి యచ్చట రమారమి ౧౦ మాసములుండి యచ్చటి పండితులయొద్ద సంస్కృతవ్యాకరణ మభ్యసించిరి. అనంతరము నూజివీడు వల్లూరు సంస్థానములలో నష్టావధానము, వ్యస్తాక్షరి కవిత్వములందు దమ కౌశల్యమును బ్రదర్శించి మెప్పువడసిరి. ఇప్పటికి వీరికి ౨౦ సం॥ లు. ఈవయస్సులోనే "గొల్లపల్లి రఘునాథశతకము"* ను "పంచనృసింహక్షేత్రమాహాత్మ్యము"* ను రచించిరి. ౨౨ వయేట "సారసంగ్రహగణితము"* రచించిరి.

## ఉపాధ్యాయత్వము.

౧౮౭౨ సం॥ లో గుడివాడలోని ఆంగ్లేయపాఠశాల కాంధ్రోపాధ్యాయుడుగ నేగెను. ఇక్కడ వీరాంగ్లేయపాఠముల స్వయంకృషివలన నేర్చి యితరులకు జెప్పుచు వృద్ధిపొందుచుకొనుచుండిరి. ఆంధ్రగీర్వాణములయందును గృషి సల్పిరి. మదరాసు వాస్తవ్యులగనుండి తెలుగువారిలో సుప్రసిద్ధులైన కీ. శే. గంటాల వెంకటసుబ్బారావుగారు గుడివాడలో వీరి శిష్యులు. రమారమి ౨ సం॥ లు మాత్రము గుడివాడలో నుండి, పిదప నాతాలూకాలోనిదే యగు కవుతవరములో గ్రామస్థులకోరికపైన ఇంగ్లీషు, తెలుగు చెప్పెడి ప్రైమరీబడి స్థాపించి, తనయొద్ద చదువుకొనిన యొకని నక్కడ నుపాధ్యాయుడుగ నియమించి, ౧౮౭౪ సం॥ర మధ్యమువఱకు నక్కడనుండిరి. ౧౮౭౫ సం॥ లో డోకిపఱ్ఱు గ్రామస్థులచే సాహూతుడై యక్కడ నొకపాఠశాల స్థాపించి ఆంధ్రాంగ్లగీర్వాణములు బోధించుచు, కవిత్వము చెప్పుచు నా గ్రామస్థులచే బహుమానములును మెప్పును బడసిరి. ౧౮౭౫ సం॥లో 'తెలుగు జనరల్ టెస్టు' పరీక్షయందును, మునసపుకోర్టు ప్లీడరీపరీక్షయందును గృతార్థులైరి. ఇదంతయు, వీరిస్వయంకృషిఫలమే. మఱియు నీయేటనే "లక్షణావిలాస"* మను గ్రంథమును లలితమైన శైలిలో రచించిరి.

## బందరులో న్యాయవాది.

౧౮౭౭ సం॥న వీరు రెండవతరగతిన్యాయవాదిపట్టమును దీసికొని మచిలీబందరు ప్రవేశించిరి. ౧౮౮౪ సం॥ వఱకు వీరక్కడనే యుండిరి. ౧౮౮౦ సం॥లో ఇంగ్లీషు 'జనరల్ టెస్టు'లో గృతార్థులైరి. మరియు "అనల్పజల్పితాకల్పవల్లి"* అను సంఘసంస్కరణసంబంధమైన యొక పత్రికను స్థాపించి కొంతవఱకు నడపిరి. ఈకాలమునందే వీరు "అభినవగద్యప్రబంధ"[1] మను శబ్దార్థాలంకారప్రధానమైన యాఖ్యాయికను గూడ రచించిరి. ౧౮౮౪ సం॥నం దింగ్లీషులో మొదటితరగతి న్యాయవాదిపరీక్షయందు గృతార్థులైరి. ఈపరీక్షకు జదువుటలో వీరు దినమునకు ౧౮ ఘంటలు కృషిచేసిరి. వృత్తియందు మిక్కుటమగు పనిగల్గియుండియు దమ సహజ గ్రహణధారణశక్తులవలనను, దదేకదీక్షవలనను, స్వయంకృషివలనను, విజయము గాంచగల్గిరి.

## ఏలూరులో న్యాయవాద.

౧౮౮౪ సం॥లో ఏలూరులో స్థాపింపబడిన సబార్డినేటుకోర్టులో వీరు ప్లీడరుగ బ్రవేశించిరి. నిడదవోలు ఎస్టేటు అని అప్పుడు పిలువబడుచుండిన శనివారపుపేటసంస్థానమున కధీశ్వరులైన శ్రీ పాపమ్మారావు రాణీగారు దత్తతగావించుకొనిన నూజివీటి వెంకటరామయ్యఅప్పారావుగారు అప్పటిలో వీరికి మిత్రులైరి. మఱియు నాయన తనలౌకికవ్యవహారములందీయనను న్యాయవాదిగ నియమించుకొనుచు, వీరిపాండిత్యాదిగుణవిశేషములచే వీరియందు గౌరవభావముతో వర్తిల్లుచుండిరి. ఏలూరులో నుండగ వీరిఖ్యాతి యాంధ్రదేశమెల్లెడల వ్యాపించెను. సంగీతమునం దభిరుచిగలుగుటచే గాయకుల బోషించుచు ప్రోత్సాహపరచుచుండెను. వీరియాజమాన్యముక్రింద గొంతకాల మొకసంగీతపాఠశాల యుండెడిది. ౧౮౮౬ సం॥న బసవరాజు రామబ్రహ్మముగారి ప్రోత్సాహమువలన నొకమాధ్యమికపాఠశాల (హిందూ మెట్రిక్యులేటుస్కూలు)ను స్థాపించిరి. ఈపాఠశాల ౧౮౯౦ సం॥ వఱకు జరిగెను.

## విద్వత్ప్రోత్సాహము.

వీరు ప్లీడరుగానున్న కాలములో బ్రతిశ్రావణమాసములోను దసరాపండుగదినములలోను విద్వత్పూజ జరిపెడివారు. పండితుల బరీక్షించి బహూకరించుటయందు వీరిసహాధ్యాయులగు కీ. శే. జంధ్యాల గౌరీనాథశాస్త్రిగారు వీరికి సహాయులుగ నుండిరి. వీ రేలూరులో నున్నప్పుడు విద్యార్థులు (బంధువులు, తదితరులు) కొందఱు వీరిపోషణమునం దుండెడివారు.

* ఈగుఱుతు వేయబడినగ్రంథములు లభించలేదు.

1. రెండవకూర్పు, వాణీప్రెస్, బెజవాడ. 1921.

## అభినయశాస్త్రము.

పల్లూరుసంస్థానాధీశ్వరులైన శ్రీ బొమ్మదేవర వేంకటనరసింహనాయుడుగారు వీరికి స్నేహితులు. వారిపక్షమున వీరు న్యాయవాదిగ నుండిరి. ౧౮౮౭ సం॥ప్రారంభమున నీసంస్థానప్రముఖ్యదైవమగు పల్లూరు వేణుగోపాలస్వామినిగూర్చి కృతులు, పదములు, జావళీలు1 రచించిరి. అభినయశాస్త్రమనిన వీరికి గడుబ్రీతి. స్వయముగ గొందఱకు బోధించుటయేగాక "అభినయకౌముది"* యనుగ్రంథము కూడ రచించిరి.

## నాటక రచనము.

౧౮౯౯ సం॥లో ఇంటనే పండితులయొద్ద మురారిరచితములగు మున్నగు నాటకములు తర్కాదిశాస్త్రములు నభ్యసించి ఆంధ్రమున బొత్తములు వ్రాయుచుండిరి. "తర్కకౌముది"*యను తెలుగుగ్రంథము రచించిరి. నాటకాంధ్రీకరణము ఖేలనానుకూలముగ నుండుచుండెను. ౧౮౯౦ సం॥న "జానకీపరిణయనాటకము"* ను దెలిగించిరి. రంగస్థలమున కనుకూలముగ నుండునట్లు శ్రీ కాండూరి నరసింహాచార్యులువారి సహాయముతో గొన్ని పాటలు కూర్చి చేర్చిరి. దీనితోబాటు "మనోలక్ష్మీవిలాస"*మను నొకస్వతంత్రనాటకమును గూడ రచించిరి.

## సంఘసంస్కరణము.

ఈకాలమునందు ఏలూరులో గుంటూరు భానుమూర్తి యను పతితసంసర్గకాయుూంవైదికులు ధనకాంక్షచే ప్రాయశ్చిత్తము జరుప నిరాకరింప, శ్రీ రాములుగారు చాటపఱ్ఱు వాస్తవ్యులయిన గుండు సుబ్రహ్మణ్యావధానులుగారి యాధ్వర్యముక్రింద నతనికి ప్రాయశ్చిత్తము గావింపజేసిరి. ఇందుపై సరుకుత్తుల కనూయ పెరిగెను. ఈసందర్భమున వీరు జరిపిన ధర్మశాస్త్రచర్చ యద్భుతము. మూడురాత్రులలో "పతితసంసర్గప్రాయశ్చిత్తోపన్యాసము"¶ "ఆచారనిరుక్తి" † "దురాచారపిశాచభంజని" § యను మూడుగ్రంథములు వ్రాయఁగ్లిరి. ౧౮౯౩ సం॥లో "న్యాయకౌముది"* యను న్యాయశాస్త్రగ్రంథమును పద్యరూపముగ రచించిరి.

## తెలుఁగునాడు.

౧౮౯౩ సం॥లో "తెలుఁగునాడు" ‡ అను ఆంధ్రవీధిని రచించిరి. ఇట్టిగ్రంథము లాంధ్రభాషలో మిక్కిలి యరుదు. శ్రీనాథుని వీధినాటకము జాతిలో జేరినదైన ప్పటికి, అందులోవలె నత్యంతముగ స్త్రీవర్ణనమును, కవియొక్క స్వయంవ్యక్తిత్వమును ఇందు గానరావు. ఆంధ్రవీధిలో బ్రాహ్మణప్రశంస యనుభాగముమాత్రమే రచించిరి. ఆంధ్రబ్రాహ్మణుల లక్షణములు ఇందు రమ్యముగ వర్ణింపబడినవి. జాతీయములతోనిండి శైలికడు హృదయంగమముగనుండును. ఇదిగాక "చక్కట్లదండ"1 యను నొకఅచ్చతెలుఁగు నీతిశతకమును రచించిరి.

## వైశ్యధర్మములు.

౧౮౯౪ సం॥ ప్రాంతమున నాంధ్రదేశమున వైశ్యధర్మవిషయమైన వివాదము ప్రబలెను. వేదోక్తకర్మల కర్హులమని వైశ్యులును, కారని కొందఱు బ్రాహ్మణులును సభలు చర్చలు జరుపుచుండిరి. ఆకాలమున దీక్షితులునసబుగానున్న శ్రీ ఆత్మూరి లక్ష్మీనరసింహశాస్త్రిగారు యజ్ఞముచేయుట తటస్థించెను. ఈవివాదములో శ్రీరాములుగారు వైశ్యులపక్షమవలంబించి "వైశ్యధర్మదీపిక"† యను నొకగ్రంథమును, "శ్రాద్ధసంశయవిచ్ఛేది" § యనుచిన్నపొత్తమును రచించిరి.

౧౮౯౪ సం॥ నకు బూర్వమే అప్పుడప్పుడు "నమస్కారవిధిదీపిక" * "చిలుకలకొలికి శతకము" * "ముద్దులగుమ్మశతకము" * రచించిరి. "సూర్యశతకము"ను ‡ భాషాంతరీకరించిరి. సంస్కృతమున "కామాక్షీశతకము"* వ్రాసిరి. విగ్రహారాధనమును సమర్థించుచు "విగ్రహారాధనతారావళి"¶ యను పద్యమాలిక గూడ రచించిరి.

## ఉపన్యాసములు.

౧౮౯౫ సం॥న వీరు న్యాయవాదివృత్తి విసర్జించిరనియే చెప్పవచ్చును. తదాది ప్రకృతమం దావశ్యకమైన యాచారసంస్కారవిషయమై జనసామాన్యమున కుపన్యాసములిచ్చుచు గొంతకాల మిల్లువిడచియే గడపిరి. గొప్పగళముతో అసమాన వాక్ప్రవాహముతో జనరంజకమైన సూక్తులతో గృహాంతరములందేగాక బహిరంగ

---

1. శ్రీవెంకటేశ్వరప్రెస్, మదరాస్, 1902.

¶ ......................

† సరస్వతీభండారప్రెస్, మదరాసు 1890.

§ ......................

‡ మొదటికూర్పు 1899, రెండవకూర్పు వాణీప్రెస్, బెజవాడ, 1917.

1 మొదటికూర్పు * 1894 రెండవకూర్పు వాణీప్రెస్, గుడివాడ 1911.

† మొదటికూర్పు * 1893 రెండవకూర్పు వాణీప్రెస్, బెజవాడ 1909.

§ వాణీప్రెస్, బెజవాడ 1896.

‡ దేశోపకారిప్రెస్, ఏలూరు 1902.

¶ వాణీప్రెస్, బెజవాడ 1900.

ప్రదేశములలోకూడ వీ రుపన్యసించునప్పుడు వేలజనము చేరెడివారు. సహజముగ సంగీత సాహిత్య ప్రియులగు టచే వక్తృత్వము మఱింత హెచ్చుగ నుండెను.

మదారిసులో నాటకాంధ్రీకరణము.

౧౮౯౬-౯౭ సం|| లలో వీరు ఖండ్రిక సీతారామవరము గ్రామము విషయములో శ్రీరాజా పాపమ్మా రావుబహాదర్ గారితో వ్యాజ్యమాడుచుండు సందర్భమున మదరాసులో నుండిరి. అప్పు డీయనకు మిక్కిలి ప్రేమాస్పదురాలగు కుమార్తె వేమూరి శారదాంబకూడ తన భర్త అక్కడ చదువుచుండుటచే ఆపట్టణములో నుండెను. అక్కడనున్న కాలములో నాపురమందలి ఆంధ్ర విద్యార్థుల ప్రోత్సాహముచే కాళిదాసవిరచిత "యభిజ్ఞానశాకుంతలము"¶ను వీరు శుద్ధాంధ్రములోనికి భాషాంతరీకరించిరి. ఇందు గంగస్థలమున కనుకూలముగ దిమకుమార్తె పాటయందు గొంతి సంగీతభాగముగూడ చేర్పబడెను. "ముద్రారాక్షసము"*నుగూడ అచ్చ తెనుగుననే వ్రాసిరి. మిశ్రాంధ్రములో "ఉత్తరరామచరిత్ర"*"మహావీరచరిత్ర" †"మాలతీమాధవీయము"§ "రత్నావళి"‡ నాటకములను భాషాంతరీకరించిరి. "కురంగగౌరీశంకర"* "మంజరీమధుకరీయ"* నాటకముల స్వతంత్రముగ రచించిరి.

౧౮౯౯ సం లో ఒక ధర్మశాస్త్ర వ్యాజ్యవిషయములో వీరు నిజాంయిలాఖాను బోయి వరంగలుమున్నగు ప్రాంతములలో నుపన్యాసము లిచ్చిరి.

దేవీభాగవతము.

౧౮౯౯ సం|| డిశంబరు నెలలో వీరత్యంత ప్రేమతో పెంచి స్వయముగ విద్యగరపి, సంగీతసాహిత్యములందు నేర్పరిని గావించిన తన కడపటిసంతానమగు శారదాంబ శాశ్వతబ్రహ్మలోకమున కరిగెను. ఈవిచారనివారణోపాయములలో నొకటిగ ౧౯౦౧ సం. లో వీరు దేవీభాగవత1 పురాణమును తెనిగింపమొదగిరి. ఈకారణమును వీరు దేవీభాగవతపీఠికయం దిట్లు వ్రాసిరి. "కారణాంతరవశంబున దైవప్రేరితుండనై శ్రీదేవీభాగవతంబు దెలుగింపంబూని—" ఈదేవీభాగవతము మహాపురాణములలో నొక్కటి. ఈభారమైనకార్యము వీ రయిదుమాసములలో ముగింపగలిగి. దేవీభాగవతపీఠికయందు కవిగారివంశచరిత్రము, స్వీయచరిత్రమును దెలుపబడుటయే గాక వీరి కాంధ్రవ్యాకరణఛందోవిషయములందుగల యభిప్రాయములుగూడ గొంతవఱకు వ్యక్తపరుపబడినవి. ఈగ్రంథ మచ్చుపడుటలో గొంత యాలస్యమయ్యెను ౧౯౦౬ ౧౯౦౭ సం||లలో ముద్రణము ముగిసి ప్రచురింపబడెను. ఇది అల్లూరుసామేశ్వరుని కంకితము గావింపబడెను. వీరు తమగ్రంథము నచ్చొత్తించుచుండగా ములుగు పాపయ్యగారు ఆంధ్రీకరించిన దేవీభాగవతమొకటుండు కలదని వీంకి దెలియవచ్చెను. అధునికులగు తిరుపతి వేంకటేశ్వరకవులు రచియింప మొదలిడిరట్లును దెలియును. దేవీభాగవత రచనకాలమందు గూడ వీరుత్తరాంధ్రదేశమునందు సంచారము గావించుచు, నవమస్కంధమునందలి భక్తికల్పద్రుమశతకము పాలకొండలో రచించిరి.

౧౯౦౧ సం||లో ఆషాఢమాస మధికమా, శ్రావణమధికమా యనుచర్చగలిగి, యీసంశయ విచ్ఛేదనము నిమిత్తము రాజమహేంద్రవరమున నొకపరిషత్తు సమావేశమయ్యెను. అందులకు అధికమాసనిర్ణయము నియమింపబడిన మువ్వురుతీర్మానకర్తలలో శ్రీరాములుగారొక్కరు. సభయందు వీరితీర్మానమే (శ్రావణమధికమని) ప్రబలి యామోదింపబడెను. స్కంధత్రయాత్మకంబగు జ్యోతిషమునందు వీరికిగల ప్రావీణ్యమునకు వీరు వ్రాసిననిర్ణయము † సాక్షీభూతమగుచున్నది.

గ్రంథపరిచయము.

౧౮౯౫ సం లో వీరు న్యాయవాదివృత్తి మానినను ౧౯౦౩ సం||న తననాల్గవకుమారుని వృత్తియందు బ్రవేశపెట్టి ప్రోత్సాహపరచుటకై తిరిగి ప్రవేశించి కొంతకాలము పనిచేసిరి. ఈకాలములోనే ఖండ్రిక సీతారామవరములో నొకపాఠశాల స్థాపించిరి. ౧౯౦౩ సం|| మొదలుకొని వీరు తమగ్రంథముల ప్రాచుర్యమువిషయమై కృషిచేసిరి. కొన్నిటిని స్వయముగను, గొన్నిటిని సాహిత్యవిషయకమాసపత్రికలలోను, దమపుస్తకములను బ్రచురించిరి. ౧౯౦౫ సం||లో ఖండ్రిక సీతారామవరములో వదివఱ కట్టిదేవాలయమును లేకుండుట జూచి చిన్నహామద్దేవాలయమును గట్టించి వసతి గల్పించిరి.

¶ ఆనందప్రెస్, మదారిసు 1898.
† "మంజువాణి," మంజువాణి ప్రెస్, ఏలూరు 1902.
§ "సరస్వతి" సుజనరంజనీ ప్రెస్, కాకినాడ 1900.
‡ "వైజయంతి," వైజయంతి ప్రెస్, మౌంటురోడ్, మద్రాసు 1899.
1 మొదటికూర్పు బాణీప్రెస్, బెజవాడ, 1907

† వివేకవర్ధనీప్రెస్, రాజమండ్రి 1901.

## బుద్ధనాటకము.

బి. ఎల్ పట్టమును బొంది బందరులో మండల న్యాయస్థానమునందు మొదటితరగతి న్యాయవాదిగ నున్నట్టియు, నాంధ్రగీర్వాణములందు ప్రజ్ఞావంతుడై నాటకాదుల రచించి, నాటకప్రదర్శనాపరిజ్ఞానము నభివృద్ధిపరుప బద్ధకంకణుడైనట్టియు, వీరి రెండవకుమారుడు నారాయణరావుగారు ౧౯౦౫ సం॥లో కాలము చేసిరి. చనిపోవునప్పటి కాయన రెండంకములకు పైగా రచించి యున్న "సంగీతరసతరంగిణి" యను బుద్ధనాటకమును¶ శ్రీరాములుగారు పూర్తిగావించిరి.

## షష్టిపూర్తి.

౧౯౦౫ సం॥లో దమ స్వగ్రామమైన అల్లూరగ్రహారమునందు తమ పూర్వులవలన బ్రతిష్ఠింపబడిన శ్రీసోమేశ్వరస్వామికి విమానరూపకమైన యాలయము గట్టించుచు నాగ్రామమందే విస్తరించి యుండుచువచ్చిరి. ఆలయప్రాకారము లేగాక చిన్నసత్రమును గూడ గట్టించిరి. ౧౯౦౬ సం॥ వీనికరువదియేండ్లు నిండుట చే బాల్యక్రీడాస్థానమగు అల్లూరులో షష్ఠిపూర్తిని సక్రమముగ జరుపుకొనిరి. ౧౯౦౬ సం॥ సెప్టెంబరు నెలలో వీరు కొందఱుస్నేహితులవలన వాహూతులై యుత్తరాంధ్రదేశములో నుపన్యాసము లిచ్చుచు సంచారము గావించిరి. ఇందువలన వీరి కజీర్ణసంబంధమైనట్టియు, శ్వాసకోశసంబంధమైనట్టియు, రుగ్మత యేర్పడుటచేత నెల్లూరువచ్చి యక్కడనుండి తమ జ్యేష్ఠకుమారుడున్న బెజవాడకు వచ్చి యౌషధసేవ చేసిరి. కాని యంత ప్రయోజనము కలుగలేదు. ఈసందర్భమున "భృంగరాజమహిమ"†మను నొక వైద్యగ్రంథమును రచించిరి.

## అవసానము.

౧౯౦౭ సం॥లో బెజవాడలో బిపినచంద్రపాలుగారి మహోపన్యాసము జరిగిన సభకు వీ రధ్యక్షతవహించిరి. ఈకాలమునందు వితంతూద్వాహములలో భోజనసంబంధముగల పి. సుబ్రహ్మణ్యము పిన్నకోట కోదండరామయ్యగారియింట జరిగిన యుపనయన సందర్భమున భోజనము చేయుట తటస్థించెను. ఇందుపై సాంఘిక వివాదములు ప్రబలెను. శ్రీరాములుగారు సంఘసంస్కరణప్రియుల పక్షముబూని బెజవాడలో శివాలయమున్నగుచోట్ల ధర్మశాస్త్రవిచారణసహితముగ ప్రసంగములు చేసి ప్రతిపక్షులవాగ్బంధనము గావించిరి. ౧౯౦౭ సం॥ మే నెలమొదలు వీరి దేహస్థితి క్షీణింప నారంభించెను. ౧౯౦౮ సం॥లో వీరి మూడవ కుమారుని కుమార్తె వివాహము జరిగెను. వివాహము జరిగిన పదునారవనాఁడే బంధువులందరు నింటనుండ, వీరు ౬౩ వయేట కీలక సం॥ వైశాఖ శు ౧౫ నాఁడు భగవత్సాన్నిధ్యము నొందిరి.

## (౨)

వీ రాంధ్రదేశమున బలు తెరంగుల బ్రసిద్ధికెక్కిరి. వీరి లోకశాస్త్రమునం దభిమానమనియు, వేదాంతశాస్త్రమునం దభిమానముతక్కువనియు జెప్పవలసుపడను. జ్ఞానాభిలాష మెండు. ఎందుజొచ్చినను పారంగతులు కానిదే తనివితీరదు. ఆంధ్రగీర్వాణములందు ఖండితులు, కవి. సంగీతాభినయశాస్త్రవేత్త,తర్కజ్యోతిషములందు బ్రమాణము. రాజ్యమున న్యాయవాది. సంఘసంస్కరణప్రియులు. వీరు స్వయముగ బాలికాపాఠశాలల స్థాపించుటయు తన కుమార్తెను సంగీతసాహిత్యములందు నేర్పరిని గావించుటయు వీరికిగల స్త్రీవిద్యాభిమానమును వెల్లడిచేయుచున్నవి.

వీరికవిత్వము కేవల మీశ్వరప్రసాదమని తమ దేవీభాగవతమునం దిట్లువ్రాసిరి;—"శ్రీ వేంకటేశ్వరవరప్రసాదసంభూతకవిత్వవిద్యావిశేష విబుధజనకరుణాసంపాదితోభయభాషాపాండితీధురీణ." మఱియు.

"చ. పదియును రెండు వత్సముల
ప్రాయమునందును దిట్టపద్యముల్
వదలక కొన్నికొన్ని చెలు
వంబుగ గూర్చితి సోమలింగప
త్పదమును నిల్పి యట్టి కవి
తారసధన్యుని నన్ను జేయు నా
పదముల చిత్రపంజరని
వాంతుఁడు నిత్యుడు సోమలింగడే!

చ. తిరుపతి వేంకటేశ్వరుడు
దేవశిఖామణి నాకునుం గలా
గుఱుడగునంచు స్వప్నమున
గోరవచించినయట్టి వైభవా
సురవరుఁ జెప్పగా నిఖిల
సూరిజనస్తవనీయుడై కృపా

---

¶"సువర్ణరేఖ," సావిత్రీప్రెస్. కాకినాడ 1907. † మొదటికూర్పు. రెండవకూర్పు. వాణీప్రెస్, బెజవాడ 1907.

12



కరుడగు సోమలింగడని
కాక మఱొండు దలంపనేర్తునే॥

వ. గరుడోత్కలిం భజింప మది
గోరి తదేకపాత్రమూని ని
ద్దరగొన స్వప్నమందు నిశి
దూర్జటియా నిపటంబుపట్టినే
శ్వరుడను శైవు దెవ్వనిని
సమ్మతి మద్గురుజేసి నాతనిన్
దిరుమల వేంకటేశ్వరుని
సేవకభామణి గొల్తునిత్యమున్॥

వీరి కాంధ్రఛందస్సునందు చజలమైత్రి, రఱ, లళ, లభేదములు మున్నగు విషయములపై గల యభిప్రాయములు దేవీభాగవతోపోద్ఘాతము నందు వ్రాయబడెను.

దేవీభాగవతశైలి నాతికఠినము; ధార అనర్గళము. శైలి నిమిత్త మీ క్రిందిపద్యము లుదాహరణముగ నియ్యబడినవి:

ఉ॥ తూరుపునుండి లేచి యల
తోయజమిత్రుని దెచ్చితెచ్చి యు
ద్దారరథంబు వోవుటకు
దద్దయునడ్డముగా శిలామయం
బూరుమునాడు దోపనటు
లున్న నసూరుడు సూచి చెల్లబో
నూర! యిదేమి చిత్రమని
చూడుము దారిని బోవవే మికన్.

కఠినశైలి కుదాహరణములు:—

శా॥ విభ్రాజద్ధరిభక్తియుక్తసుగుణా
విర్భూతి మద్బాలకా
దభ్రోద్రేకకరిమ సత్యతాప్రకటనా
ధర్మప్రీతి తస్సంగ్రహీ
తాభ్రచ్ఛేది సటానిలోగ్ర నఖదా
త్రాది క్రియాజృంభణ
ప్రభ్రష్ట ప్రబలద్ధిరణ్యకశిపు
ప్రాణా నృసింహాకృతీ.

—దేవీభా. ౧౦ స్కం.

వ॥ అనుచు నిజపక్ష వాతోద్ధూత బలాహక వ్రాతుండై యురువడించి మండిత మండలాగ్ర పఖంబులైన తనపాదనఖంబుల నారక్కసుమోరగీరిన రక్తసిక్తవదనుండై వెనుకంజవేయక భీకరంబుగా బోకరింపుచు మునిరాజు నొకతిన్నఁదన్నవచ్చిన నదుమునడ్డమై రత్నఫణుండు దననిజసర్పరూపంబు దాల్చి ప్రళయకాల కీలకీలికీలామాలామూలంబైన కాకోలంబుగ్రక్కుచు యోజనాయత ఫణాసందీప్త మాణిక్యచ్ఛటాచ్ఛటలు దిక్తటంబుల నటింప ఫూత్కారమేదురంబై ఘోరోద్ధరంబు భేదిల్ల నాగండాగొండి కండగిండి దండచేయు కండగాఁడఁ గలచిన కాటుతోన నేలంగూలి వాయుఁ దెఱచి యూడుగలచి గంతుగొట్టినం గాంచి యాద్విజోత్త మాదాముని...

—అభినవగద్య ప్రబంధము.

అచ్చతెలుఁగు వీరికి వశమైనది. శుద్ధాంధ్రనాటకము వీరి శాకుంతలము తప్ప వేఱొండు గానరాదు. శైలినిమిత్తము ఉదా:—

ఉ॥ గుండెలు జల్దరించెడి శ
కుంతలయేగెడి గ్రుక్కగ్రుంకి గొం
తేఁడిన మాటబొంగురుగ
నేడువనేడువఁ జూపుమాసిన దెన్
దండిగ గానకాపునయి
దగ్గఱదీసిన నాదుపాలె యి
ట్లుండఁగ గన్నగేస్తులకె
టో తొలుసారిగ బిడ్డనంపబోన్.

దక్కట్లదండ "తత్సమపదరహితముగ సులభశైలిలో వ్రాయబడినది. సందర్భానుసారముగ దకినీభాషలో నుండి తెలుఁగులో వాడుకగానుండు పదములను, ఆంగ్ల పదములను బ్రయోగింపబడినవి. వక్రగతులు సాధ్యమైనంతవఱకు లేకుండునట్లు వ్రాయబడినది. లోకానుభవమువలన దెలియుచున్న వస్తువులు, వానిగుణములు క్రియలు మాత్రమే దృష్టాంతములుగ గైకొనబడినవి."

ఉదా:—

సీ॥ అచ్చి యెన్నెలకెక్కె నని బుచ్చిఁ జెండ్లాడ
బుచ్చి మిండలవెంటఁ బోవమఱుగు
తోటాకు పసరంచు దోసకాయలు చిన్న
దోసకాయది జల్లుచేసి విడుచు
కోడూరు బురదని మేడూరు బోయిన
మేడూరిలో జాస్తి మెట్టినిన్న
జక్కదాణాకొడి స్వారెక్కఁబూనిన
బోయిబత్తెములకే పోవుగడన

గీ॥ కొంచెమిబ్బంది కలదని క్రొత్త బూని
పాతివిచిన నది దానితాత యగును
అని పలుకు దాసురాముఁ డిట్లచ్చతెనుగు
కబ్బమందమునిండ జక్కట్లదండ.

మృదూక్తులు, సరసోక్తులు, జాతీయములు వీరి సొమ్ము. వీరికిఁగల లోకజ్ఞానమునకు తెలుఁగునాడు సాక్షి. "ఇందు దాయాద్రబ్రాహ్మణశాఖల వర్తనములు, ఆచారవ్యవహారములు, వేషభాషలు, కవిత్వపుపసందకుంద సాధ్యమైనంత నిష్పక్షపాతబుద్ధితో శక్తికొలఁది వర్ణించితి" నని గ్రంథకర్త పీఠికయందు వ్రాసెను. సంఘవిషయములఁగూర్చి యబాధకములగు చమత్కారకావ్యములు మనదేశభాషలలో లేకుండుటంజేసి యాకొఱతదీర్ప వీరుద్యమించిరి. ఈగ్రంథమునుండియుదాహరణములు:—

ఉ॥ త్రుళ్లక నీరుకావిమడి దోవతి కమ్ములు వెళ్ళవిళ్ళ కు
చ్చెళ్లిడికట్టి నీళ్లబుడిచెంబొక చేతనుబట్టి దారిలో
జిళ్లలకొత్తుకొంచు నొక చేఁదడికొళ్లయుపెట్టి పెండ్లిపం
దిళ్లను భోజనాన కరుదెంచును వైదికశేఖరుం డిలన్॥

చ॥ నడవడుల న్నిరోగిసరి
నామమునందును శాక్యమాఘ్యయై
వడి, మడిమట్టలందుఁ దల
వైదికుతో నిక వైష్ణవంబు జొ
ప్పడు సముదాత్తభాగవత భక్తిని
యుక్తి, గోరంతలేదు నల్
గడలఁ బొసంగెడిన్ గణకమ్మకు
గమ్మకు విమ్మతమ్మలన్.

త్రింశతరగణుల వారి వర్తనములు, వేషభాషలు, స్వభావములు, బుద్ధనాటకమునందు జిత్రింపబడియున్నవి.

— గాను దామోదరరావు.

# "పిచ్చిపిల్లా!"

ఇంద్రజాలికశక్తిచె నలరునట్టి
యామినీయక్షసుందరి యంధకార
సుందరునిగూడి జగమెల్ల సొలయఁజేసి
అంతరిక్షమంచఁబున నతఁడు దాను
నేకమౌచును వేలుగా వింపరాక
యొక్కరూపునను సుఖించుచుండఁ బ్రబలి.

... ... ... ...

చారుచంద్రికా పాండుర సౌధభూమి
హంసతూలికాతల్పంబునందుఁ జేరి
చల్లగాలి కోలకు గవాక్షంబుచెంతఁ
గూరుచుండి మొగమున ముంగురులు వ్రాలి
యతిశయించి డాగురుమూత లాడుచుండ
గనువపుడ జూడ్కితో శ్రద్ధ కానరాని
చాతురి యెలర్ప గీతంబు సరసగతిని
బనియునా జొండ్ల చక్కని ప్రమదయొకతె
ప్రమదగాంధర్వ రమవోలెఁ బాడఁజొచ్చె.

... ... ... ...

"అకట! యేమందు నీనిర్దయత్వమేను
ఇన్నిదినములు నన్ను హింసింపనీకుఁ
జెల్లునే వచ్చికౌఁగిటఁ జేర్పరాదె?
భావశూన్యుఁడవే నేను పడెడుబాధ
దేవుఁడెఱుగును మఱినాకుఁ దెలియునింక
భావవిస్తారుఁడవు నీవు ప్రతిభమీర
ఊహసేయగా నెవాక్కొ యూరకిట్లు
నన్ను బాధింపగాఁ బూనినాఁడ వంతె
గాక నాప్రేమ నీవెఱుంగనిదె చెపుమ!

... ... ... ...

"శ్రీకరోయెంతయుఁ బ్రేమతోఁ జేరి నిన్నె
మానసంబునఁ బ్రేమించి మంరియు మరియు
నీనెంతియుంచు నుండగా నీవిధమ్ము
గా నలక్ష్యమ్ము సేయుదే కరుణలేదె?

... ... ... ...

ప్రేమ మెల్లను మొదలంటఁ జెరికివైచి
మరచి—యయ్యదో నన్ను నీమాటికి—మరచి
కఠినచిత్తుఁడవై యుండగలవుగాక
నేనుమాత్రమెప్పటికి నిన్నుమఱవజాలు."

... ... ... ...

గాలిలో లీనమౌచు నా గాన మొందు
రూపు కలయాటితీరుగాఁ దోఁచకుండ
యంధకార సమేతను యామినీర
మణిని నఖిలప్రకృతిని మోన్మఱువఁజేసి
రోలలాడించె నీశ్వరలీలకరణి.

... ... ... ...

చల్లచల్లగా గాద్పురాసాగె మేఘ
పంక్తులు క్రమముగా నభ్రపటలమెల్లఁ
గ్రమ్మెనంతటఁ జల్లనిగాలివచ్చెఁ
గురిసెనొకజల్లు ప్రకృతితో సహసమాప్త
నెంచఁగాఁబోలుఁ దానును నీశ్వరుండు.

... ... ... ...

మబ్బుగ్రమ్మినయంతనె మానసంబు
చెదిరె; మెఱుపులో ధైర్యంబు చిక్కిపోయె
సొగసులొల్కెడి నెమ్మోము చారుకాంతి
హీనమైనట్టి తనువల్లి నెంతయేని
హర్షమునను మెఱుపు పరిహాసమును నొన
రించి సుందరిం గడు వెక్కిరింపఁజొచ్చె
సౌధవాతాయనంబుల సందునుండి
తొంగిచూచుచుఁ దనకును లొంగెనటుచు.

... ... ... ...

"హా! యికెట్లు దుఃఖంబు నేనాఁగఁగలను?
తొలకరించెను గోరిక ల్పులకరించె
నయయొ! వల్లభ! యింతటి యధికకోప
నీవు ప్రాణఁజెల్లనె హసియింపఁజొచ్చె
నీవియోగపు భరముచే నీవిధముగ
శోభదక్కిన నన్ను నీ చుప్పనాతి
మెఱుపునాథు కవుంగిట మిట్టిపడుచు
చూడు మెట్లు విజృంభించె నీచుప్పనాతి!"

... ... ... ...

మూర్ఛవోయె నమ్ముగ్ధయు మూర్ఛ తెలిసి
చూచునంతలోననె పరనుండు ప్రియుండు
కనులుచల్లగా మేనెల్ల గంపమొందఁ
గరముఁ బ్రీతితో వెల్గులఁ గనులుమూసి
పలుకుచుండెను దుఃఖంబు తొలఁగుచుండ:
"కనులకెన్నిమ్మ నిద్దరఁ గాంచలేక
నిముస మొక్కయుగముగ గణించుకొనుచు
హృదయభూమి నీకూపె వసించుచుండ
కఠినచిత్తమ్ముతోడను గడిపినాఁడ
రాత్రు లెట్టులెట్టులో శివరాత్రులట్లు.

... ... ... ...

మధురదరహాస సుధలచే మంజులంబు
అకట నీమోము సౌందర్య మనుభవింపఁ
జాల కిట్టు లలిగి ప్రతిక్షణము మెరయు
చంచలలచేత నెంతయు సౌరుఁగురియు
నిట్టి వానకాలపు రాత్రు లెట్లు లెట్లొ
కడపినాఁడను నేనెంత కఠినమతినొ!

... ... ... ...

ముగ్ధ యిక్కట నీవిట్లు మదమునీడి
దుఃఖమునఁ గుందుచుండఁగ ద్రోహినగుచు
నిన్నినాళులు కినుకవహించి నిన్ను
బాధవెట్టితి నేనును బాధపడితి
చేసినట్టి యపకృతికి శిక్ష యకట!

పొందినాఁడను శాంతంబు బూనుమింకఁ
గోపగింపకు నన్నును గూర్మిజాను
చెప్పుడిట్టి దుర్ణయము గావింపఁబోను
కౌగిలింపుము నన్నును గరుణతోడ
చల్లనౌ ప్రేమ మే నవశక్త్వమంద."

... ... ... ...

... ... ... ...

"ఏలయిట్టులు మిమ్ము నిందించుకొందు
రేను గానె దోసంబు గావించినయది?
కఠినురాలను మిమ్ముల గష్టపెట్టి
కష్టపడితిని నేనెంత కఠినమతినొ!"

... ... ... ...

"ముచ్చటగ ముద్దుగొనఁ జేర వచ్చినపుడు
వలదు వలదంచువారించి బాధపెట్టి
తేల యానాడు? యిటులసేయఁ బోలునోకొ
ప్రేమ మేమాయె నప్పుడు! పిచ్చిపిల్ల!
కాంత నెమ్మోముఁ దమ్మిని గ్రమ్మినట్టి
దుఃఖపటలంబు తనయంత తొలగిపోవ
చారుదరహాసరేఖల సరసకాంతి
పొంగి యుబ్బి తబ్బిబ్బౌచుఁ బొరలిపోవ
లేచి తప్పించుకొనియె సులీల రమణి
తత్పరీరంభణమునకుఁ దనువొసంగ.

... ... ... ...

ఎనయు తనువు లొండొంటి హత్తించి మించి
యొండొరుల కౌగిళ్లలో నొప్పుచున్న
యాద్వయంబు మూర్తిత్వము నందినట్టి
ప్రేమవట్టులు నొకచోటఁ జేరుకొనిన
ప్రకృతిసౌందర్య మట్లుఁ గన్పట్టుచుండె.

... ... ... ...

ప్రతివచింపక చిత్రిత ప్రతిమవోలెఁ
గన్పడంజొచ్చెఁ గాంతుని కఠినబాహు
బంధమున కలిగి మరలఁ బ్రణయకోప
మూని యలకను వహియింపనోపు! — కాదు
కాంతుతోడను నైక్యంబుఁ గాంచఁబోలు!

... ... ... ...

కలమధుర నిశ్వాసంబులు తొలకరింప
నల్లన గళంబు సవరించి యనియె నంత
"ఏనటుల్ సేయకున్నచో నిప్పుడింత
సౌఖ్యమందుదు మొక్కొ యీ సరణి మనము?"

... ... ... ...

మరల నొకపరి విద్యుత్తు మెరసి హర్మ్య
మొప్ప వాతాయనమునుండి యొక్కచూపు
గరువమునఁ జూచె గుండెలు కరిగిపోయె
దంపతుల వెంపు వర్ణింపఁ దరమె యెవరికి?

... ... ... ...

నిద్రవడెనో తటిల్లత! స్వీయసమాగ
మట్లు తన్ను బ్రేమింపఁడం చల్గి కలహ
మునకుఁ బూని యెందయిన బోయెనేమొ!
కాని చంచల యచ్చటఁ గానరాదు.

... ... ... ...

కోడిగూసెను దిక్కులు వాడిపోయె
వేగుఁజుక్క పొడిచియుఁ దానేగె మరల
విసిగి వేసారి రాతిరి వెడలిపోయెఁ
గాని వారి ముద్దులకును గొదవులేదు
వారి కౌగిళ్లకును మితిమేర లేదు.

—దుగ్గిరాల రాఘవచంద్రయ్య.

# చిత్రదర్శనము.

జనులందఱు గాఢవిశ్రాంతి చెందియుండిరి. జనుల సందడి లేదు గాని సెలయేళ్ళ మర్మరఘోష చెవులఁ బగుల్చుచుండెను. ఇటీవలఁ గురిసిన వర్షముల చేతఁ గొండ మీఁదబడిన నీరంతయు భూపతనము సేయుచుండెను.

రాత్రి మూఁడుగంట లగుసరికిఁ బడకటిల్లు వీడి మేడ మీఁదికిఁ బోతిని. వెన్నెల రేఖలు మలినకాంతులతోఁ గూడియుండెను. చిన్నిమేఘము లాకసమంతటఁ బారాడును చంద్రు నొక్కొక్కవేళ మఱుగుపఱచుచుండెను. చలిగాలి సోఁకుకొలఁది నొడలంతయు జలదరించెను. కాని యెప్పుడు తెల్లవారునా యని యాతురముతో నిటు నటుఁ దిరుగుచుంటిని.

ఆకసమున దక్షిణమునఁ దళుక్కుమనెను. అది నాకన్నులఁ దటాలున నావంక కీడ్చినది. అంతలోపల నల్లఁ బాఱిన కాఱుమబ్బు తెల్లకడలఁ గ్రమ్ముకొనెను. కొంతసేపు ఘోరాటవులలోఁ జిక్కి దారిఁ గానక పొదరిండ్లలోఁ దగులుకొన్నవానివలెఁ గనులు గానరాక తనుకలాడితిఁగాని యాకాశమువైపుఁ జూచుకొలఁది నావై[illegible] నేను మఱింగ చీకటులను జలియు నన్నచ్చిటియుండి మఱప్పుఁ జాలకపోయెను. వాన గుఱిసినప్పటికి నాస్థలము వదలఁగూడ దని నిశ్చయించుకొంటిని.

దక్షిణదిక్కున నీలనిబిడమునను మిన్నుం గదగద నాడించుభంగి మెఱుఁగులు మెఱయుచుండెను. ఆకసము బిల్లిపడె ద్రవరస మేఘయో చిందుచున్నచందము దోఁప నొకమహాకాంతి ప్రజ్వరిల్లి నాకను అప్పుల మిఱుమిట్లు గొల్పెను. బంగారు కరఁగించువేళ కంసలి "ఢఘ్ ఢఘ్" అని గొట్టుచూ దముసండ నిప్పునుంచినను జెలరేగు జ్వాలల చిత్రవర్ణజ్యోతులవలెను, ఖండిముయనుమును కొలిమిలో నుంచి పెక్కఁగాఁ గాఁచి సమ్మెటదెబ్బలఁ గొట్టునపుడు చిందఱవందఱగా తెగిపడు నిప్పుకణములవలె ధగధగలాడుచుండెను.

కనులకు విభ్రమముఁ గొలుపు తరంగజాలము లయ్యాలలఁబోలె నూగులాడుసముద్రజలములలోఁ దకతకలాడు రాకేందుని సహస్రాంతర్ప్రతిబింబములు తలఁపునకు వచ్చుచుండెను గాని యీ మెఱుపులకును వానికిని హస్తిమశకాంతరము!


ఆసంరంభముఁ జూచుచున్నంతకాలము—మహావిపత్పరంపరలలో నీఁదులాడుచు దరిదాఁపుఁ గానక భీతావహుఁడై తల్లడిల్లువానివలె నాయుల్లము తల్లడిల్లుచుండినది. దీనికిఁ గారణము దేవునికే యెఱుక! ఆవైభవముఁగూర్చి ముచ్చటించుటకుఁ జేరువ మిత్రు లెవరును లేకపోయిరే యని చాల విలపించితిని.

మఱియొక వైచిత్ర్యము! కటికచీకటిలోఁ క్షణక్షణము వెలుఁగులు పుట్టిపోవుచుండెను. ఆజ్యోతి పుట్టునపుడు చుక్కలయును సాధారణజ్యోత్స్నవలెఁ బ్రకాశించుచు దానిమధ్యమునఁ గత్తులు ఝళిపించినట్లు —సన్నని గీఁతలు— [illegible] మెఱుఁగుచుండెను. [illegible] నన్యాయమయ్యెను, నా కన్నులగలు!

దేవునిదయవలనఁ ద్వరగాఁ దెల్లవారినట్లు తోఁచినది. మబ్బులన్నియు గొంచెముగొంచెము తగ్గెను. తూర్పున సింధూరమువంటి రంగులు గన్పించ మొదలిడెను. పండినదానిమ్మ గింజలు [illegible] బంగారు లేచియుండెను.

... ... ... ...

మాయూర కుత్తరమున దైవనిర్మితమైన గొప్పగోడవలె శేషాచలములున్నవి. పర్వతాగ్రమునఁ బడు వాననీరంతయుఁ జఱియలలోఁ బడి పాఱి యెట్టకేలకుఁ గొండ దక్షిణపార్శ్వమునఁ జాలయెత్తునుండి నిర్ఝరముగఁ బడుచుండెను. బాటసారులకుఁ బోయి చూచువారి [illegible]



కపిల తీర్థము - తిరుపతి.

22

ముల మునుఁగవలెనని నాకోరిక నాడు పుట్టినది. తులామాసాంత్యపుష్కరిణి గనుక జనులు గుంపులు గుంపులుగాఁ బోవుచుండిరి. నేను నాస్నేహితునకు బయలు దేరితిని.

ముఖప్రక్షాళనము గావించుకొంటిని. అది నిర్జనప్రదేశము. ఎల్లెడల— చక్కని పచ్చపువ్వులతో నొప్పారు తంగేడుచెట్లు—కలకలస్వనముల బ్రవహించు కాల్వలలోని నిర్మలసలిలములు—సలిలప్రభావమున నునుపులైన గుండ్రాళ్ళు—శ్వవంతియుఁ గనులపండువు సేయుచుండెను. ఆకసమందు నక్కడక్కడఁ బొగవలె మబ్బులు గ్రమ్మియుండెను. కొన్నిచోట్ల మంచు సైతము కురియుచుండెను.

తెల్లని మబ్బుల పైభాగముల బంగారుపూతతో వంచులు గట్టినట్లు అక్కడక్కడ తళతళ మెఱయుచుండెను. నీలమేఘముల మధ్యమధ్య అగ్నిజ్వాలలవలె మధురారుణకాంతులు ప్రకాశించుచుండెను. సూర్యుఁడు నాకంటికి కగపడలేదుగాని పశ్చిమోత్తరమూలనున్న కొండకొనలమీఁద ఎండ వెలుఁగుచుండెను.

నిముష నిముషమున కానల్లబాతీన మబ్బులెల్ల విచిత్రదీథులుదాల్చెను. కొన్ని విచ్ఛిన్నములైపోయెను. కొన్ని యొకవరుసగట్టి సూర్యునికి దారిచూపి ప్రాకారములకుఁ దొలఁగిపోయెను. కొన్ని మేఘములు బంగారుకొండలవలె నిగనిగలాడెను. అంతఁ గొంతతడవునకు వెడిదేనులవలె మెఱయుచుండెను. ఒరనుండి బయటికిఁదీసినకత్తులవలె ఝళిపించుచు సూర్యకిరణము లాకాశమున దీర్ఘములై నిక్కబొడుచుచుండెను.

... ... ... ...

అంతఁ గొంతసేపటికి జలప్రపాతము గనిపెట్టితిని. ఉత్తరపుకటు పెట్టనిగోడయై యున్నతమహీధరము నడుమభాగము—అంగ్లేయుకీ వేగముచేత నెంతకాలమునుండి కోసికొనిపోయి యుండెనేమో కాని యిప్పుడు కొండను రెండుగాఁజీల్చుచు నిర్మలసలిలభాగములు క్రిందికిఁ బడుచుండెను. దాని యొయ్యడి యమోఘము, అత్యద్భుతము, పాదరసముబోలె మిణమిణప్రకాశించుచు—కరఁగిపోసిన వెండితీగలవలె [illegible] నట్లు [illegible] పిల్లలు [illegible] చేయుచుండెను. [illegible]

కమై తటాకసీమయందు నిరవధికసంచలనముగలిగి ప్రవాహతరంగములు చెలరేఁగుచుండెను.

స్నానమునకై నీటియందు దిగుటకుఁ గడిచితిని. కాళ్ళు నిలఁబడఁజాలక పోయెను. ఊఁకనమ్మాడింపసాగెను. పటిమతరంగకమున వారితరంగముల పార్శ్వములకుఁ జల్లియట నిలఁబడ్డ సుమజాలము జల్లగాఁ దిగుపుచుండెను. మఱికొందు గ్రమ్మఱ కొమ్మలంచు గ్రమ్ముకొనునట్లు కేవల సమీపమయ్యె నెదుటియొడ్డును గనులకు మఱుగుపఱచుచు తీవ్రమైన పైకిలేచు తుంపురుల పరంపరలపై సూర్యకాంతి ప్రతిఫలించుకొనెడిని వివిధవిచిత్రతములగు రంగులు వలయపంక్తులై నింద్రధనుస్సు కేళీకూళి సల్పుచుండెను. ఇవన్నియు నటుండ నంతమునతని యంతజాలఁ దళతళవెలిసి కనులఁ జలితము చేయుచు విభ్రమమును గొలుపు ధవళిమరోప ముక్తాఫలసరుల ననుకరించి సలిలబిందువులు జలజల రాలుచుండెను.

అదేమికారణమోకాని పైనుండి పడు జలములు—తనకుఁ బ్రసరించి గంభీరముగఁ బైకెగిరి గునగునయాడుచు లీడిపడుచుండి మరలించిన యేనుగుగున్న తొండముయొక్క క్రీడావిలాసమును దప్పక స్ఫూర్తికిఁ దెచ్చుచుండెను.

దానిఁ గపిలతీర్థమనియెదరు. పూర్వము కపిలమహర్షి తపముచేసిన స్థలమనియు, కపిలేశ్వరనామధేయముతో నచ్చట వెలసియున్న శివలింగము కపిలప్రతిష్ఠ యనియు పురాణప్రసిద్ధము. గుడికానుకొని తూరుపునఁ బెట్టని ప్రాకారమై సూర్యరశ్మి నాపుసేయుచు కొండయొక్క దక్షిణమున నిక్కబొడుచుకొని దానినుండి కాపాడు కట్టనిమిద్దెయై తనయ గట్టిచేటును దిగువఁ బ్రతిష్ఠాపితులయిన పార్వతీపరమేశ్వరుల మందరవిగ్రహములు కనులకానందముఁ గూర్చు ప్రకృతిదేవి స్వరూపములని చెప్పుట యతిశయోక్తి కానేరదు. అగుడికి బయటి ప్రాకారమున హరిద్రాచూర్ణముల నలంకృతములై చుట్టును, దిక్కులందు నాగరములు మద్దులు [illegible] పుచుండ నున్నతోజ్జ్వలమైన యశ్వత్థమహావృక్షమును [illegible] తరువులు చెల్లిచెట్టులు [illegible]

## వాసంతస్మృతి.

నవచూతావళి పల్లవింపఁగ వసంతప్రేమ చేతన్ దిగం
త వనాంతంబుల మత్తభృంగరము చింతాగానముల్ సల్పఁగా
జివ్వురుల్ వెట్టెఁ గ్రసు నవోమల సుధాస్నిగ్ధాత్మసీమన్ దురం
తవియోగవ్యథ నాకు మిత్రమ్ముదుహార్దంబుల్ స్మృతిన్ బాయుటన్

మన, మెక్కుం జెలికాఁడు మన్మథునకు న్మాధుర్యపుం బ్రోక పు
ష్పనవోఢాహృదయావలంబనపు సౌభాగ్యంబు శారీపికా
ళి నితాంతార్ద్రమనోహరశ్రుతుల కేళీవాస మీ చైత్రుఁ డో
య్యన వెంటం గొనివచ్చె దుస్సహనయస్యాగ్ర పూర్వశోక స్మృతుల్

తరుగుల్మాళిని భవ్యశోభలను సౌందర్యాంబుధిం దేల్చి పు
ష్పగమాక్రాంత మరుత్పరంపర వసంతాచక్ర మామోదవా
గురఁ దోఁగింప వెలుంగు నీసురభి నాకున్ దివ్యమందార పు
ష్ప రసామోద సహోదరంబు లగు భావశ్రేణిఁ గల్పించెడిన్

నిఖిలంబై గతజీవనా జగతి సంజీవంబు నొందించు మ
న్మథమిత్రుం డెపుడెప్పు డీప్రకృతి కున్మాదంబు గావించుచున్
బృథివిన్ రూపము నొందు నప్పుడు హృదీవ్యథన్ మఱి న్నూతన
వ్యథతో నూతనరూప మొందును వయస్యా నూనదుఃఖం బొకన్ గాని

—నోరి నరసింహశాస్త్రి, బి. ఏ.

## సంకేతస్థానము.

(శ్రీ రవీంద్రనాథ టాకురు పద్యముల కనువాదము.)

౧.

శ్రీ శ్రీ బుద్ధదేవుని శిష్యుఁడగు ఉపగుప్తుఁడు మధురాపట్టణప్రాకారప్రాంతమున ధూళిలోఁ బరుండి నిద్రపోవుచుండెను.

పురమున దీపిక లదృశ్యమయినవి. తలుపు లన్నియు మూయఁబడినవి. అది శ్రావణమాసము. అస్వచ్ఛముగు నాకాశమున నక్షత్రములు మేఘములమాటున డాగి యున్నవి.

మంజీరధ్వనులు పలుకుచు నింతలో నాతని వక్షఃస్థలమును దాకిన యాపాద మెవ్వరిది?

ఉలికిపడి యాతఁడు మేల్కాంచెను. ఆ కామిని పట్టిన దీపికనుండి వెలువడు నస్పష్టకాంతులు క్షమాన్వితములగు నాతని నేత్రములపైఁ బడెను.

ఆమె వారాంగన. యౌవనమధుపానమత్త. అలంకారనుభూషిత. హేమోత్తరీయసంఛాదిత హేమగాత్రి. ఆమె దీపికను వంచి నిష్ఠురసౌందర్యవిభాసితమగు నాతని లేతమోము వీక్షించినది.

"తరుణసన్యాసీ! క్షమింపుము. నాయింటికి విందవు కమ్ము. ప్రసన్నుఁడవగుము. ధూళిధూసరిత భూతలము నీ కుచితశయ్యాతలము గాదు!" అని యామె పలికినది.

[illegible] "రూపసీ! నీదారి నీవు పొమ్ము. అవసరము వచ్చినప్పుడు నేవచ్చి నిన్నుఁ జూతును."

అకస్మికముగా నసితనిశీథిని విద్యుజ్జ్వాలిక లనెడి దంతములు దెఱచి చూపెను.

ఆకాశకోణమునుండి ప్రభంజనము గర్జించెను. ఆ కామిని భయముచేఁ గంపించెను.

౨.

సంవత్సరాది యింకను రాలేదు.

వాయువు మున్ముగముగా వీచుచుండెను. బాట ప్రక్కల వృక్షశాఖలు పూగుత్తులబరువుతో మూలుగుచున్నవి. దవ్వులనుండి వసంతవాయువులపై మురళీమోహనరవములు తేలియాడుచు వచ్చుచున్నవి.

పుష్పోత్సవమునకై పురజనులు వనముల కేగిరి. పత్తనము నిశ్శబ్దముగా నున్నది. తచ్ఛాయలఁ గాంచి పూర్ణచంద్రుఁడు మింటఁ జిఱునవ్వు నవ్వుచున్నాఁడు.

తరుణసన్యాసి నిర్జనమగు నాపురవీధుల వెంటఁ బోవుచున్నాఁడు.

రసాలశాఖలనుండి కామోన్మత్తలగు పికాంగనలు విరహగీతములు పాడుచున్నవి.

ఉపగుప్తుఁడు పురద్వారము వెలువడి [illegible] నిలువఁబడెను.

ఆతని పాదములకడ గోడనీడలో భూమిపై బడియున్న యా స్త్రీ యెవరు?

ఆమెకు మహామారిజాడ్యము తగిలినది. శరీరమునిండ వ్రణసమూహము. తాకినవారు చత్తురను భయము నామె నూరిబయటికి దొరలించినది.

సన్యాసి యామె పజ్జ గూరుచున్నాడు. ఆమె శిరము తన యంకమునం దుంచుకొన్నాడు. నీటితో నామె పెదవులు దడిపినాడు. ఆమె శరీరమునిండ సుపళమ నౌషధము పూసినాడు.

"కరుణామయా! నీవు నాపాలిటి దేవతవా? ఎవరవు?" అని యామె వాని నడిగెను.

"ఇన్నాళ్ళకు నిన్నుజూడ నా కవసరము వచ్చినది. నేను వచ్చితిని." అని తరుణసన్యాసి ప్రత్యుత్తర మిచ్చినాడు.

—చింతా దీక్షితులు, బి. ఎ., యల్. టి.

# గ్రంథాలయములు— అప్పుడు - ఇప్పుడు.

గ్రంథాలయభారతి కాలగతిచే నాటినుండి నేటివరకెట్టి మార్పుల నొందెనో గ్రంథాలయచరిత్రము నొకసారి సింహావలోకనము చేసి చూతుమేని, అంతయు విస్పష్టము కాగలదు. ప్రాచీనకాలమున కూడ ప్రస్తుతకాలమున గ్రంథాలయముల స్థాపనము నిర్వహణమును జరుపబడిన ట్లాకాలమున కూడ గ్రంథాలయనిర్వాహకులు వివిధగ్రంథకర్తల కడకును గ్రంథసంపత్తు గలవారికడకును పోయి వారి గ్రంథములను తమ గ్రంథాలయమునకు ఉచితముగ నొసగుడని ప్రార్థించియు, కొన్ని గ్రంథములను వాని మూల్యము లిచ్చి కొనుటయు మొదలైన గ్రంథాలయాభివృద్ధి నిమిత్తమె యవలంబింపబడు కార్యవిధానము ఆచరణలో నుండెనా యను విషయమే యాలోచింపదగినది. ఆకాలమున యీ పేర్కొనబడిన గ్రంథాలయనిర్వహణవిధాన మంతగా ప్రచారములో నుండకపోయినను, ఏదేశముయొక్క గ్రంథాలయచరిత్ర పరికించి చూచినను, ప్రస్తుతకాలమున గ్రంథాలయాభివృద్ధికై గ్రంథాలయములు జాతీయపురోభివృద్ధిహేతుకములని గుర్తించినవారిచే చేయబడుచున్న నిరంతరకృషి, ఆడంబరము, ఆకాలమున నున్నట్లు తోచదు. గ్రంథాలయమును పోషించుటకుగాను గ్రంథముల నొక గ్రంథాలయమునుండి గైకొని చదువువారలవద్ద రుసుముగా కొంతధనమును గైకొనవలసిన యావశ్యకతయు యానాడుండినట్లు కనుపడదు. ఈభేదపరిస్థితులు కలుగుట కానాటికిని, యీనాటికిని కాలచక్రభ్రమణముచే సాంఘిక, రాజకీయ, నైతికపరిస్థితులు వ్యత్యాసముగ మారుటయే కారణము.

గ్రంథము లాకాలమున సరస్వతియొక్క రూపాంతరములుగ పరిగణింపబడుటచే గొప్పగొప్ప దేవళములయు, కొందరు గృహములయు నాశ్రయము నపేక్షించినవి. దేవాలయములే గ్రంథసమితికి శరణ్యములైనవి. మతగ్రంథము లన్నియు పవిత్రమగు దేవళముల యావరణములలోనే పఠింపబడుచుండెడివి. మనము సాయంకాలమందు గ్రంథాలయములకు గ్రంథములకు, వార్తాపత్రికలకు చదువుకొనుటకు వెళ్ళునట్లు పూర్వకాలమున సూర్యాస్తమయ సమయములందు దేవతాదర్శనము చేయుటకు భక్తులందరును వెళ్ళుచుండెడివారు. అచ్చట దేవళములో యొక శాస్త్రులవారు మతగ్రంథమునో చదువుచుందురు. ఆధ్యాత్మిక చింతతో దేవళమునకు పోవువారు గ్రంథపఠనలాభములను పొందుచుండిరి. ఇప్పటికిని యీ యాచారము బందరులో కలదు. మనపూర్వులెట్టి యాచారవ్యవహారముల నేర్పరచినను ఆయాకర్మల యంతర్భాగమున యాధ్యాత్మిక సాంప్రదాయముల శ్రుతియొక్క నైజమగు ధ్వని, మానసిక నేత్రములతో చూచువారలకు గోచరించును.

## అనుశ్రుతము వంశపారంపర్యము.

చాతుర్వర్ణ్యములవారును, అనుశ్రుతముగను వంశపారంపర్యాధికారమునుబట్టియు వారివారి వృత్తివిద్యల నభ్యసించుచు వారివారి మేధస్సులలోనే యెవరిగ్రంథాలయమును వారు చక్కగ స్థాపించుకొని వృద్ధిపొందించుకొనుచుండిరి. ఇట్టి మేధస్సులే యవిచ్ఛిన్నములగు గ్రంథాలయములుగ చిరకాలము నిలువగలిగినను విద్య యక్షరరూపము దాల్చియు, గ్రంథరూపమును దాల్చియు అక్షరముగనుండి అందరి యందుబాటులోనుండుట కవకాశముండదు. వారి మేధస్సులలోనుండు యమూల్యభావరత్నములు కొన్ని, వారు మృత్యువువాతబడినప్పుడు వారి మేధస్సులతోనే యంతరించుచున్నవి. కాని యావిద్యలు గ్రంథరూపమును దాల్చినచో వాని సంరక్షణము నిమిత్తము అపేక్షణీయములుగను, పాఠకుల కాళ్ళక పంతెములుగను, భవ్యదీపకములుగను యుండునట్లు

ఆలయముల నిర్మించి యమూల్యగ్రంథముల నట్టిచోట్ల జేర్చుచో నాగ్రంథము లెందఱికిని యందుబాటులో నుండకుండుటచేసి, ప్రజలందఱు, ఆయాగ్రంథములను చదివి జ్ఞానము నార్జించి దేశము నభ్యున్నతికిఁ దెచ్చు మేధాసంపన్ను లగు పౌరులు కాఁగలరు. నిప్పు, నీరు అను మహాబలాన్వితములగు ప్రాకృతిక శక్తులలో నేది గాంచినది యగుట వాని యాగ్రహమున కీగ్రంథాలయములు గురి కాకుండ నుండుటకే గ్రంథములన్నియు శిలానిర్మితములగు దేవళములయు, కొండగుహలయు శరణు జొచ్చినవి. అనిలానలములదాడి కోర్చుటకు పూర్వకాలపు తాళపత్ర గ్రంథములు, భూర్జపత్ర గ్రంథములును నెంతెశక్యముకలవియో, శాస్త్రజ్ఞానము నార్జించితిమి, నూతన సృష్టులను చేయఁగలుగుచున్నారమని గర్వించు పాశ్చాత్త్యులు సృజించిన సౌలభ్యములును, సుందరములుగా, అగు కాగితములతో నిర్మింపబడు గ్రంథములును అంతే శక్యము కలవని యటీవల, యున్నతశిఖరము నధిరోహించిన నాగరకతతో తులతూగుదినములలో నయ్యెదలిన ప్రకృతిశాస్త్ర జ్ఞానధనులగు పాశ్చాత్యజాతుల మహాసంరంభమున మూఁగుచు మహాసంగ్రామమే ప్రపంచమునకు ఘంటాపథముగఁ జాటినది. అనేక పురాతన యూరోపుఖండస్థ గ్రంథాలయములు బాంబుపాలిమచే భగ్నములైనవి. బాంబులు గ్రంథాలయములకు గల్పిన నీతికనువర్తనముగనుండునట్లు పుస్తకములను నిప్పుదడి నుండి కాపాడుట, చేయుటయెట్లని యొకనూతనసమస్య ప్రకృతిశాస్త్రవేత్తల దృష్టిపథమున బీభత్సాకారముతో నిలిచినది. ఒక ప్రకృతిశాస్త్రజ్ఞానధనుఁడు పరిశోధనంజేసి విద్యుచ్ఛక్తిని తనకు సహాయ్యముగా నైకొని "నికేల్" ఉక్కు మొదలగు ఖనిజములనుండి మనముపయోగించు కాగితముల దళసరిరేకులై యెన్నియో మడుగులు పలుచనై యుండునట్లు రేకులను సృజింప నారంభించెను. అందువలన కాగితములతో నిర్మింపబడుటచే యొక్కడు మూలములుగా నుండు గ్రంథములు యీనూతన ఖనిజపురేకులతో తయారు చేయబడినచో యంత గ్రంథమే చాల దళసరి తక్కువగ నుండునట్లు తయారగునను. ఇప్పుడా శాస్త్రజ్ఞుఁడా ఖనిజపురేకులపై చక్కగ అక్షరములను ముద్రించుటెట్లని పరిశోధనలు చేయుచున్నాఁడు. ఈశాస్త్రజ్ఞుడు తనశాస్త్ర పరిశోధనలవలన కృతార్థుఁడయ్యెనా, మనపుణ్యము పండినట్లే యోచవలసినవారలమగుదము. ఎందువలన నన, ఇట్టి గ్రంథములవలన గ్రంథముల నుంచుటకు తక్కువ స్థలముపట్టును. నిప్పుచేతను, నీటిచేతను మార్పుచెందజాలవు. తేలికగ నుండుటచే అతి విస్తృతగ్రంథములనగూడ యవలీలగ గొనిపోవచ్చును.

## మానసికతత్వశాస్త్ర రహస్యములు.

ఏవో కల్లిబొల్లి గ్రంథములను వారిని వీరిని యాచించి కొనివచ్చి యొకచో జేర్చినవి; గ్రంథాలయమును స్థాపించితిమని గర్వింపవలసిన దినములు వెడలినవి. గ్రంథాలయ నిర్వాహకులపై గొప్ప బాధ్యతలు పడినవి. గ్రంథకర్తలేగాక గ్రంథాలయ నిర్వాహకులుకూడ ప్రజాసామాన్యము యొక్క యభిరుచులెట్లు మారుచున్నవో, అట్లు మారుట కేమికారణము లుండనో వారి మేధస్సులోను, హృదయములోను (రాత్రి)కాలమునందు దొంగ, దొంగతనము చేయుటకు బయల్వెడలినట్లు, ప్రజాసామాన్యమున వెలుగుచు) ప్రవేశించి నెట్లుంచి వానితత్వములను ముందుగా స్వాధీనము చేసికొని తదనుగుణముగ తాళము వేయవలసినవారలగుచున్నారు. ప్రజాసామాన్యమానసమును పరిపక్వము కొనఁజాలిన చింతామణి తాల్యది గ్రంథములను గ్రంథకర్తలు ప్రజాసామాన్యమానసమును తరచి తరచి తెలిసికొని గ్రంథములను వ్రాయవలెను. ఇట్టివనిని యటి సామాజనరంజకములగు సాహిత్యమునే సృష్టిచేయవలెననియే నాయభిమతము కాదు. భిన్నభిన్న ప్రకృతులుగల మనజనమానసములకు రంజకతను కల్పించునట్టు సారస్వతము సర్వతోముఖముగ వ్యాప్తిగాంచవలెను. గ్రంథాలయములో యీ క్రింద వివరింపబడినట్లు కొన్నిశాఖలు యేర్పడుబడవలెను.

1 బాలశాఖ, బాలికాశాఖ
2 యువకులశాఖ— యువతులశాఖ (గృహిణులు)
3 వృద్ధులశాఖ— వేదాంతాది మతగ్రంథములు
4 పరిశోధకులశాఖ
5 పారిశ్రామికశాఖ.

ఈవిభజనమువలన జీవితములో యీ భిన్నవ్యక్తులు వారి యభిరుచినిబట్టి తమకు కావలసిన గ్రంథములను యిచ్ఛామాత్రమున బీరువాలనుండి గ్రహింప సమర్థులై యుండవలెను. గ్రంథాలయము పాఠకుల వినియోగమునకై తెరచియుండు కాలమున గ్రంథాలయాధికారులు బీరువాల తాళపులను (బాగుగా) తెరచియుంచి తమ గ్రంథాలయ యుదార హృదయమును గ్రంథపాఠకులకు వెల్లడించవలెను. అటులచేయుచో మానసిక చాపల్యముగల యీవన్నెన గ్రంథహరణమునకు పాల్పడుదురని భయమున్నచో వారు గ్రంథాలయమును విడచి బయటకు వెడలు

ద్వారముకడ నొకరు కూర్చుండి యట్టివారిని పరీక్షించిన బాగుండును. అటులగాక పాఠకులుగా గ్రంథాలయమునకు వచ్చువారి నందఱిని పెద్దమనుష్యులుగా నెంచి పూర్ణముగ నమ్ముచుండుట యది మేలే! ఈవిధానము కొన్ని పాశ్చాత్యదేశ గ్రంథాలయములలో నవలంబింపఁబడుచున్నదనిన అతిశయోక్తి కాదు. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు దేవాలయములనుగుఱించి వ్రాసిన వ్యాసములో దేవాలయపుసిబ్బందియని చరిత్రాధారములను చూపి పేర్కొనిరి. ఉదా:—పూజారులు, సానులు, పరిచారి, వైద్యుడు. మద్దెలవాడు, జయఘంటవాడు, కమ్మరి, వడ్రంగి మొ॥ ఆదేవిధమున గ్రంథాలయపుసిబ్బందికూడ యుండవలయును. అటులున్ననేగాని గ్రంథాలయములను నిర్వహించుట కష్టము. గ్రంథాలయమును సరస్వతీదేవళమున అవసరమునుబట్టి యొకరిద్దరు* పూజారులుండవలెను.

రైలుబండిలోగాని యితరచోట్లగాని హిందువులును మహమ్మదీయులును ఐరోపియనులును భోజనముచేయు అల్పాహారశాలలకు పోవువారి యభిరుచులను, అచ్చటాహారములను వడ్డించువారెఱింగిగాని లేక వారినడిగి తెలిసికొనిగాని వారికి కావలసినవి గొనివచ్చి వడ్డించినట్లే గ్రంథాలయమున గ్రంథాలయాధికారులపై చదువరులకు వారికిష్టమగు గ్రంథములను గ్రహించుట కన్ని సదుపాయములును చేయవలసిన బాధ్యత గలదు.

—ఆకుండి వెంకటశాస్త్రి.

# పాపరాజకవి ప్రశంస.

గీ॥ రసముచిప్పిల; నుత్తరరామచరిత
మాంధ్రగీర్వాణ రచనల ననువదించి
ప్రౌఢిమాపిన కంకంటి పాపరాజు
పండితులలోన శ్లాఘనీయుండు గాఁడె? 1

గీ॥ కొన్నిచోటులఁ దిక్కన్నకన్న మించి
కొన్నిపట్టుల శ్రీనాథుగుణము గాంచి
కొన్నియెడలను బెద్దన్న చెన్ను వడసి
పాపరాజు రచించెఁ గావ్యము; నయారె! 2

గీ॥ పాకపంపాకమునఁ గాదు పాపరాజు
కల్పనాకౌశలమునఁ దిక్కన రచించి
నట్టి రామాయణముకన్న నన్నగతులఁ
నలరయించెను; నెంత ప్రజ్ఞాన్వితుండో! 3

గీ॥ పాపరాజ కవీంద్రు ప్రబంధమందు
శబ్దచిత్రమ్ము లెన్నొని సంఘటిల్లి
నట్టి సామాన్యకవుల కావ్యముల నున్న
పగిది పృథకాని సంసార్థబంధురములు। 4

గీ॥ వృత్తులును, భావ, శయ్యాప్రభేదములును
ధ్వనులు, రీతులు, వర్ణసందర్భములును
నెట్టు వెలయింపవలయుఁ దా నట్టు లరసి
కూర్చెఁ గృతి పాపరాట్కవికుంజరుండు॥ 5

గీ॥ ఇపుఁ డెంపార ననవద్యహృద్యశబ్ద
రత్నపుంగల్మిఁ గావ్యదివ్యను ఘటించి
ప్రతిభపడసిన యల పాపరాజువారి
కృతిరచించిన సర్వసమ్మతము గాదె? 6

గీ॥ జన్మ మలరింపఁ గర్ణరసాయనముగ
నవరసమ్ములు వెలయ వర్ణనలు పెంచి
భగవదర్పితముగను గావ్యము రచించెఁ
దలఁప నితఁ డెంతయును ధన్యతముఁడు గాఁడె? 7

గీ॥ సరసమై మనోహరమునై చవులుగొలుపు
కవనమునఁ గాక పాపరాట్కవివరుండు
నయశాస్త్రభూమిఁ దత్త్వవిజ్ఞానగరిమ
గణితశాస్త్రనైపుణిని బ్రఖ్యాతిఁ గాంచె! 8

గీ॥ కూర్మి మైఁ బాపరాజవాగ్గుంభనముల
నరసి యెల్లెడ నాధునికాంధ్రకవులు
స్ఫురదలంకారకలితమై సొంపుగులుకు
సంస్కరింతురుగాక! భాషావధూటి॥ 9

—గున్నేపల్లి అక్షయలింగము.

# పశ్చిమ గోదావరిమండల గ్రంథాలయ సభ.

౧౯౨౩ సం॥ ఏప్రియల్ నెల ౧౯-వ తేది మధ్యాహ్నమున భీమవరంగ్రామమున ప్రథమ పశ్చిమ గోదావరిమండల గ్రంథాలయ ప్రతినిధులసభ సమావేశమైనది. కోపల్లె, పరిపల్లె, గునుపూడి, కుముదవల్లి, ఆకువీడు, నిడమర్రు, రాయకుదురు, పోలమూరు, వీరవాసరం, గోపవరం, కొవ్వూరు, పాలకొల్లు, నర్సాపురం మున్నగు గ్రామముల గ్రంథాలయములనుండి ప్రతినిధులు విచ్చేసిరి.

ప్రథమమున దైవప్రార్థన జరిగినపిమ్మట ఆహ్వాన సంఘాధ్యక్షులగు నిడమర్తి లక్ష్మీనారాయణగారు ఈ క్రింద వివరించినప్రకారము స్వాగతోపన్యాసమును జదివిరి.

## ఆహ్వాన సంఘాధ్యక్షుని యుపన్యాసము.

ఈగ్రంథాలయ మహాజనసభను యీ పురంబునకు ఆహ్వానించి ఈసభ జయప్రదముగా జరుపుటకు అనేక వ్యయప్రయాసల కోర్చి కార్యనిర్వహణ మొనర్చినట్టియు, గ్రంథాలయోద్యమాభివృద్ధికి పాటుబడి కార్యదీక్షతో పని చేసినట్టియు నా సోదరసభ్యులలో అందు ముఖ్యముగ గ్రంథాలయోద్యమమునందు స్వార్థత్యాగము, కార్యదీక్ష, అంతర్ముఖత్వము కలిగి చిరకాలము అనగా, 26 సం॥లనుండి ఎడతెగని కార్యదీక్షతో విచ్ఛిత్తి లేకుండగ పనిచేసి యీతాలూకాప్రజలకేగాక యిక్కాలమునందు ఆంధ్రదేశమునకు యీ యుద్యమమునందు ఆదర్శప్రాయులని కీర్తించతగిన శ్రీయుతులు భూపతిరాజు తిరుపతిరాజుగారు ఉండగా ఏవిధమైన కార్యము చేయుటకు నిరర్హకుడనైయున్న నేను యీస్థానమున గూర్చుండి యేమేమో చెప్పుటకు మనసొప్పక యిక్కార్యమునకు శ్రీ తిరుపతిరాజుగారే తగియుందురుగాని నేను అనర్హుడనని మనవిచేసినప్పటికి నాయందుగల అవ్యాజవాత్సల్యముచే నా సోదరసభ్యులు నన్నే నియమించినందున యిందుల కంగీకరించితిని.

## గ్రంథాలయములు—(సరస్వతీభవనములు).

భగవంతునిచే సృజింపబడు సమస్తజీవరాసులకు ఆహార, నిద్ర, మైథున భావములు సమానమైనప్పటికి అందు మానవజాతి అగ్రగణ్యముగా పరిగణింపబడుటకు నాధారమైన యుక్తాయుక్త వివేచనాజ్ఞానము పొందుటకు కారణమైన జాతీయవిద్యకు నిలయములైన గ్రంథరాజములయొక్క పఠనీయముచే మానవ ఐహిక ఆధ్యాత్మిక జ్ఞానము నభివృద్ధినొందించు సరస్వతీనిలయభవనములే గ్రంథాలయము లనంబరగు. దేశాభివృద్ధికి అవసరమగు సమస్త ఉద్యమములలో గ్రంథాలయోద్యమము పునాదియనియును, అట్టిపునాది దిట్టముగలేనిచో ఏయుద్యమము నభివృద్ధినొందుట కష్టమనియు మనవిచేయుచున్నాను.

## జాతీయవిద్య.

ఇప్పటి మనప్రభుత్వాధీన నియమితవిద్య అన్యభాషా సాంప్రదాయ ప్రాధాన్యమై సామాన్యముగ మూడువంతులు మన శాస్త్రములయందు నీచముగా పేర్కొనబడిన నీచకావ్యవృత్తిమాత్రమే ఉపయోగపడుచున్నది. కాని జాతీయవిద్యోద్బోధకమైన గురుసంప్రదాయము కలిగి మానవ ఆత్మాభివృద్ధికి అవసరమగు స్వాతంత్ర్యప్రియత్వము, ఆత్మగౌరవము, నీతి, సత్యము, ధర్మము, స్వార్థత్యాగము, జాతీయత మొదలగు సద్గుణోద్బోధ చేసి దేశాభివృద్ధికి తోడ్పడకపోవుటయేగాక, ఆత్మగౌరవమును. జాతీయతను నశింపచేయుటచే అట్టి జాతీయ విద్యాభివృద్ధికి గ్రంథాలయములే ముఖ్యాధారములని చెప్పనొప్పు.

## కార్యనిర్వహణము.

మన దురదృష్టముచే మనదేశమునుండి తొలగిపోయిన ఐకమత్యము, దేశభక్తి, కార్యనిర్వహణశక్తి, ప్రపంచ జ్ఞానానుభవములు, రాజకీయజ్ఞానము, మొదలగు అలవడి జనము నభివృద్ధినొందించుటకు గ్రంథాలయములే ఎక్కువగా ఉపయోగపడినవి. 1911 సంవత్సరమునుండి 1920 సంవత్సరమువరకు దేశీయమహాజనసభవారు శాసించిన కార్యములు చేయుటలోను జాతీయవిద్యాభివృద్ధికిగాని, యితర దేశసంబంధమైన కార్యములకు ధనము సమకూర్చి సహాయము చేయుటయందుగాని, ప్రజలు దేశీయమహాజనసభా కార్యములయందు పాల్గొని జంకుగొంకులేక పనిచేయుటకు బోధించుటయందుగాని గ్రంథాలయసంఘములు చేసినపనులు తారాగణమై యున్నవి.

## స్త్రీజాత్యభివృద్ధి.

మనలను కని పెంచి జన్మాదినుండియు మంచి సద్గుణోద్బోధచేసి మనలను జ్ఞానవయస్కులనుగా పెంపొందించియు వారుకూడ మనవలె దేశసేవచేసియు దేశాభివృద్ధికి తోడ్పడతగిన స్త్రీజాతి మూర్ఖనిద్రావస్థలో నున్నంత

కాలమ్ము మనము పొందు యభివృద్ధి మేలిపండువంటిదై అనిష్టమునకు కారణమగును గాన పూర్వమెట్లప్పుడు విద్యావతులకములై, పాతివ్రత్యము, మనోనిగ్రహము భక్తి, సచ్ఛీలము, శౌర్యము, గాంభీర్యము, ఆత్మసమర్పణశక్తి, శాంతి మొదలగు గుణసంప్రదాయప్రవర్తనచే ప్రపంచాదర్శప్రాయమైన అద్వితీయ ఖ్యాతిని గడించి మనదేశమునకు, జాతికి, మహోత్కృష్టకీర్తిని గడించి కాలయోగముచే అజ్ఞానదశలోనున్న స్త్రీజాతి తిరిగి పూర్వదశకు రావలెనన్న, పూర్వము ప్రపంచాదర్శప్రాయలై విరాజిల్లి స్మృతిజీవులైన, సీత, సావిత్రి, దమయంతి, ద్రౌపది మొదలగు మహాపతివ్రతలచరిత్రల పఠనీయమే ముఖ్యాధారమని మనవిచేయుచున్నాను. అట్టి చరిత్రజ్ఞానము స్త్రీలోకము పొందుటకు గ్రంథాలయములు తప్ప వేరొకసాధనము గాన్పింపదు.

## జనసామాన్య విజ్ఞానాభివృద్ధి.

ప్రపంచమునందు సమస్తవిషయములలోను అభివృద్ధిజెంది నవనాగరికాగ్రగణ్యములని ప్రసిద్ధిజెందిన జర్మని, అమెరికా, మొదలగు పాశ్చాత్యదేశములుకూడ గ్రంథాలయోద్యమమువలననే సమస్తవిషయవిజ్ఞానము నొందినట్లును జనసామాన్యముయొక్క విజ్ఞానాభివృద్ధికికూడ గ్రంథాలయములే ఎక్కువ ఉపయోగపడినట్లును కన్పట్టుచున్నది. ప్రస్తుతకాలమునందు మనదేశముత్తములో, బరోడాదేశప్రజలు, ప్రపంచజ్ఞానానుభవముగలవారై విజ్ఞానదాయకులై యుండుటకు కారణము ప్రజాప్రభున్యాయముతో ప్రజల బిడ్డవోలె పరిపాలించుచు ప్రజలు విజ్ఞానవంతులైనప్పుడే తమ రాజరికము జ్ఞానదాయకమై కీర్తినొందునని గ్రహించి వారు నెలకొల్పిన గ్రంథాలయోద్యమమే ముఖ్యాధారమై యున్నది. అయితే యీ ఉద్యమము మహారాయులగు మహారాజావారి పోషణ కలిగియుండుటచే ఎక్కువ అభివృద్ధినొందియున్నదని చెప్పుటయందతిశయోక్తిలేదు. గ్రంథాలయోద్యమమునందు ప్రస్తుతము యీదేశమునందు బరోడారాజ్యమే ఆదర్శప్రాయమైయున్నది.

## గ్రంథాలయోద్యమము మనదేశమున క్రొత్తదిగాదు.

ఇట్టి గ్రంథాలయోద్యమము మనదేశమున క్రొత్తదిగాక అనేకశతాబ్దములక్రిందటనే ప్రారంభింపబడి తత్ప్రస్తుతి గాంచినటుల 17వ శతాబ్దమున తంజావూరునందు ఆంధ్రులచే స్థాపింపబడి 8 లక్షల గ్రంథములతో విరాజిల్లుచున్న గ్రంథాలయమువలనను 19వ శతాబ్దమున బ్రౌన్‌దొరగారి ప్రోత్సాహముచే దొరతనమువారిచే చెన్నపురియందు స్థాపింపబడిన ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమువలనను విశదమగును. అయితే సదరు గ్రంథాలయములు ఆంధ్రదేశమునకు వెలపలనుండుటచే సమస్త ఆంధ్రజనోపయోగము కాకుండుట విచారకరము.

ఈ కాలమునందుగూడ నవీన గ్రంథాలయోద్యమస్థాపనకు ప్రాతిపదిక మన ఆంధ్రదేశమే యనుటకు యాభైమవరం తాలూకాయని చెప్పుకొనుటకు కుముదవల్లిగ్రామములో 1897 సం॥రమున స్థాపింపబడి విచ్ఛిన్నమునొందకుండ నేటివరకు శ్రీ వీరేశలింగకవిసమాజ మను పేరుతో శ్రీయుతులు భూపతిరాజు తిరుపతిరాజుగారు మొదలగు కార్యనిర్వాహకుల కృషిచే గృహము శాశ్వతముగా జరుగుటకు వలయుధనముతో యభివృద్ధినొందియున్న గ్రంథాలయమును 1900 సం॥రమునందు శ్రీయుత నాళం కృష్ణారావుగారు మొదలగువారిచే రాజమహేంద్రవరపట్టణమున శ్రీవీరేశలింగముగారి పేరున స్థాపింపబడి కారణాంతరములచే నేడు గౌతమీగ్రంథాలయమని వాడబడుచున్న గ్రంథాలయమును నిదర్శనములై యున్నవి. ఈ సందర్భమున వారుచేసిన కార్యదీక్షాపరత్వముతోకూడిన దేశసేవను శ్రీయుతులు భూపతిరాజు తిరుపతిరాజుగారు వందనీయులై ఆంధ్రదేశమునకు ఆదర్శప్రాయులై యున్నారు.

## నూతన అభివృద్ధి.

1911-14 సంవత్సరముల నుండియు వివిధప్రదేశముల ధర్మగ్రంథాలయస్థాపన కాబడి అవి అభివృద్ధి నొందుటకును శాశ్వతముగా నిలుచుటకును తగుకృషి చేయుటకై ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము స్థాపింపబడి అనేక కష్టనష్టములకోర్చి త్యాగదీక్షలతో దేశసేవానిరతులై శ్రీయుత అయ్యంకి వెంకటరమణయ్యపంతులుగారు పాటుబడుటచే 1920 సం॥రం వరకు గొప్పయభివృద్ధిఅయినపని జరిగినది. ఈ విషయమునందు పంతులుగారాంధ్రదేశకృతజ్ఞతకు పాత్రులును, వందనీయులును అయియున్నారు.

దుర్మిలాను వెంకటరమణయ్య పంతులుగారికి కలిగిన యిబ్బందులచేతను, ఆరోగ్యవిహీనముచేతను, యీదేశములోని గాంధీకీయసందర్భములో పట్టణములందలి యుండుటచేతను, పట్టణములయందు పనిజరుగుచున్నను పల్లెలయందు గ్రంథాలయోద్యమము నామమాత్రావశిష్టమై యుండుటకడు విచారకరము. దేశాభివృద్ధికి

అవసరమైన సమస్త ఉద్యమములకు పునాదియైన గ్రంథాలయోద్యమము అభివృద్ధికలిగి స్థిరపడియుండినగాని దేశాభివృద్ధియనెడి మేడ కూలి అనర్థకము వాటిల్లును. యిట్టి అనర్థము దేశనాయకులు యీ ఉద్యమమునందు సౌక్యము కలుగచేసుకొని, పనిచేసినయెడల తొలగును. యిప్పుడు అయ్యంకి వెంకటరమణయ్య పంతులుగారు ఆరోగ్యవంతులై యుండుటచే యీ ఉద్యమము తిరిగి త్వరలో అభివృద్ధి నొందునని ఆశ వొడముచున్నది.

దేశాభివృద్ధికోరు ప్రతివారును గ్రంథాలయోద్యమాభివృద్ధికి తోడ్పడి తాలూకా సంఘములను, సంచార కార్యదర్శులను నియమించి యిదివరలో స్థాపింపబడి నామమాత్రావశిష్టమైన గ్రంథాలయములను పునరభివృద్ధికి తెచ్చియు నూతన గ్రంథాలయముల స్థాపించియు అవసరమగుసర్వ కార్యముల నొనర్చి ఉద్యమాభివృద్ధి నొందించుట యవసరమని విన్నవించుకొనుచున్నాను.

ఈ మహాజనులు ఎండవేడిమికి గాడ్పులకు పరి యాత్రశ్రమలకు ఓర్చి యిక్కడకు దయచేసినందుకు వారికి కృతజ్ఞుడనై ఆహ్వానసంఘము వారిలోపమును సైచి సభను జయప్రదముగా జరుపుటకును అనంతరము ఈ ఉద్యమాభివృద్ధికి సర్వవిధముల తోడ్పడు దేశాసేవాపరాయణులై పనిచేసి కీర్తిగడించుటకును యీ సభాసదులను వినయతతో కోరుచు సభ్యులకును సభాధ్యక్షునకును అనేక కృతజ్ఞతావందనము లాచరించుచు విరమించుచున్నాను.

## అధ్యక్షుని ఉపన్యాసము.

ఆహ్వానసంఘాధ్యక్షుని యుపన్యాస మైనపిమ్మట అధ్యక్షులగు శ్రీ కొండిపర్తి వీరభద్రాచార్యులుగారు లేచి తమ యుపన్యాసమును ఈ క్రిందివిధముగా జదివిరి:—

వర్తమానకాలము భారతభూమికి యుగసంధి సమయముగ నున్నది. ప్రపంచమంతటికినిగూడ నిది యుగసంధికాలమే యగును. నానాదేశములందును పశుబలమునకును ఆత్మబలమునకును పోరాటము జరుగుచున్నది. పశుబలయుగ మంతరించి ఆత్మబలయుగోదయము గానున్నది. ఈపోరాటము యూరపునందు దవానలముమాడ్కి ప్రజ్వరిల్లినది. లోకమునంతటికిని వ్యాపించినది. సకలదేశములకును మధ్య యూరపు కేంద్రసంగ్రామక్షేత్ర మైనది. జర్మనుయుద్ధమనునది ప్రపంచ యుద్ధమే. యూరపుఖండాగ్నేయభాగమున నీ యగ్ని రగులుచునే యున్నది. జర్మనీయందును కీలలడగి యొకంత నివురుగప్పినదేగాని యగ్ని చల్లారలేదు. కాలపురుషుడు మహారౌద్రమూర్తియై యీ ఘోరసంగ్రామమును నడుపుచున్నాడు. ఒక యుగసంప్రదాయమును మార్చి వేరొక యుగసంప్రదాయమును ప్రకాశపెట్టుతలచి భగవంతుడు ఇట్టి విలయములను గల్పించుచుండును. పశుబలసంప్రదాయము సమస్తజాతుల స్వత్వములను హరించినది. మహాపవిత్రోద్యమములకు వినియోగపడవలసిన విజ్ఞానసంపదయంతయు లోకమున పశుబలమును జెంపుచేసినది. అది ముగ్గినది; రాబోవు కాలమువచ్చినది. ప్రపంచమందలి శాస్త్రవేత్తలందఱు తమ గ్రంథాలయములను, ప్రయోగశాలలను మారణయంత్రనిర్మాణమున వినియోగించిరి. వానినన్నింటిని ప్రయోగించిరి. అది భస్మాసురుని వర మైనది. దుర్గతిపము చేసి యీవరమును సంపాదించిన రాజలోకము దాని మూలముననే హతమగుచున్నది.

ప్రపంచ పునర్నిర్మాణముకొఱకు ఆత్మబలసంప్రదాయము ప్రతిష్ఠితము గావలసియున్నది. ఈతత్వమును ఉపదేశించుటకు భారతభూమికిమాత్రమే అర్హతగలదు. పశుబలము వ్యష్టిపేరితమైనది; స్వార్థమే గమ్యముగాగలది. లోకము నాశనము కేంద్రబిందువైనిలిచి, సర్వమునకును గర్వముతెగిల్చి, జంతువులను దాను వహింపజూచును. స్వాతంత్ర్యము ప్రస్నిగిలక్షణము. దీని నడకట్టు యత్నములకు భంగపాటు తప్పదు. ఆత్మబలమునకు సమదృష్టి గలదు. సమస్తమును దనయందే చూచును. ఒకరినిగాదని ఒకరిని నిర్జించి, తాను స్వార్థముగా పొందునదిలేదు. సర్వమునకును స్వాతంత్ర్యము నంగీకరించును. తాను సదా స్వతంత్రము ననుభవించుచునే యుండును. ఆత్మవత్సర్వభూతాని యనుధర్మము నుగ్గబాలతో గ్రోలిన భారతభూమియే యీధర్మమును బోధించగలదు. భారతభూమియే గురుపీఠము నధిష్ఠించి అహింసావ్రతమును లోకమునకు బోధించగలదు. ఈ ప్రశస్త్యము భారతికిని మఱుపునకు వచ్చినది. చిరకాలము పరాధీనతయందు గుందియుంటచే విస్మరించినది. ఇప్పుడు దానికొఱకై తన పుస్తకములను దిరుగ వేయవలసిన కాల మాసన్నమైనది. ఆ మెపుస్తకములన్నియు శిథిలమైనవై అందందు బడియున్నవి. వానిని వెదకి బోధించుచేసికొనవలయును. శ్రీ వివేకానందస్వామి, యీసంఘటనను తనవివేకచక్షువునజూచి, ముప్పది వత్సరములకు బూర్వమే, జ్యోతిషము చెప్పియున్నాడు. అచిరకాలములో ఆధ్యాత్మికబోధకై ప్రపంచము భారతభూమి నాశ్రయించునని తెలిపియున్నాడు. భారతీయులు తమ దీర్ఘనిద్రను, దమంతటదాము విడువరేని, లోకమే బలాత్కరించి నిద్ర మేల్కొనుపునని యుక్తకంఠముతో బలికియున్నాడు. ఇప్పుడాసమయము సమీపించినది. ఘన

తరతత్వార్థములగూర్చి, పాఠములు చెప్పుటకు గ్రంథపరిశోధన యావశ్యకము. కల్లబొల్లిమాటలు లుపకరింపవు. తదనుగుణ్యముగ నీగ్రంథాలయోద్యమము తలయెత్తినది. సరియైనకాలమున బయలువెడలినది. లోకగురువులను సిద్ధముచేయుట కేంద్రగ్రంథాలయములకు దప్పనివిధి.

పశుబలము స్వార్థప్రేరితమైనది. ఏ వ్యక్తినరుడో, సంఘమో, జాతియో, స్వార్థసాధనకై పూనినకార్యములను పలువురిసహాకారము పొందుటకొరకు, సమిష్టికార్యముగను, లోకోద్ధారకర్మగను ప్రకటించి మోసగించును. తుదకు ఫలమును బంచుకొనుటయందు మోసములు తెల్లమగును. యూరపునందలి వ్యష్టిజాతులు తమతమ స్వార్థములకొరకై రణమును సాగించి, దానిని లోకశాంతిస్థాపనప్రయత్నముగ ప్రదర్శించి, యనేకుల నందు ప్రవేశపెట్టెను. తుదకు జర్మనీ నిర్జింపబడినది. విజయులు లాభముల బంచుకొనవలసివచ్చినది. ప్రతిజాతియు తన పచ్చనే జూచుకొనుచు, మిత్రులందఱిని నుపేక్షింపసాగెను. పరస్పరభేదభావములతో గొట్లాడుకొనుచుండిరి. రణసీమల జచ్చినవారిని, మందుగుండుసామానుల వ్యయమును, నష్టపరిహారపు మొత్తములను, రాజ్యలాభములను, లెక్కవేసినంతమాత్రాననే ఈయుద్ధచరిత్రను మనము తెలిసికొనినవారము గాము. వీని యన్నింటికిని వెనుకనున్న నైతికపరివర్తనమును గమనించవలయును. దానిని ప్రపంచమునకు జాటవలయును. పశుబల ప్రయోగము క్షుద్రమనియు, వ్యర్థమనియు మనము లోకమునకు బోధించవలయును.

మనము లోకమునకు ఆత్మమహిమను బోధింపవలయును. మానవధర్మము నుపదేశింపవలయును. ఇది వ్యష్టిధర్మముగాదు, సమిష్టిధర్మము. విశ్వజనీనధర్మము! దీనివలన నొకవ్యష్టి, లేక యొకసంఘము, ఒక్కజాతి మాత్రమేగాక ప్రపంచమంతయు తరించవలయును. ఆ గురుపీఠము నక్రమించుటకు మనము తర్ఫీదును పొందవలయును. భారతసంప్రదాయము ననుసరించి ఆ తర్ఫీదుండును. అందుకొరకు ఎందెందు విజ్ఞానలేశము లున్నవో, వెదకి వాని నన్నింటిని సంపుటీకరించవలయును. ఇందు ప్రకృతిశాస్త్రములు, రాజనీతి, అర్థనీతి, శిల్పశాస్త్రములు, మానసికశాస్త్రములు; చిత్రకళలు, ఆధ్యాత్మికతత్వదర్శనములు ఇవి యివి యనేల, సమస్తవిజ్ఞానమును, భారతిసంప్రదాయమును, ప్రకటించుటకై యుపయోగించుకొనవలయును. దానివికాసమున కనుగుణ్యమగువిషయము లున్నయెడ నన్యులనుండియు స్వీకరించి పెంపొందించవలయును. ఈపని గ్రంథాలయోద్యమముద్వారమున జక్కగ నెఱవేరగలదు.

పూర్వకాలమున, గ్రంథములు ముద్రితములై యుండని కతమున, విద్యార్థులు పలుకష్టములు పొందుచు వచ్చిరి. వేనవేలుగ్రంథములు తాటియాకులలో వ్రాయబడి, రామబాణములకును, వల్మీకములకును, నెలవైయుండెను. ఆస్థితిలోను మనపూర్వు లనేకకష్టముల కోర్చి చాలగ్రంథములను రక్షించి, మన కిడియున్నారు. వారనేకములగు గ్రంథాలయములను నిలిపి, పోషించియున్నారు. మఱియు భిన్నభిన్న సంఘములవారు మైత్రిం గల్పించుకొని, సోదరభావముతో మెలంగుటకై, తమతమ సంప్రదాయములకు సామరస్యమును గుదుర్చుకొనుచు వచ్చిరి. గ్రంథాలయము లిందుకు మిగుల నుపకరింపుచు వచ్చినవి. అష్టాదశపురాణములు, మహాభారతము శ్రీ వ్యాసులవారు రచించె నందురు. దీని యర్థమేమి? ఈ పుస్తకములందు శైలి, భాష, భావములు, మతవిశ్వాసములు, తత్వపరిభాష, వీనియం దనేకభేదములు గాన్పించుచున్నవి. ఒక్కొక్క పుస్తకమునందే యిట్టి భేదములు చాల గాన్పించుచున్నవి. పరస్పరవిరుద్ధాంశములును జూపట్టుచున్నవి. అనేకదేశముల వర్ణనలు, వివిధజాతుల ఆచారవ్యవహారములు, మతధర్మములు, యీ గ్రంథములం దిమిడియున్నవి. ఇవి యొకచో నాడంబరపూర్వకముగ జేర్పబడినవి. వేరొకచో క్షుద్రములుగ ఖండింపబడినవి. పూర్వగ్రంథపరిశోధనాధురీణులు దీని కనేకకారణముల దెలుపుచున్నారు. అందొకటి జెప్పెదను.

ప్రస్తుతము నాలుగవశతాబ్దమునాటికి భారతదేశము భిన్నభిన్నజాతులకు నిలయమైయున్నది. వారి భాషలు, వేషములు, ఆచారములు, నీతిధర్మములు నన్నియు భిన్నములుగ నుండియున్నవి. దిగ్విజయముల గాంచి, వీరినందఱిని దమ వశముజేసికొనిన మహారాజులు వీరి నందఱిని శాంతచిత్తులుగ జేసి, పరస్పరానురాగముతో సోదరులభంగి జీవించునట్లుల జేయుటకై యనేకప్రయత్నముల గావించి, వ్యర్థమనోరథులై విసిగి వేసారిరి.

ఉజ్జయినిప్రభుడగు విక్రమాదిత్యుడు ప్రజలస్థితి గాంచి ఖిన్నుడగుచుండెను. ఈతడు విద్యావంతుడు, పండితాభిమాని, ప్రజానురంజకుడు. ప్రజలందు మైత్రి గొలుపుటకు తనకంటె పూర్వులు చేసిన ప్రయత్నములను వివేకదృష్టితో విమర్శించెను. ఉపాయాంతరమును

గనిపెట్టుటకై కృతనిశ్చయుడయ్యెను. తన రాజ్యము నందును, నితరరాజ్యములందును గల పండితవర్యులను, విజ్ఞాననిధులను, వ్యవహారదక్షులను, ప్రజాప్రతినిధులను రావించెను. పరస్పరభేదములు, విద్వేషములు నందఱికిని దుఃఖహేతువులే యనియు, అందఱును సహిష్ణుత గలిగి మిత్రత్వమున మెలగుట, సర్వప్రజకును నానందదాయకమనియు, అట్టి సమరసభావమును గూర్చు నుపాయము నరయుడనియు వేడుకొనెను. ఎవరును తమ ప్రత్యేక లక్షణములను, వ్యక్తిప్రతిభను, బోనాడుకొన నవసరములేదు. అప్రధానాంశములను, ప్రధానాంశములను నిర్ణయించుకొని మొదటివానిని సడలించుట కొడంబడుచు, రెండవవానికి సమన్వయమును గూర్చుకొనుడని కోరెను. ఈ మహాకార్యమును నిర్వహించుకొఱకు, వారి నందఱను నొక్క గ్రంథాలయముచెంత సమావేశము చేయ నిశ్చయించెను. వారికే గ్రంథము కావలయునన్నను అందుగడలోనుండు తావుకావలయును. మధుర, అయోధ్య, పాటలిపుత్రము, తామ్రలిప్తి, కపిలవస్తు, రాజగృహ, వారణాశి, తక్షశిల, ఉజ్జయిని మొదలగు ననేక నగరములందు పెద్ద పెద్ద గ్రంథాలయములు కలవు. వానిలో కొన్నింట బౌద్ధధర్మగ్రంథములు, కొన్నింట వైష్ణవసంప్రదాయ గ్రంథములు, మఱికొన్నింట శైవమత గ్రంథములు, ముఖ్యముగా జేర్పబడియున్నవి. ఇట్లగుటచేత వానియందు తదితరగ్రంథములు లేవనుటగాదు. పైవానికి ప్రాధాన్యము నిచ్చిరని తెలియవచ్చుచున్నది. కాని కాశీనగరమున అన్ని సంప్రదాయములకు సంబంధించిన గ్రంథములు చేర్చి పెట్టబడియుండుటచేత, విక్రమార్కుడాపండితసభను కాశీయందు సమావేశపఱచెను. ఆనాటిపండితులు సామాన్యులుగారు. విద్యాసాగరులే యనదగును. వారందఱిలో వ్యాసుడు మేటియై యొప్పి, సభాధ్యక్షపదవిని నిలుపబడియెను.

వ్యాసులవారి ఆధిపత్యమున మహాసభలో నన్ని పక్షములవారును, తమతమ సంప్రదాయములగూర్చి వివరింపుచు, నుపన్యాసముల నొసగిరి. ఈ యుపన్యాసములు పరమతసహిష్ణుతగలిగి, తమ సంప్రదాయమహిమను ప్రకటించునవిగనే యుండెనుగాని పరమతదూషణ మాత్రము లేదు. ఇట్లు చాలదినములు గడచినపిమ్మట, పండితులు తమలోదాము సంప్రదింపులు నడిపి ప్రధానాప్రధానముల నిర్ణయించుకొనిరి. సమరసభావమునకు మార్గమేర్పఱచుకొనిరి. తుదకు ఎవరిసంప్రదాయమునకు వారు ప్రాముఖ్యత నిచ్చుచు, గ్రంథముల వ్రాయుటకు గడంగిరి. ఆ గ్రంథములన్నియు సిద్ధమైనపిమ్మట, వాని నన్నింటిని వ్యాసులవారే ప్రధాన సంపాదకుడుగ నుండి కొలదిసవరణలతో బ్రకటించిరి.

కేవలము పై వివరించబడినరీతినే కార్యక్రమమంతయు జరిగినను లేకున్నను ఆపంథా ననుసరించి గ్రంథరచన జరిగెనని యొప్పుకొనవచ్చును. ఈమహత్కార్యమునకు వారణాశిగ్రంథాలయము మహోపకారియయ్యెను.

ఐదు ఏడు శతాబ్దములందు చీనాదేశీయులగు ఫాహియాను, హ్యాంత్సాంగు అను నిద్దరు బౌద్ధయాత్రికులు, బౌద్ధధర్మమునుగూర్చి, దాని జన్మభూమియగు, భారతదేశమున పరిశోధనలు చేయుటకై వచ్చియుండిరి. వారు పెక్కుతావులందు గ్రంథాలయములను జూచియుండిరి. మఱియు వానింగూర్చి తమయాత్రాచరిత్రలందు వ్రాసియుండిరి. వీరు గాంచిన పుస్తకాగారములందు బౌద్ధధర్మగ్రంథములేగాక, దానికి విరుద్ధమని తలపబడుచున్న హిందూమతగ్రంథములును జేర్చబడియుండెను. హిందువుల గ్రంథాలయములందు బౌద్ధమతగ్రంథములు గానవచ్చెను. మఱియొక విశేషమేమన బౌద్ధారామములందు వేలకొలంది విద్యాభ్యాసముచేయు బ్రహ్మచారులును, వారికి నుపదేశముల గావించు గురువులును, సమిష్టికుటుంబనీతి ననుసరించి, జీవించుచుండిరి. ఈ అధ్యాపకులలో జాలమంది బౌద్ధసన్యాసు లయినను కొంతమంది బ్రాహ్మణపండితులును నుండి తమ బ్రాహ్మణధర్మమును నిరాఘాటముగ బోధించుచుండిరి! ఆనాటి పండితవరులు ప్రధానాప్రధానాంశముల వివక్షత చేయగలిగినియు ప్రధానాంశములందు సమన్వయసాధనను గాంచగలిగినియు, పరమతసహిష్ణుత గలవారనియు తెల్లమగుచున్నది. ఫాహియాను బ్రాహ్మణపండితులతో ననేకపర్యాయములు వాదనలు గావించినట్లును, వారికడ హిందూధర్మమును గూర్చి చక్కగ నేర్చుకొనినట్లును, ఆయన తెలుపుచున్నాడు. ఇటువంటి సంప్రదాయసమన్వయమునకు గ్రంథాలయములు మిగుల నుపకరించుచుండెనని వేరుగ జెప్పనక్కఱ యుండదు. ఇందుకొఱకు గ్రంథాలయపాలకులు సంకుచితభావములతో గ్రంథముల సేకరించక, విశాలభావములతో వర్తించవలయును. పూర్వము మన గ్రంథాలయములలో వేలకొలందిగ గ్రంథము లుండెడివి. వివిధమతధర్మసంప్రదాయముల దొప్పనవిగ నుండెడివి. ఫాహియాను ఒక్క తామ్రలిప్తియందున్న గ్రంథముల పరిశోధించి, వానిలో గొన్నింటికి మాత్రము ప్రతుల వ్రాసికొనుటకు రెండేండ్లు పట్టెనట. ముద్రణసౌకర్యములులేని యాకాలమున నిట్టిగ్రంథాలయములకై పుస్తకముల వ్రాయించుట, తాటియాకులలో వ్రాయించిన

హానిని రక్షించుట, యే రకమున కారకము ఏర్పిపెట్టుట, ఎంతటి తెలివితేటల గోరునో విచారించుడు. మఱియు నిటువంటి శ్రమ తా మభిమానించుకొనిన గ్రంథముల సేకరించి రక్షించుటయందే గాక, తదితర గ్రంథముల గూర్చియు దీసికొనబడియెను. వేలకొలది గ్రంథము లితర భాషలలోనివి సంపాదించి, వానిని భాషాంతరీకరించి, తమ గ్రంథాలయములం దుంచిరి. నిరాఘాటముగ వాని నందఱును పరదేశీయులు, పరమతస్థులు సయితము, ఉపయోగించుకొనుటకు సౌకర్యముల నొసగుచు వచ్చిరి. కాశీ మున్నగు ప్రదేశము లందలి పుస్తకాగారములలో దేశమునందంతటినుండి పండితులు వ్రాసిన యుద్గ్రంథముల ప్రతు లుండెడివి. మఱియు విదేశపండితుల గ్రంథములును, వాని భాషాంతరీకరణములును జాలగ నుండెను.

భారతీయులలోని, వివిధజాతులవారికిని, మైత్రి గుదర్చలేకున్నను, విద్వేషములచేత పరస్పరము బాధించుకొనకుండ నిక్కాలమున దమ యుత్తమరాజనీతి కాపాడుచున్నదని మన దొరతనమువారు మిగుల నాడంబరముతోడ జెప్పుకొనుచున్నారు. కాని ప్రత్యక్షముగా ధర్మసమన్వయమునకై ప్రయత్నించక, తమ విలక్షణమగు మతనీతిచేత సర్వమును ఖండనమొనర్చుచు, నిరసింపుచు, విద్వేషముల గల్పించుటకే తోడ్పడుచుండిరనినను సత్యదూరము గాదు. పూర్వప్రరాజులును, పండితవరులును వివిధసంప్రదాయసమన్వయమునకై ప్రబలప్రయత్నముల గావించి, సిద్ధసంకల్పులైరి. అప్పటి విదేశీయయాత్రికుల గ్రంథములే సాక్ష్యమిచ్చుచున్నవి. గ్రంథాలయములును, వార్షికమహాసభలును, పుష్కరాదిమహాపర్వదినములందలి సమావేశములును, సత్యద్ఫుటెలిం జాతీయనిర్మాణమున దోడ్పడియున్నవి.

ఈ సందర్భమున మహమ్మదీయపాలకులగూర్చి యొక్కవిషయము చెప్పవలసియున్నది. మన చరిత్రకారులు మన దేశముమీదికి దండెత్తివచ్చిన మహమ్మదీయులలో మొదటితెగలవారు గావించిన దుర్నయములను అతిశయోక్తులతో వర్ణించి వారిని కేవలము రాక్షసులనుగ బ్రదర్శించియుండిరి. మహమ్మదీయులు భారతభూమిలో స్థిరనివాసముల నేర్పఱచుకొని భారతమాతకు దత్తులై యొప్పటకు పూర్వము వారు దౌర్జన్యముల గావించిరనుటకు సత్యమును మానవస్వాభావిక కార్యము నై యున్నది. దానిని మన మీనాడంతగా పాటింపజనదు. సంగ్రామకాలములందు మన దేవాలయముల పడగొట్టి గ్రంథాలయములను దగులబెట్టిరని మహమ్మదీయుల నిక్కాలమునకు దూషించుట తగదు. అన్యమతసంప్రదాయములు గలవారిగుటచేత వారు గావించినది అస్వాభావిక కార్యము గాదు. సమమత సంప్రదాయములతో మనుచున్న ఆంగ్లేయులును, పరాసులును పూర్ణసభ్యత సంపాదించిన లోకగురువులమని చెప్పుకొను నిక్కాలమున జర్మనీ, ఆస్ట్రియాలయందు చర్చిభవనములను, గ్రంథాలయములను, పురమందిరములను నెన్నెని ధ్వంసముచేసి యుండలేదా? కాని మొగలుచక్రవర్తులు హిందూమతగ్రంథములను వ్రాయించి అనువదింపజేసి పండితులను గౌరవించి యాదరించిరని యిప్పుడిప్పుడు చరిత్రపరిశోధకులు దెలుపుచున్నారు. వారివలన మనకు సంఘటిలిన కీడులకంటె మేలులే హెచ్చుగ నున్నవనియు, హిందువులలోని వివిధశాఖాంతరులు పరస్పరము గావించుకొనిన బాధలకంటె హెచ్చుగా గావించలేదనియు గ్రహించి మన దురభిప్రాయముల మార్చుకొందుముగాక!

ఒక్క విగ్రహమునే వేర్వేరు తావులనుండి చూచిన యెడల వేర్వేరుభావములు ఆ విగ్రహమునందు బ్రదర్శితము లగుచుండును. అటులనే దృక్పథమునుబట్టి చరిత్రలును, భిన్నభావములను బ్రచారము చేయుచుండును. మనము మనచరిత్రను పాశ్చాత్యులవలన నేర్చుకొనుచుంటిమి. మన దృక్పథమే గాక, మన దృష్టియు మారిపోయినది. పాశ్చాత్యులకు మనచరిత్ర తెలియదు. సంప్రదాయభేదముచేత వారు తెలిసికొనను లేరు; ప్రయత్నము చేసినవారును గారు. కాని, వారతిసాహసులు! భారతజాతికి పూర్వచరిత్రయే లేదనిరి. మీదుమిక్కిలి భారతజాతి యనునదే లేదనిరి. మన పురాణములను ఇతిహాసములను అర్థరహితములగు వట్టివ్రాత లనిరి.

చరిత్రరచన జాతీయాదర్శముల ననుసరించి నడుచును. భారతీయుల యాదర్శము ఆధ్యాత్మికము. పాశ్చాత్యుల యాదర్శము ఐహికము. తినుట, తిరుగుట, నిద్రించుట సయితము ఆధ్యాత్మికదృష్టితో మనచే జూడబడుచున్నవి. వీనివలన ప్రపంచమున సాధింపగల కార్యములకు విలువగట్టి, పాశ్చాత్యులు వీనిని ఆర్థికదృష్టితో జూతురు. కూలినాలి చేసికొనువారికి జీవనోపాధికై విరామములేక పాటుపడవలసినస్థితి యింగ్లాండున నిప్పుడు గల్గినదని చెప్పుచు, ఒక అర్థశాస్త్రజ్ఞుడు వారిని మానవజీవులనుగా జూచి, అనగా భూతదయ గలవాడై జాలిపడుటకు మారుగా, ఆర్థికరీత్యా గణితము వేసి, వారియలసటవలన, వారు వ్యుత్పత్తిచేయు వస్తు

జాల మెంతతగ్గినదో, ఎంతవాఙ్మయము క్షీణించినదో వారు త్యాగగా నశక్తులై పనిపాటులు మానినందువలన వారిజీవనభారమును జాతి ఎంతభరింపవలయునో, అన్నింటిని పౌనఃలు. షిల్లింగులు, పెన్నీలలో గణితము వేసి, ఆ నష్టమును దప్పించుకొనుటకై స్వజాతీయులు వీరికి దారిజూపవలసిన విధిగలవారగుచుండిరని వాదించినాడు. పాశ్చాత్యులు చరిత్రలను వ్రాసినను ఈదృష్టితోడనే వ్రాసిరి. మన గ్రంథములలో సామాన్యగృహకృత్య విషయములును, సాంఘికవిషయములును, రాజకీయవిప్లవములను, ప్రజలనైతిక స్థితిలో నెట్లు పరివర్తనమును గల్గించుచున్నవో దెలుపబడురీతిని కథ లల్లబడియున్నవి. మిగుల నస్వాభావికములగు నంశములనుగూడ ఇతిహాసములలో జొన్పి నీతిధర్మమును బ్రకటించుటయే ప్రధానముగ వ్రాసిరి. ఈకథ లసంభవములుగను, అస్వాభావికముగను, పాశ్చాత్యదృష్టికిని, పాశ్చాత్య సులోచనములదాల్చిన మనకును, గాన్పించుచున్నవనుట నిజము. ఆగ్రంథకర్తల యాదర్శమును పాటించి, వాని నుపయోగించుకొంటిమేని, లాభమును పొందగలము. ఇందుకు భారత సంప్రదాయాభిమానము, విచక్షణజ్ఞానము, పరమతసహనము చాలగ నవసరములు. పాశ్చాత్య లీసద్గుణములను మనగ్రంథముల పరిశోధించుపట్ల జూపరైరి. భారత జాతికెద్దియు స్వరూపమే లేదనియు, ఏకొంచమైన నున్నచో నది ప్రాకృత వికారస్వరూపమనియు బోధించిరి. వారి పాదములకడ, విద్య నేర్చిన భారతవిద్వాంసులు భారతప్రాచీన గ్రంథపరిశోధనము "ఊకదంపు" అని హేళన సాగించిరి. ఒక ఎం. ఏ. గారు (తమ్ముంగల విషయములలో మహాపూజనీయుడే) మన వాఙ్మయమును బరిశీలించుటంగూర్చి పలుకుచు "నాజీవితము చాల విలువగలది. కండ్లయెదుటి సత్యస్వరూపమును విడిచి అనిశ్చయమును, క్షుద్రమును, భ్రాంతిహేతువునగు ప్రాచీనభారతజాతిస్వరూపమునుగూర్చి విచారణ పెట్టుకొని వ్యర్థముగ నాజీవితమును వ్యయముచేయజాల" ననెను.

కాబట్టి హైందవసంప్రదాయదృష్టితో భారత చరిత్రను వ్రాయుట ఎంతయావశ్యకమో, ఎంతటి మహాకార్యమో యూహించవచ్చును. నూటి కాగ్గురు మాత్రమె సంతకములు చేయుపాటి విద్వాంసులనుండి వీరిలో వేయింటి కొక్కడైనను పూర్వగ్రంథసంశోధన కర్తవ్యా విద్యయు, నభిమానము లేకయుండ, ఎందరు మనచరిత్రను పరిశోధించి వివేకదృష్టితో వ్రాయబూనుకొనువారు లభింతురో, యోజనసేయుడు. గ్రంథాలయ పాలకులు తమగ్రంథముల జదువువారి వైఖరులగనిపెట్టుచు, తగినవారిని గుర్తించి ప్రోత్సహించవలసియున్నది.

యూరపు అమెరికాలచరిత్ర మహానగరములందును ఘనతర కర్మాగారములందును, విశ్వవిద్యాలయములందును, రాచకీయ కార్యాలయములందును లభించును. కాని భారతదేశపుచరిత్ర గ్రామములందున్నది. గ్రామములందున్న దేవాలయములలోను, మసీదులలోను, సత్రములందును, ధర్మారామములందును, గ్రామస్థులు జెప్పుకొను పిట్టకథలలోను, పల్లెలవారి విచిత్రములగు నాచారములలోను జీర్ణమైయున్నది. క్షేత్రపురాణములందున్నది. వీనింగూర్చి గ్రామస్థులు చెప్పుకొను గాథల నన్నింటిని ప్రోగుచేయవలసియున్నది. అవి వివిధములుగను, పరస్పర విరుద్ధములుగను, అస్వాభావికములుగను నుండును. కాని వాని యన్నింటను, పరమునందలి సూత్రమువలె, నైతికాదర్శములు, సంప్రదాయాచారములు వివేకదృష్టికి గోచరములగుచుండును. వాని ననుసరించి, జాతీయ పరిణామచరిత్రను వ్రాయవలసియున్నది. నైతిక పరివర్తనము ననుసరించి వ్రాసిన జాలును, పాశ్చాత్యదృష్టితో రాజుల జీవితచరిత్రలను తేదిలవారిగ వ్రాయుట యనవసరము. రణక్షేత్రములందు విహారముగావించిన గణనాయకుల జీతములను, నధికారములను, యోధులసంఖ్యను ఖచితముగ నిర్ణయించిజూచుట యనవసరము; రాజశాసనముల నిర్మాతలను, వాని తారీఖులను సరిగ దెల్పుట యనవసరము. పైవానివలన ప్రజల సుఖదుఃఖములు, సంఘాచారములు, ఆముష్మిక భావములు ఎటులమారెనో తెలిపినజాలును. మహాభక్తుల జీవితచరిత్రలు విస్తారముగ నున్నను, వారిబోధలవలన గల్గిన భావపరిణామమును సూచించిన జాలును.

ఈపని కంతకును స్థలపురాణములును, స్థానికగాథలును, క్షేత్రమహిమలును మూలాధారముగ నుండును. ఈ కథాజాలము నెక్కడివా రక్కడ రచింపజేసి ప్రకటించినయెడల సులభముగ పనిజరుగును. గ్రంథాలయములనిర్వహించువారికార్యమును నిర్వహించగలరు. సామాన్యముగా ఉన్నతపాఠశాలలలో విద్యగఱచు బాలురు శెలవుదినములలో తమ విశ్రాంతికాలము నిందుకుపయోగించిన మహోపకారమును జేయగలరు. వారు తమగ్రామస్థులు జెప్పుకొనుకథలను తెలుసువచ్చిన

భాషలోనే వ్రాయవచ్చును. ఇట్టివానిలో నుత్తమమైనవానిని రచించిన బాలురకు చిన్నచిన్న బహుమానములనిచ్చి ప్రోత్సహించవచ్చును. ఇందువలన వారికి ఆనందమును, నుత్సాహమును, దేశసేవగావించిన పుణ్యమును లభింపగలవు. గ్రామములందు ప్రాథమికపాఠశాలల యుపాధ్యాయులుగూడ కథలను వ్రాసి యీగలరు. వీనిని సత్కరించుట యనేకభంగుల నుపకారకార్యమగును.

ఇటులచేయుటవలన, మనదృష్టి గ్రామములపై కేంద్రీకరింపబడుచుండి, విశాలతరదేశాభిమానము సంకుచితమగునని కొందఱు భావింపవచ్చును. అటుల నెన్నడును జరుగదు. భారతదేశమంతయు మహాపురుషులయొక్కయు, అవతారములయొక్కయు, భక్తులయొక్కయు జన్మనిర్యాణక్షేత్రములతోడను, మఠములతోడను, మసీదులతోడను, చౌదస్తూపములతోడను పవిత్రీభూతమై సర్వమతములవారిచేతను పూజింపబడుచున్నది. అందందు జరుగు తిరునాళ్లు, పుష్కరతీర్థవిధులు, ఉత్సవములు, వేడుకలు నందఱిని నాకర్షించుచున్నవి. భారతమాతయొక్క అఖండ దివ్య మంగళస్వరూపము అనాదిగను ధ్యానింపబడుచునే యున్నది. సప్తనదులను, సప్తపుల ప్రాంతములను, శైవతీర్థములను, వైష్ణవతీర్థములను మున్నగువానిని ధ్యానము చేయుట మన కాచారమైనది. వీనిని ప్రతిపాఠశాలయందును విద్యార్థులచేబఠింపించి, చిత్రపటములతో గోడలమీద లిఖించియుంచి, వానిమహిమలను బోధింపుచు నుండవచ్చును. అటుల భారతభూమియొక్క సర్వాంగములను మహాపవిత్రములేయను నుపదేశములను ఉగ్గుపాలతో పసివారికి గ్రోలనిచ్చినయెడల ఇక దేశాభిమానము సంకుచితమైపోవునను భయ మనవసరము. అనుదినము స్నానములు గావించుపట్ల,

"గంగేచ యమునే చైవ కృష్ణే, గోదావరి సరస్వతీ,
నర్మదా సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు."

అనుచు బఠించు మనము దేశారాధనను మఱచెదమా? గ్రామాభిమానము, దేశాభిమానమునకు బునాదియై స్థిరముగ నడుపును.

వారమునకో పక్షమునకో ఒక్కసారి గ్రామమందలి బాలబాలికల నందఱను, గ్రంథాలయమువెంట జేర్చి వారికి మంచిమంచి బొమ్మల జూపుచు, వీరులచరిత్రములను, మహాభక్తులకథలను, పతివ్రతల పావనజీవితములను, వివిధక్షేత్రమహిమలను తెడవ కొక చిన్నకథగా గూర్చి బోధింపవచ్చును. తుదకొక కీర్తనయో, పద్యమో భారతమాతను గూర్చి పఠింపించి, జేజేధ్వనులతో వారి నలరింపవలయును. వీలునుబట్టి వారికి పంచదారయో, కొబ్బరియో, బెల్లమో, పప్పులో పంచిపెట్టవచ్చును. ఇందుకు రామాయణ, మహాభారత, భాగవతాది గ్రంథములగాథలదెలుపు చిత్రపటములను, తదితరచారిత్రక బోధకములగు పటములను, ధనమున్నచో మాజికులాంతరును, ప్రతిగ్రంథాలయమునందు నుంచవలయును. కథకులు లభించినప్పుడెల్ల బాలనాగమ్మకథ, బ్రహ్మనాయునికథ, బొబ్బిలికథ ఇటువంటివానిని చెప్పించుచుండవలయును. గ్రామపాఠశాలలందు పర్వదినములందుత్సవముల జరుపుచుండవలయును. ఆ యుపాధ్యాయులకు కథలుచెప్ప నేర్పును గల్గించవలయును. సామాన్యప్రజలప్పుడు గ్రంథాలయముల నభిమానించుకొని సహాయము నొసగ్గలరు.

మనలో ప్రతివాడును తనసంఘమునకును, విశ్వమానవకోటికిని ఋణస్థుడైయుండును. తానెంతటి ధీశాలియైనను, ధనాఢ్యుడైనను, బలసంపన్నుడైనను, ఈ ఋణమును దప్పించుకొనజాలడు. విశ్వమానవకోటి, తరతరములనుండి సంపాదించిన జ్ఞానపుంజము మనలో జీర్ణమైయున్నది. దానిఫలమును మనము తెలియకుండనే యనుభవించుచున్నాము. చిన్న యుదాహరణచే విశదముచేసెదను. ఒకడు ఒక్కముద్ద అన్నము దినినప్పుడెల్ల విశ్వమానవకోటికి ఋణస్థుడగుచున్నాడు. నరుడు ప్రాకృతజీవియై పుడమిని జన్మించినదిమొదలు, క్రమక్రమముగా క్షుద్రజంతుజాలమును, ఆకలములను, కాయకసరులను, దుంపలను దిని, ఆహారద్రవ్యములను సేకరించిపెట్టుకొనుట నేర్చి, వానిని వ్యుత్పత్తిచేయువిధమును గనిపెట్టి యిప్పటికి వ్యవసాయశాస్త్రమును గొంతవఱకు పూర్ణతకు దెచ్చెను. ఆ విజ్ఞానమంతయు మనముతిను ప్రతిమెతుకునందు నున్నది. ఆ విజ్ఞానరాశియం దొక్కొక్కకణమును జేర్చినవాడెల్ల నాకుపదేశకుడే, నాకుపకృతియొనర్చినవాడే, నాకు దాతయే. ఇట్లు దలపోసినయెడల, నే నెంతమందికి ఋణస్థుడనైతినో గణించుటకే నా జీవితకాలము చాలదు. ఈ ఋణముతీరు నుపాయమెద్ది? ఈ విశ్వమానవకోటిలో నాజాతి యొక యంతర్భాగమైయున్నది. కావున, నే నీజాతికి సేవజేసి, నా శక్తియుక్తుల వినియోగించి విశ్వమానవజాతి కూర్చిపెట్టిన జ్ఞానరాశి కొకనూతనకణమును జేర్చి, నా స్వజాతి బాలబాలికల విజ్ఞానవిస్ఫురణమున నొకింత సహకారముసలిపి,

ఇతరు లార్జించిపెట్టిన జ్ఞానామృతము నొకింత ఈ చిన్నవారలకు పంచిపెట్టి, కృతకృత్యుడగు రాజునుం. తాము స్వయముగ విద్యాధికులగు వారి కీఋణము గురుతరముగనున్నది. వారు తమ సమకాలికులు ప్రత్యక్షముగను, పరోక్షముగను బోషింపుచున్న పాఠశాలలలో విద్య గఱచుచున్నారు. వీరిలో నెవరును దాముగడించిన విద్యకు దగిన ప్రతిఫలమును జీతములరూపమున నిచ్చివేసితిమని పక్కాణింపజాలరు. అయినను ఈ కాలపు విద్యావంతులు కేవలము కుక్షింభరులును, స్వకుటుంబసేవకులును మాత్రముగనుండి, యితరులసేవ విధిగా చేయవలసిన వారని గ్రహించునంతటి విశాలహృదయులు గాకున్నారు. ఇతరులు చెమటోడ్చి, కష్టపడి, తమకై పాటుపడుట, తమ ఘనతకు తార్కాణ మనుకొనుచున్నారే గాని, తమ ఋణభార మందువలన పెరుగుచున్నదని గుర్తించజాలకున్నారు. అటువంటి వారిని ప్రోత్సహించి, దేశసేవయందు దింపవలెను. వీరివలన పరిశోధనలచేయించి చరిత్రలను, ప్రకృతిశాస్త్రములను, యంత్రనిర్మాణశాస్త్రములను, సులభమగు భాషలో వ్రాయింపించవలయును. అన్య భాషలందున్న వాని ననువదించునటుల చేయవలయును. వీరి విజ్ఞానమును స్వలాభమునకే యుపయోగించుట అధర్మమనియు నొక్కిచెప్పి వాదించుడు. వీరు ననుసరించి లోకోపకారకార్యములకు దిగినవారిని సత్కరించి ప్రోత్సహించుడు. వారికి వలయు గ్రంథముల నరసి సంపాదించిపెట్టుడు.

వర్తమాన కాలమునందుకంటె, భారతదేశమున, పూర్వము చదువరులు హెచ్చుగనున్నమాట నిజమే. అందువలన ప్రజలందఱును గ్రంథపఠనము చేయగల్గియుండిరని భావించరాదు. పూర్వకాలపు చదువరులు విద్యావంతులయి యితరులు చదువరులు గాకున్నను, వారిని గూడ విద్యావంతులుగ నొనర్చుచుండిరి. చదువులకు ఫలము గ్రంథపఠనము, వ్యాసరచనము, ఉపన్యాసము లిచ్చుటయునని యిప్పటివారు భ్రమించుచున్నటులున్నది. చదువులేర్చిన దానికి ఫలము భగవంతుని మార్గముల నరసి, అనగా లోకవృత్తమును గమనించి, తదనుగుణ్యముగ దాను వర్తించుటయు నితరులను వర్తింప జేయుటయు నని మఱవదగదు. ఈరీతిగా విచారించిన యెడల మన యిండ్లలోనున్న ముసలమ్మలు భాగవతాది గ్రంథములలోని విషయములను, దాము దెలిసికొని, యితరులకు దెలుపగలిగియుండిరి. మన గ్రాడ్యుయేటుల కాశక్తి లేదయ్యె. జాతీయసంప్రదాయ సిద్ధమగు విద్య ముసలమ్మలకున్నను గ్రాడ్యుయేటులకు లేకుంట. శోచనీయము. జ్ఞానప్రచారమున కుపకరించని చదువులను విద్య యనదగదు. జ్ఞానప్రచారమును చదువులును రెండును లభించిన పరమోత్తమము. ఒకవేళ చదువులు లభించకున్నను జ్ఞానప్రచారమున్నచో సంతసించవలసినదే. ప్రస్తుతస్థితిలో మనదేశమున నూటికి నలుగురైనను ధారాళముగ వ్రాయను జదువను శక్తులగువారు లేరు. జనాభా లెక్కలలోని చదువరులసంఖ్యలను నమ్మకొనదగదు. కొందఱు దస్కతు చేయుటను మాత్రమే నేర్చి పరువుపోవునను కారణముతో చదువు నెఱుంగుదుమని జనాభాగణితిలో వ్రాయించుకొందురు.

మఱియు ఈ చదువులు జ్ఞానార్జనమునకుగాని జ్ఞానప్రచారమునకుగాని కొఱగావు. మనదేశమున నిప్పుడు గ్రాడ్యుయేటు లున్నారు. బిరుదాంకితు లున్నారు. జాతీయవిద్యకొక స్వరూపమును సూచించుడనగా దానికి శక్తులుగాక యున్నారు. కావున ఆ చదువులపద్ధతిని నమ్మకొనక జ్ఞానప్రచారమునకు గడంగవలయును. గ్రంథాలయము లీజ్ఞానప్రచారమునకు జాలగ నుపయోగించగలవు. గ్రంథాలయసభ్యులు ప్రజలతోగలిసి మెలిసి, తిరుగుచు కథలమూలమునను, ఉపన్యాసముల మూలమునను, ఇష్టాగోష్ఠివలనను, సంభాషణమూలమునను విజ్ఞానమును ప్రచారము గావించగలరు. ముప్పదేండ్లనుండి గ్రాడ్యుయేట్లు, లాయరులు చేయజాలని జ్ఞానప్రచారమును గాంధిగారు మూడుమాసములలో చేయగల్గిరి. ఆ ప్రచారము సత్యమ్మతిలీల జరిపినది సామాన్యవిద్యావంతులే గాని గ్రాడ్యుయేటులుగారు. విషయమును సానుతాపముతో గ్రహించుట, ఆదరణపూర్వకముగా నితరులకు దెలుపుట, జ్ఞానప్రచారమునకు ముఖ్యసాధనములు. పదేండ్లు పాఠము చెప్పినదానికంటె రాజకీయ సమస్య నొక్కదానిని మనసున పట్టించుటకు, పదిమందిని జేర్చి యొక్క హాస్యకథయో, ఒక్క చిత్రకథయో అల్లి దానిని హృద్యమగు తేలికభాషలో త్రుటికాలములో బోధించనగును. దీనికొక్కడు తెలిసినవా డున్నంజాలును. వినువారందఱు అక్షరజ్ఞానము లేనివారైనను సరియే. ఈ కాలపుపరిస్థితుల ననుసరించి యీపద్ధతి నాచరణలో బెట్టవలయునే గాని, జీవితమున చదువులు లేవేయని దిగులొంది గూర్చుండగాదు. ప్రతి సాయంతనమును ఆంధ్రపత్రికలోని ముఖ్యవిషయములను వీథులలో విశాలమైన చోట నిలుచుండి బిగ్గఱగ చదువుటయో, లేక వానిగూర్చి ముచ్చటించుటయో విధిగ బూనినయెడల

గ్రంథాలయస్థాపనము మహోపకారము చేసినదగును. కేవలము పత్రికాపఠనము చేయువారికే యుపయోగపడు పఠనమందిరములు పూర్ణప్రయోజనకరములు గావనుటకు సందియములేదు. గ్రంథాలయమునందలి అలమారులలో చాలపుస్తకము లున్నను, వార్తాపత్రికలు విశేషముగ నచ్చటి బల్లలపై నలంకరించినను, అనుభవమునే వులు హాజరై పుస్తకముల సంతకము లిడినను, వీని లెక్కలు గ్రంథాలయపు ప్రయోజనమును నిరూపింపజాలవని మనవిచేయుచున్నాను. నేను వివరించిన విషయములు కేవలము ధనసహాయములేక జరుగునవి కాకున్నను, ఎంత ధనము చిక్కిన నంతటితోనే జరుగునవై యున్నవి. ధనము చాలగ లేదనియు, గ్రంథములు కొద్దిగ నున్నవనియు గ్రంథాలయభవనము కుదురలేదనియు సంకోచించి ప్రారంభమే లేకయుండుట యనవసరము. ఉత్సాహవంతులగు యువకులున్నం జాలును. చాల ప్రచారము గావించవచ్చును. పెద్దపెద్ద పుస్తకముల కొనుట, ఉత్తమ గ్రంథముల ప్రకటించుట, విశాలతరభవనముల నిర్మించుట విశేషధనము చేకూరినకొలదిని గావించదగిన కార్యములు. ఆకార్యముల నిర్వహించు విధానములు, నుపాయములు ధనముతోడనే రాగలవు. ఇట్టిలాభము కొలది గ్రంథాలయములకే లభింపగలదు. వర్తమానకాలమున నెవరిస్థితికి దగినటుల వారు కార్యక్రమమును నడుపవలసి యున్నది. ఇతరులతో పోటీలు పెట్టుకొనుట, ఒకరితో నంతు జెట్టుకొని యన్యులకై వేచియుండుట, తగదు. ప్రతివాడును 'నాపనిని నేను చేయగలిగినంతవరకు ప్రయత్నలోపము లేకుండ నిర్వహించితినా?' యని ప్రశ్నించుకొనవలయును. వాని యంతరాత్మ నడిపినటుల నడువవలయును.

కేంద్రగ్రంథాలయములకు గ్రంథముల నేకరించు నుపాయమొకటి దర్భాంగగ్రంథాలయ పాలకులగు ఎస్. సి. గుహఠాకూరుగారు తెలిపియుండిరి. యూరపు అమెరికాలలో ప్రతిదేశమునను సామ్రాజ్యగ్రంథాలయములు గలవు. వానికి ఆయా సామ్రాజ్యములలోని గ్రంథకర్త లందరును, తాము ప్రకటించిన ప్రతిపుస్తకమునకును రెండుప్రతులు ఉచితముగ నొసగవలయునను శాసనము గలదు. అటుల ధనవ్యయములేకయే చాలగ్రంథములు లభింపుచున్నవి. మనకు నిట్టివంటి శాసనముగలదు. కాని యీశాసనమువలన భారతదేశమున ప్రకటితమగు గ్రంథములన్నియు లండను గ్రంథభాండాగారమునకు లభింపుచున్నవి. మన భారత ప్రభుత్వమువారు నొక గ్రంథాలయమును నటులనే నిలిపిరి. కాని దానియుపయోగము ప్రజలకు లభించుటలేదు. అఖిలభారతకాంగ్రెసుసంఘమువా రొకగ్రంథాలయమును నెలకొలిపిన బాగుండును. కాని వారి కొక స్థిరకార్యాలయము లేదు. వర్తమానకాలమున ప్రతిరాష్ట్రీయ కాంగ్రెసుసంఘమును ప్రతి జిల్లా కాంగ్రెసుసంఘమును కేంద్ర గ్రంథాలయముల స్థాపించుట మంచిది. పుస్తకమొకటి ముద్రణముకాగానే, గ్రంథకర్తలు మూడేసిపుస్తకములను దేశమాత కర్పణము చేయవలయును. ఒకటి గ్రంథకర్త గ్రామమునను, లేక సమీపగ్రామమున నున్న గ్రంథాలయమునకును, రెండవదానిని జిల్లా గ్రంథాలయమునకును, మూడవదానిని రాష్ట్రీయ గ్రంథాలయమునకును బంపునియమమును బ్రచారములోనికి దేవలయును. అచిరకాలములో స్వల్పవ్యయముతో కేంద్ర గ్రంథాలయములను బలపరచగలుదుము. అన్నింటికిని పరిధానాంశము విజ్ఞానప్రచారము! దీనిని గావించుటయే గ్రంథాలయములకు పరమగమ్యముగ నుండవలయును.

అధ్యక్షులారా! నే నీయుపన్యాసమున దెలిపిన యంశములేవియు మీకు క్రొత్తవిగావు. కాని నన్నిక్కడ మీరు నిలిపిన కారణమున జెప్పవలసి చెప్పితిని. కొఱతల దీర్చుభారము మొదటనే మీపై నిడియుంటిని. సాదరభావముతో నానుడు లాలకించిన మీకు మఱొకసారి నమస్కరించెదను.

అధ్యక్షుని యుపన్యాసము ముగింపబడినపిమ్మట వివిధగ్రామములనుండివచ్చిన గ్రంథాలయప్రతినిధులు తమ యనుభవములనుగూర్చి విపులముగా జెప్పిరి.

అనంతరము ఈక్రిందివారు గ్రంథాలయముల యావశ్యకతనుగూర్చి గంభీరోపన్యాసముల నిచ్చిరి:

౧ అయ్యదేవర కాళేశ్వరరావుగారు,
౨ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు,
౩ కొత్తా శ్రీరామశాస్త్రిగారు.

పిమ్మట ఈదిగువ తీర్మానములు జేయబడినవి:—

## తీర్మానములు.

I. (క) ఈమండలమందు గ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుటకు పశ్చిమగోదావరి మండల గ్రంథాలయసంఘమును స్థాపించుటకు తీర్మానించుచున్నారు.

(ఖ) ఈసంఘమునకు ఈక్రిందివారిని కార్యనిర్వాహకులుగా ఎన్నుకోవడమైనది:

అధ్యక్షులు:—భూపతిరాజు తిరుపతిరాజుగారు.

కార్యదర్శులు:—నిడమర్తి లక్ష్మీనారాయణగారు, భమిడిపాటి సూర్యనారాయణగారు,

కార్యనిర్వాహకవర్గము:—క్రొవ్విడి మల్లేశ్వరరావు గారు, అడివి బాపిరాజుగారు, యేలూరిపాటి రామభద్రదయానులుగారు, సాగి వెంకటనరసింహరాజుగారు, శివుడు శివరావు గారు, దంతలూరు నారాయణరాజు గారు.

ఉపపాదకులు:—అడివి బాపిరాజుగారు.

ఆమోదకులు:—అణ్మూరి గోవిందాచార్యులుగారు.

II. కాంగ్రెసు ప్రచారముతో బాటు గ్రంథాలయ ప్రచారము జరుపుటకును, అవసరమగుచో తగు ధనసహాయము చేయుటకును తాలూకా జిల్లా కాంగ్రెసు సంఘములను ఈసభవారు కోరుచున్నారు.

ఉపపాదకులు:—అ. రామలింగంగారు.

ఆమోదకులు:—శివుడు శివరావుగారు.

పిమ్మట అధ్యక్షునకు వందనములతో సభ ముగిసినది.

# వాత్స్యాయనుని కామసూత్రములు.

లోకము తఱుచుగ పరప్రత్యయనేయబుద్ధిగలది. అనగా యుక్తాయుక్తవిచారణమునుగాని కార్యాకార్యబుద్ధినిగాని సత్యాసత్యాన్వేషణమునుగాని చేయకయే యెవ్వరో యొక్కరు—ఏదోయొకటి యన్నంతమాత్రాన—శిరసావహించి నడచుకొనుచున్నదిగానే యుండునేగాని స్వోపజ్ఞతను గనంబఱచి పరీక్షించి యుపాదేయతనో అనుపాదేయతనో నిర్ధారణము చేసికొనుచున్నదిగా నుండదని భావము. ఇట్టిస్థితిలో చిరకాలమునుండియును ఆముష్మికపథానువర్తనమును ప్రోదిసేయవలచుకొన్నపెద్దలు— స్వపక్షసమర్థకమునకో— పరపక్షనిరాకరణమునకో—కామము ధర్మోపఘాతకమనియును దుర్నీతిప్రేరకమనియును సర్వథా అనుపాదేయము గర్హ్యము అనియును నుపన్యసించుటయేగాక తత్సంబంధికములగు కామసూత్రాదిగ్రంథములయెడసైతము అనీతిని అధర్మతను ఆరోపించుచు వచ్చుచున్నారు. ప్రస్తుత మీవ్యాసమునందు కామసూత్రములు పైవారు చెప్పుచున్నట్లుగ లోకమున కవినీతిని అధర్మమును ప్రకటించునట్టివైనదియును కానిదియును కామసూత్రము లెంతవఱకు లోకస్థితికి ప్రతిష్ఠంభతను వహించుచున్నదియును మున్నగునవి చర్చింపంబడును. ఇంక కృతత్రేతా ద్వాపరాదియుగయుగాంతరములకథ లెట్లున్నను ప్రస్తుతము మనకు లభించుచున్న ఆర్యసాహిత్యమునందు ఇంత్రాపి తాత్త్వికమగు పురుషార్థమును బోధించు మన సంస్కృతవాఙ్మయమునందు వాత్స్యాయనుని కామసూత్రములు అత్యంతము ప్రాచీనములును ఆద్యములును నై యున్నవి. కేవలమును అద్యత్వపురాతనత్వములుమాత్రమేగాక అంతకుముందు ఆర్యసంఘము అనుభవించిన నాగరకతావైభవముకూడ అతివేలముగా నీకామసూత్రములందు ప్రతిపాదింపబడుచున్నయుండును. ఇదియుగూడ నీవ్యాసమున చర్చింపవలసిన విషయములలో నొక్కటి. కామశాస్త్రాధ్యయనము సంఘమును జనసామాన్యమును అవినీతికి పాల్పడజేయునని కొందఱు ప్రాజ్ఞంమన్యులందురు కాని నిజమును పరికించెదమేని అవినీతియనునది కేవలము ఒక్కవస్తువుయొక్క నైజగుణమెన్నటికిని గాదు. అయ్యది దేశకాలపాత్రాద్యుపాధుల ననుసరించియును ఉపయోక్తృ ప్రజ్ఞావిశేషము ననుసరించియును మాత్రమే ప్రత్యేకతనొందబడియుండును. కనుకనే వేంకటాధ్వరియంతటి పండితుండును—శ్రీ శత్రుజయాయ నైజగుణా ద శ్లేష తేనెన చేశ్వత్రోహంతి నిజం వపు క్రియ రేతో పరాధీకేః—అని ప్రశ్నింపవలసివచ్చినది. కాని—వాత్స్యాయనమహర్షి తాను రచించిన కామసూత్రములను నీతినిబంధనహేతువులనుగా పేర్కొనుచున్నాడు. అనగా లోకముయొక్క సంస్థితిని చక్కబఱచి లోకయాత్రానిర్వహణమొనర్చుగోరు త్రివర్గ కాములకు మార్గదర్శకములనుగా సూచించుచున్నాడని భావము. కామసూత్రములు నీతినిబంధకము లనుటలో వాత్స్యాయనమహర్షియొక్క యభిప్రాయమేమియో మనము తెలిసికొన్నచో చాలవఱకు ఈ పరిగ్రహప్రత్యాఖ్యానశంకాపిశాచముకూడ తొలగిపోవగలదు. కృత్యవిభాగము సుకరమగును. ప్రాయశః ఆర్యజనత ఆముష్మికవ్యగ్రహృదయ. కనుకనే సర్వకాలసర్వావస్థలయందును చేయునట్టి ప్రతిపనియును ఆముష్మికమునకవిరూరమై ఐహికమును అత్యంతమును ఆవశ్యకముగ నుండునట్లుగా వారేర్పఱచుచు వచ్చిరి.

ప్రాచీనులగు ఆర్యులలో ఐహికాముష్మికసాధనములగు పురుషార్థములను నిర్వచించుటలో మతభేదము గలదు. ధర్మము అర్థము కామము మోక్షము అని పురుషార్థములు నాలుగు. ఈనాలిగింటిలో నాలవదియగు

మోక్షము చాలకాలము క్రిందటివఱకును పురుషార్థముగా గణింపబడలేదని గ్రంథములవలన దృష్టి తోచుచున్నది. అందునను వాత్స్యాయనుని కాలమునాటికి మొట్టమొదటివి మూడే పురుషార్థములను సంప్రదాయమున్నట్లు స్పష్టము. కనుకనే వాత్స్యాయనమహర్షి తన గ్రంథమునందు శాస్త్రసంగ్రహాధ్యాయమును వ్రాసిన పిమ్మట—అనగా తాను రచించబోవు సూత్రగ్రంథమునందలి ప్రకరణాధికరణములను సూచించు సూచనపట్టిని తొలియధ్యాయమునందు వ్రాసిన పిమ్మట— త్రివర్గప్రతిపత్త్యధికరణమును వ్రాయుచున్నాడు; అనగా త్రివర్గప్రతిపత్తిని అన్యోన్యానుబద్ధముగ నిరూపించుచున్నాడని భావము. ధర్మార్థకామము లను నిమూఁడిటికిని త్రివర్గమనియును, ధర్మార్థకామమోక్షములను నాల్గింటికిని చతుర్వర్గమనియును ప్రాచీనులు చేసికొన్న సంకేతము.

త్రివర్గో ధర్మకామార్థైశ్చతుర్వర్గస్సమోక్షకైః— అని ప్రమాణము. ఈసంకేతము చొప్పున త్రివర్గప్రతిపత్తియనఁగా ధర్మార్థకాముల అనిష్పత్తియని యర్థమేర్పడును. ధర్మార్థకామములను నియ్యవి సాధారణముగా ఏకత్ర ఏకకాలమునందు సిద్ధించునట్టివిగావు. ఇట్టి విరుద్ధస్వభావములగు వానిని పరస్పరావిరుద్ధములనియును అన్యోన్యానుబద్ధములనియును నిరూపించు ప్రకరణము గనుకనే దీనికి త్రివర్గప్రతిపత్తియని నామనిర్దేశమును చేసినాడు. ఈయొక్క ప్రకరణమును సావకాశముగ పరీక్షింపగల్గినచో కామసూత్రములందలి యౌత్కృష్ట్యమును మాపాఠకులు తప్పక కన్పెట్టగలరు. ఎలయనగా కామసూత్రముల కింతటికిని ఇదియే ఆయువుపట్టు. ఈ ప్రకరణమునందు వివరింపబడిన సిద్ధాంతముల పైననే ఈశాస్త్ర మంతయును ఆధారపడియున్నది. ఈ క్రిందవివరింపబడిన వాక్యములు త్రివర్గప్రతిపత్త్యధ్యాయమునందలివి—

సూ. శతాయుర్వై పురుషో విభజ్యకాల మన్యోన్యానుబద్ధం పరస్పరా నుపఘాతకం త్రివర్గం సేవేత.

పురుషుఁడు శతాయువు అని శ్రుతులు సైతము చెప్పుచున్నవి. ఇట్టి పురుషుడు తనజీవితకాలమును విభజించి కొని—(బాల్యయౌవనవార్ధకాది భేదములచేత ప్రత్యేకించి యనిభావము.) త్రివర్గమును—అనగా ధర్మార్థ కామములను — సేవింపవలయును. పరస్పరానవస్థాయులగు ధర్మార్థకామములను ఒక్కటిగా సేవించుట ఎట్లం దురాపము మహర్షియే చెప్పుచున్నాడు. అన్యోన్యానుబద్ధముగా—పరస్పరానుపఘాతకముగా—అని. అన్యోన్యానుబద్ధముగా పరస్పరానుపఘాతకముగా సేవింపగలుగుట అసాధారణకార్యము. అంతంతమాత్రము వారికి స్వాధీనపడనిది. కనుకనే వ్యాఖ్యాత ఈయర్థమును చక్కగ వివరించుచున్నాడు—

అన్యోన్యానుబద్ధమితి— ధర్మాదీనామన్యతమం ద్వాభ్యామేకేన వా బద్ధమ్. తద్యథా—ప్రజార్థినో ధర్మపత్న్యామనభిప్రేతాయామృతావభిగమనం ధర్మః అర్థానుబద్ధః. అప్రజార్థినో అభిప్రేతాయాం పత్న్యామభిగమనం ధర్మః కామానుబద్ధః. అపరిణీతస్య సవర్ణాయామభిప్రేతకన్యాలాభో ర్థో ధర్మానుబద్ధః. పరిణీతస్య సవర్ణాదభిప్రేతకన్యాలాభో ర్థో కామానుబద్ధః. ధర్మపత్న్యామభిప్రేతాయామృతౌ కామో ధర్మానుబద్ధః. పరిణీతస్య నిష్క్రాంచనస్య అధమవర్ణాయామర్థవత్యామభిప్రేతాయామధిగతాయాం కామో ర్థానుబద్ధః. అపరిణీతస్య సవర్ణాయామనన్యపూర్వాయామభిప్రేతాయాం యథావిధి సంయోగో ధర్మార్థకామానుబద్ధః. తస్యైవాభిప్రేత సవర్ణకన్యాలాభో ర్థో ధర్మకామానుబద్ధః. తస్యైవార్థరూపవత్యాం పరస్పరోత్కంఠయా ఉద్వాహితాయాం కామో ధర్మార్థానుబద్ధః—

[ధర్మార్థకామములలో ఒకదానితో నొకటి చొప్పునగాని రెండేసి చొప్పునగాని అన్యోన్యముగ కలసిమెలసియుండుటయే అన్యోన్యానుబద్ధము. ధర్మార్థకాముల అన్యోన్యానుబద్ధక్రమ మిది—

సంతానార్థియైన వానికి అనభిప్రేతయగు ధర్మపత్నియందు ఋతుకాలాభిగమనము అను ధర్మము కామానుబద్ధము. పెండ్లికానివానికి సవర్ణనుండి అనభిప్రేత కన్యాలాభము కల్గినచో నయ్యది ధర్మానుబద్ధమగు నర్థము. పెండ్లియైనవానికి అధవర్ణమునుండి అభిప్రేతకన్యాలాభము కల్గినచో నయ్యది కామానుబద్ధమగు ధర్మము. అభిప్రేతయైన ధర్మపత్నిని కామాతురుఁడైనదానిని ఋతుభిన్నకాలమున గలసిన నయ్యది ధర్మానుబద్ధమగు కామము. పెండ్లియై దరిద్రుడైయున్నవానికి అధమవర్ణపుదియును, అర్థవతియును నభిప్రేతయు నగుదానితో నభిగమనము లభించినచో నయ్యది యర్థానుబద్ధమగు కామము. పెండ్లికానివానికి సవర్ణయును ననన్యపూర్వయును అనభిప్రేతయునగు స్త్రీతోటి యథావిధిగా సంయోగము కలిగిన నయ్యది అర్థకామానుబద్ధమగు ధర్మము. వానికే సవర్ణయు నభిప్రేతయునగు కన్యక లభించినచో నయ్యది ధర్మకామానుబద్ధమగు నర్థము. పైవానికే అర్థరూపములు కలిగి పరస్పరోత్కంఠముచేత నుద్వాహితయైనదానియందు అగు కామము ధర్మార్థానుబద్ధము.]

త్రివర్గములోని కెల్లను ప్రధానమై తక్కుంగల రెండిటికిని అనగా ధర్మార్థముల రెండింటికిని — సాధనమై లోకస్థితిని చేకూర్చునదియై ఈ కామశాస్త్రము నేడు క్రొత్తగా వాత్స్యాయనుఁ డేర్పరించినది కాదు. అంతకుపూర్వమే ఔద్దాలకియగు శ్వేతకేతువు, దత్తకాచార్యుడు, చారాయణుడు, సువర్ణనాభుఁడు, ఘోటకముఖుఁడు, గోనర్దీయుడు, గోణికాపుత్రుఁడు మొదలగు నాచార్యులచేత విస్తరించి గ్రంథరూపమున గూర్పబడినది. కాని వాత్స్యాయనుని కాలము నాటికి ఆగ్రంథములన్నియును దురధ్యేయములును ఉత్సన్నప్రాయములు నగుటచేతను లోకస్థితికి ఆధారములగు నిట్టిగ్రంథములు అంతరించుట లోకముయొక్క దైవదుర్విలసితమనియును తలఁచి తాను ఆగ్రంథభాగములను సంగ్రహించి కామసూత్రము లను పేర నిప్పటిరూపమునఁ గూర్చుటయైనది. ఈవిషయము వాత్స్యాయనుని గ్రంథమునందలి యీక్రిందిసందర్భమునుబట్టియును అచ్చటచ్చట — గోనర్దీయః ఆచార్యస్తు సువర్ణనాభః — అను మున్నగువాక్యములను ప్రయోగించుటబట్టియును తెలిసికొనవచ్చును.

ప్రజాపతిర్హి ప్రజాస్సృష్ట్వా తాసాం స్థితినిబంధనం త్రివర్గస్య సాధన మధ్యాయానాంశతసహస్రేణాగ్రే ప్రోవాచ. తస్యైకదేశం స్వాయంభువో మనుర్ధర్మాధికారికం పృథక్చకార. బృహస్పతి రర్థాధికారికమ్. మహాదేవానుచరశ్చ నందీ సహస్రేణాధ్యాయానాం పృథక్కామసూత్రం ప్రోవాచ. తదేవతు పంచభిరధ్యాయశతైరౌద్దాలకి శ్శ్వేతకేతు స్సంచిక్షేప. తదేవతు పునరధ్యర్ధేశతేన సాధారణ సాంప్రయోగిక కన్యాసంప్రయుక్తక భార్యాధికారిక పారదారిక వైశికౌపనిషదికైః సప్తభిరధికరణై ర్బాభ్రవ్యః పాంచాల స్సంచిక్షేప. తస్య షష్ఠం వైశిక మధికరణం పాటలిపుత్రికాణాం గణికానాం నియోగాద్దత్తకః పృథక్చకార. తత్ప్రసంగా చ్చారాయణస్సాధారణ మధికరణం పృథక్ప్రోవాచ. సువర్ణనాభస్సాంప్రయోగికం ఘోటకముఖః కన్యాసంప్రయుక్తకం గోనర్దీయో భార్యాధికారికం గోణికాపుత్రః పారదారికమ్. కుచుమార ఔపనిషదికం ఏవం బహుభిరాచార్యై స్తచ్ఛాస్త్రం ఖండశః ప్రణీత ముత్సన్నకల్ప మభూత్. తత్ర దత్తకాదిభిః ప్రణీతానాం శాస్త్రావయవానా మేకదేశత్వాత్ మహదితిచ బాభ్రవ్యస్య దురధ్యేయత్వాత్ సంక్షిప్య సర్వమర్థ మల్పేన గ్రంథేన కామసూత్ర మిదం ప్రణీతమ్ — [ సూ 5-19 ]

పైని యుదాహరించిన గ్రంథసందర్భమునుబట్టి మనువు మున్నగు వారందరు ప్రత్యేకముగా గ్రథనమొనర్చిన సందర్భములన్నియును ఈ కామసూత్రములలోనివే యనియును, అట్లు వారు ప్రత్యేకించగా మూలగ్రంథ ముత్సన్నప్రాయమయ్యెననియును అప్పుడు వాత్స్యాయన మహర్షి సంక్షేపించి మూలగ్రంథమునందలి సర్వవిషయములు వచ్చునట్లు దీని నొనర్చెననియును తెల్లమగుచునే యున్నదిగదా! ఇఁక నీస్థితి నిట్లుంచి కామశాస్త్రాధ్యయనము దుష్ప్రవృత్తిప్రేరకమగు నన్న విషయము ఎంతవఱకు నిజమో చూతము.

దుశ్శీలత యలవడుటకు కామశాస్త్రముమాత్రమే కారణము కాఁజాలదు. అది — ప్రకృతిసిద్ధమిదంహి దురాత్మనాం — అన్న న్యాయము ననుసరించియుండును. ఇంతయేల? మనవారు నిత్యమును పఠనపాఠనవ్యవహారములలో నుంచికొన్న పంచకావ్యములు కామశాస్త్రమునకంటె కోటిరెట్లుగ ప్రచ్ఛన్నశృంగారములతోఁ దులతూగుచున్నవి. ఉదాహరణార్థము రఘువంశము 19 సర్గమును గాని, కుమారసంభవము 8 వ సర్గమును గాని (మేఘసందేశమంతయు చెప్పవలసినదే లేదు.) కిరాతార్జునీయము 9 సర్గమును గాని నైషధము 18 వ సర్గమును గాని — చివఱకు తెలుగులో ప్రతిపదార్థతాత్పర్యములతో పాఠ్యగ్రంథములుగా వెలయుచున్న మనువసుచరిత్రాదులను గాని పరికించినచో విస్పష్టము గాగలదు. కాని ఎంతటి ప్రాజ్ఞుఁడైనను రఘువంశాదులు గాని మనువసుచరిత్రాదులు గాని లోకమును చెఱచివైచెనని గాని చెఱుపగలవని గాని చెప్పజాలఁడు. ఏగ్రంథమునన్నైనను ఎట్టి కావ్యమునన్నైనను సందర్భములు ద్వివిధములుగ నుండును. అనువాదకములని, స్వతంత్రములని. ఇతరులయొక్క గాని, ఇతరశాస్త్రములయొక్క గాని అభిప్రాయములను వివరించునట్టివి అనువాదకసందర్భములు. తక్కినవి స్వతంత్రములు. మనుచరిత్ర, వసుచరిత్రలలోని వరూథనీప్రవరుల సంభాషణము, గిరికావియోగసందర్భవర్ణనము మున్నగునవి అనువాదవాక్యములు. అనగా కాముకులయొక్క యాగడము లిట్లుండును సుమా యని యనువదించి నిరశించునట్టివే గాని అయ్యదియే లోకమునకు అనుకార్యము అని నిరూపించునట్టివి గావని భావము. ఇట్లే వాత్స్యాయనగ్రంథసందర్భమునను మనవారారోపించు దోషములుగల భాగము సయితము నని తెలియవలయును. వాత్స్యాయనసూత్రములయుద్దేశమే లేకుండినచో కామము ధర్మార్థావిరుద్ధముగా నుండునట్లు సేవింపవలయునే గాని

అతిమాత్రముగా స్వేచ్ఛతో చరింపరాదనియు చెప్పుచు, నరదేవుడు, శాతకర్ణి, చోళరాజు, ఆభీరకొట్టరాజు, జయసేనుడు మొదలగువారి యుదాహరణముల చూపుట పొసగదు. నరదేవుడు, శాతకర్ణి మొదలగువారు ప్రాచీనులగు ఆర్యక్షత్రియులు. చతుస్సముద్రముద్రితములగు ధరామండలము నేలినవారు, ధర్మరతులు. అయినను వారు లోకవిద్విష్టములును ధర్మేతరములును అగుమార్గము లవలంబించుటచేత నాశనమునకు గురియైరి. (వీరిచరిత్రలన్నియు నాగ్రంథమునందు వివరింపబడియున్నది.) కనుక కామసూత్రములు ప్రత్యక్షముగా ననర్థములను వారించి లోకసంస్థితి నొనర్పగలిగినదే గాని అన్యథామాత్రము కాజాలదు. ఈవిషయమును ఈక్రింది సందర్భముకూడ సమర్థింపగల్గుటయే గాక వాత్స్యాయనుని ఉద్దేశమును గూడ స్పష్టపరుపజాలి యుండగలదు.

బహవశ్చ కామవశగా శ్రూయంతే యథా దాండక్యోనామ భోజః కామాద్బ్రాహ్మణకన్యా మభిమన్యమానః సబంధురాష్ట్రో విననాశ దేవరాజశ్చాహల్యామ్, అతిబలశ్చ కీచకో ద్రౌపదీం, రావణశ్చ సీతాం, అపరే చాన్యే చ బహవః దృశ్యంతే కామవశగా వినష్టాః — అని.

కామశాస్త్రమన్నంతమాత్రాన తనకాలమునాడుగూడ లోకులు విపరీతార్థములను చేసికొందురేమో యన్న ననుమానముచేత నే కాబోలును వాత్స్యాయనమహర్షి ఒకచో నిట్లుగూడ చెప్పియున్నాడు:

శ్లో॥ యా గోష్ఠీ లోకవిద్విష్టా యా చ స్వైరవిసర్పిణీ
పరహింసాత్మికా యా చ న తా మవతరేద్బుధః।

అని లోకమునకు విద్విష్టమైయున్నట్టిగాని పరహింసాత్మకమైనట్టిగాని స్వేచ్ఛాచారవిహారములను పురికొల్పి లోకస్థితికి భంగము వాటిల్లజేయునట్టిగాని గోష్ఠులు బొత్తుగా పనికిరావనియును అట్టిగోష్ఠులు లోకవేళ నెప్పుడైనను జరుగుచున్నను వానియందు బుద్ధిమంతుడగు నరుడు పాల్గొనరాదని చెప్పుచున్నాడు. మఱియును "శాస్త్రములలో చెప్పంబడియున్నదిగదా" యని యథావత్తుగా చేయుటను పూనుకొనరాదు. ఏలయనగా నయ్యవి స్థూలదృష్టితో నిర్దేశింపబడినవిమాత్రమే గాన లోకవర్తనము నెఱింగి ప్రవర్తింపవలయుననియు చెప్పబడినది. చూడుడు:—

న శాస్త్ర మస్తీత్యేతావత్ప్రయోగే కారణం భవేత్
శాస్త్రార్థాన్ వ్యాపినో విద్యాత్ప్రయోగాంస్త్వేకదేశికాన్। రసవీర్యవిపాకా హి శ్వమాంసస్యాపి వైద్యకే।
కీర్తితా ఇతి తత్కిం స్యాద్భక్షణీయం విచక్షణైః।

"అనుచితములగు విషయములను ధర్మబాహ్యములగు విషయములను వక్తృగౌరవమునుబట్టిగాని శాస్త్రగౌరవమునుబట్టిగాని స్వీకరింపరాదనియును వైద్యశాస్త్రమునందు కుక్కమాంసమునకు రసవీర్యవిపాకాదులు ఫలములుగా చెప్పంబడినను విచక్షణులగు పెద్దల కియ్యది భక్షణీయము కాదనియును" నిర్దేశించి తనగ్రంథమునందలి అత్యుక్తిదోషమును వారించి సుపథమును ప్రదర్శించుచున్నాడు. ఇంతయే కాదు. గ్రంథారంభమునుండి చివఱవఱకును వాత్స్యాయనునియొక్క ఆదర్శమే లోకోత్తరమైనది. అనన్యసాధారణమైనది. ఫలశ్రుతిని చిత్తగింపుడు. అందెట్లు కృత్యాకృత్యవ్యవస్థను ఏర్పరించుచున్నాడో!

పూర్వశాస్త్రాణి సందృశ్య ప్రయోగా ననుసృత్య చ
కామసూత్రమిదం యత్నాత్సంక్షేపేణ నివేదితమ్।
ధర్మమర్థం చ కామం చ ప్రత్యయం లోకమేవ చ
పశ్యత్యేతస్య తత్త్వజ్ఞో న చ రాగాత్ప్రవర్తతే
అధికారవశాదుక్తా యే చిత్రా రాగవర్ధనాః
తదనంతర మత్రైవ తే యత్నా ద్వినివారితాః
... ... ... ...
తదేతద్బ్రహ్మచర్యేణ పరేణ చ సమాధినా
విహితం లోకయాత్రార్థం న రాగార్థోస్య సంవిధిః
రక్షన్ ధర్మార్థకామానాం స్థితిం స్వాం లోకవర్తినీం
అస్య శాస్త్రస్య తత్త్వజ్ఞో భవత్యేవ జితేంద్రియః
తదేతత్కుశలో విద్వాన్ ధర్మార్థా వవలోకయన్
నాతిరాగాత్మకః కామీ ప్రయుంజానః ప్రసిధ్యతి.

[పూర్వశాస్త్రములను పరికించి అందలి ప్రయోగములను లోకవృత్తములను కనిపెట్టి ప్రయత్నపూర్వకముగా—(అనగా ప్రణిధానపూర్వకమగు వ్యవస్థతో) ఈ కామసూత్రము సంక్షేపముగా లోకమునకు నివేదింపబడినది. కావున నీకామసూత్రమునందలి తత్త్వము నెఱింగినవాడైనచో ధర్మమును అర్థమును కామమును లోకవిశ్వాసమును ఆర్జించి యుక్తాయుక్తజ్ఞానము కలవారగుదురే గాని రాగాంధులై ప్రవర్తింపజాలరు. ఈశాస్త్రమునందు ఆయా ప్రకరణసందర్భములనుబట్టియును, ఆయా యధికారములందు (అనగా ప్రకరణములందు) పేర్కొన్న విషయప్రాబల్యము ననుసరించియును అనేకవిధములగు చిత్రరతములు విస్తరించి చెప్పబడినవి. కాని వెనువెంటనే తత్పరిస్థితులను చూపించుచు యత్నపూర్వకముగ నయ్యవి వారింపబడియు నున్నవి * * * * కావున నీకామశాస్త్రమును—అవిప్లుతమగు బ్రహ్మచర్యమును

ఉత్తమోత్తమమగు సమాధిని అలవఱచికొన్నవాడై లోకయాత్రను నిర్వహించుకొనుటకే నిర్దేశింపబడినదే కాని అంధప్రాయముగ దుష్టరాగమును వృద్ధిపొందించుటకై ఎంతమాత్రమును నిర్దేశింపబడలేదు. ఈశాస్త్రము నెఱింగినవాడు ధర్మార్థకామములస్థితిని లోకప్రవర్తనను తెలిసికొని జితేంద్రియుడు తప్పక కాగలడు.అని భావము.]

పైనివివరించిన వాక్యములవలన వాత్స్యాయనసూత్రముల ప్రాశస్త్యము మాచదువరులు గమనించియే యుందురు. కాన నిక వివరింపక ప్రకృతమునకు వచ్చెదను. ఈ వాత్స్యాయనసూత్రము ఏడధికరణములలో 36 అధ్యాయములలో దాదాపు 1700 సూత్రములకు పైగ కూర్పబడియున్నది. మొదటిది సాధారణాధికరణము. ఇందు ఆయాశాస్త్రముల మర్యాదల ననుసరించి యొప్పబడుచుండెడి—శాస్త్రసంగ్రహము తత్ప్రయోజనము తదధికారనిరూపణము, సాధ్యసాధనవ్యవస్థ శాస్త్రసమరనము మొదలగు శాస్త్రసాధారణవిషయము లుండుటచేత దీనికి సాధారణాధికరణమని పేరువచ్చినది. ఇయ్యది యైదధ్యాయములు గలది. ఇందు, 2, 3, 4, అధ్యాయములు కేవల మొక్క కామశాస్త్రముల నెఱుంగగోరువారికి మాత్రమేగాక ఆర్యనాగరకతయందలి పరమార్థమును ఆర్యవిద్యలయందలి రహస్యములను ఎఱుంగగోరు పెద్దలకెల్లరకు పఠింపదగియున్నది. ఇందలి నాగరకవృత్తము అను ప్రకరణము నొక్కదానిని గుఱించియే యొకగ్రంథము వ్రాయదగిన యంశములు గలవు. రెండవ యధికరణము సాంప్రయోగికాధికరణము. ఇందు ఇరువదిరెండు అధ్యాయములు గలవు. ఈసాంప్రయోగికాధికరణమునందు పది నేడు ప్రధానాధ్యాయములును అయిదు ఇతరాధ్యాయములును గలవు. దీనియందు కామమును సంప్రయోగమునకు గొనితేగల సాధనములు సోపపత్తికముగ నిరూపింపబడుచుగాన దీనికి సాంప్రయోగికాధికరణము అని పేరువచ్చినది. మూడవది కన్యాసంప్రయుక్తకమను నధికరణము. దీనియందు వరణవిధానము, సంబంధనిర్ణయము మున్నగు ఆవశ్యకములగు విజ్ఞేయాంశములు పెక్కులుగలవు. ఇందు అయిదధ్యాయములును తొమ్మిదిప్రకరణములును గలవు. నాలవది భార్యాధికరణము. గృహస్థులగు ప్రతివారును చూచి మెచ్చుకొనవలసిన ప్రకరణమిది. పాశ్చాత్త్యులు ఇక నన్యాదితరముల కైనను పొందజాలని నాగరకత లింకెన్నివిధములనో కూర్పబడినవి. వాత్స్యాయనుని కాలమునాడు మన భరతఖండమునందు ఒక్కొక్కగృహము నొక్కొక్క పరిశ్రమాలయముగ నున్నట్లు నిరూపించునట్టిప్రకరణ మిదియే. ఇందు రెండధ్యాయములును ఎనిమిది ప్రకరణములును గలవు. ఇయ్యది మన వరిష్ఠులగు బాలురకు బాలికలకు నిత్యము పాఠ్యముగా నుంచవలసిన గ్రంథభాగము. అయిదవది పారదారికాధికరణము. ఇందు ఆరధ్యాయములును పది ప్రకరణములును గలవు. ఇందు గమ్యాగమ్యచింత ఉపావర్తనవిధి యను విషయములపై వ్రాసినప్రకరణములు ఎంతటి విద్వాంసునకైనను ఆహా యని ఆశ్చర్యాబ్ధిని ముంచివైచునట్టివి. ఆరవది వైశికము. ఇందు ఆరధ్యాయములును, పండ్రెండు ప్రకరణములును గలవు. ఏడవది ఔపనిషదికాధికరణము. ఇందు రెండధ్యాయములును, ఆరు ప్రకరణములునుగలవు. ఈయధికరణమునందు సుభగంకరణము వృష్యయోగములు అను నధ్యాయములు ముఖ్యముగా చూడవలసియున్నవి. ఇట్లీశాస్త్రము 36 అధ్యాయములగను 64 ప్రకరణములుగలదిగను కూర్పబడి అపూర్వములగు విజ్ఞానవిషయరత్నములతో నిండి విద్యార్థులకు వేత్తలకు, చరిత్రజ్ఞులకు, శాస్త్రశోధకులకు, పండితులకు, పామరులకు, మూర్ఖులకు, ముముక్షువులకు సైతము సేవింపదగినదై—రత్నాకరముపలె నున్నది. అయ్యో! ఇట్టి వాత్స్యాయనకామసూత్రములు ప్రస్తుతము దైవదుర్విపాకముచేత ప్రచారమున లేకుండ బోయినవి. ఇయ్యది మన దురదృష్టము కాదా!

వాత్స్యాయనకామసూత్రములపై నాలుగువ్యాఖ్యానములున్నవి: (1) జయమంగళ, (2) నృసింహవృత్తి, (3) వీరభద్రకారిక, (4) నందివృత్తి. ఇందులో మొదటిది తప్ప తక్కినవన్నియును ఆంధ్రులు రచించిన వ్యాఖ్యానములే. ఇవి అన్నియును అతిప్రాచీనములు. విషయపూర్ణములు. సుప్రచారయుక్తములు. కావున ప్రస్తుతము జయమంగళనృసింహవృత్తులు మేళవించి వైద్యక భరత సంగీతకాది శాస్త్రవిషయము లను టిప్పణులలో క్రోడీకరించి తేటతెలుగున (మూలము తద్వ్యాఖ్యానములతోసహా) వివరణములను చేర్చుచు నేను ఆంధ్రవ్యాఖ్యానమును రచించియున్నాను. అయ్యది విశేషజ్ఞులగు ఆంధ్రమహాజనుల ధన మనస్సహాయము లున్నగాని వెలికి రాజాలదు. ప్రాచీననాగరకతాభిమానులును సహృదయులు నగు ఆంధ్రమహాజనులు తోడ్పడి ఆంధ్రభారతికి ఈయలంకారమును సేకూర్చి ధన్యులు కాగోరెదను.

—కావ్యవ్యాకరణతీర్థులు-పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి.

# యెంకి సరదాలు.

1 యెంకి వస్తాదాని
ఎదురు తెన్నులు కాసి
దిగులుల్తో, తలదించి
తిరిగి సూసేతలికి—
యెంకిరావాలి నా యెదర నిలవాలి
కులుకుతా నన్నేటో పలకరించాలి!

2 పిల్ల పొరుగూరెల్లి
మల్లి రాలేదని
వొల్లంత వుసూరని
వొక్కణ్ణి పాడుకుంటె—
ఘల్లుమంటా యెంకి కాలు పెట్టాలి
"యెల్లొచ్చా" నంట యెంక నవ్వాలి!

3 యెంకి కోపాలొచ్చి
యేదేశమో పోయి
కల్లో నా కాపడితె
కళ్ళు తెరిసేసరికి—
తళుకుమని యెంకి నా దరికి రావాలి
"నిదరకాబోలు" నంట నిందలాడాలి!

12-5-23 —నండూరి వెంకటసుబ్బారావు.

# ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ, పమిడిపాడు.

## 1-2-3 తేదీలు మే 1923.

౧

ఆంధ్రదేశాభ్యుదయము కొరకై తమజీవితము నంతను ధారవోసి పిన్నవయస్సులోనే కీర్తిశేషులైన కోపల్లె హనుమంతరావు పంతులుగారి నిర్యాణమువల్ల దేశమునకు కలిగిన తీరనిలోపమునకు ఈ సభవారు చింతిల్లుచు వారి ఆత్మకు నిత్యశాంతి నొసంగుటకు పరమేశ్వరుని ప్రార్థించుచున్నారు.

౨

యావద్విశ్వమునకు ధర్మోపదేశము గావింప నవతరించిన శ్రీ గాంధిమహాత్ములవారు భారతభూమి కొనర్చిన మహాదుష్కృతుల ప్రశంసించుచు అచిరకాలములో వారికి చెఱ తప్పించి తిరిగి స్వతంత్రపీఠము నధిష్ఠింప పరమేశ్వరుడు అనుగ్రహించుగాత యని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

౩

శ్రీమదాంధ్ర గ్రంథాలయ మహోద్యమముయొక్క ప్రధానధర్మము సర్వమత సహనశీలమును, సకలోదార భావప్రవృత్తియును నిష్పాక్షికములును నగుసాధనమార్గము ననవరత మనుష్ఠించి నిఖిలాంధ్రాభ్యుదయము నిజస్వాతంత్ర్యోత్తేజకముగా పెంపొందింపచేయుటయని సిద్ధాంతీకరించుచు, యిందు ముఖ్యముగా,

౧ రసజ్ఞతను పెంపొందించుట. అనగా సంగీతసాహిత్యాది సర్వకళాపోషణమున్ను,

౨ దీనజ పోషణమున్ను.

౩ నిరంతర ధర్మవ్యాఖ్యానమున్ను,

౪ పరమార్థము ప్రసాదించు విశిష్టగ్రంథసేవతారాధనమున్ను ప్రధానలక్ష్యములని యీ సభవారు తీర్మానించుచున్నారు.

౫ ఏతల్లక్ష్యాత్మకమగు కార్యవిధానమును, యీ దిగువ వివరింపబడిన రీతిని ప్రతిగ్రంథాలయము అనుష్ఠింపవలయునని యీ సభవారు హెచ్చరించుచున్నారు.

క ౧ పురాతనగ్రంథములను సేకరించుట.

౨ ఆయాగ్రామములలోని కళాభిజ్ఞుల వివరములను తెలుసుకొని వారిని సర్వవిధముల ప్రోత్సహించుట.

౩ స్థానికవిశేషములను తగు పరిశోధనచేసి శిథిలమైన పురాతనకళలచిహ్నములను పునరుద్ధరించుట.

౪ యథార్థమైన స్థలపురాణముల నిర్ణయించుట.

ఖ. గ్రామమందు నిరాధారులగూర్చి వివరములను తెలుసుకొనియుంచి వారికి చేతిపనులు మొదలగునవి నేర్పియు యితరవిధముల వారికి జీవనోపాధుల కల్పించుట.

గ. ప్రతి గ్రంథాలయమందును పరమార్థమును సర్వప్రాణిసమత్వమును ప్రజలయందు ప్రేమానుబంధమును ఉద్బోధింపగల గ్రంథములను అనగా వేద వేదాంగపురాణేతిహాస ధర్మశాస్త్రాది గ్రంథములను, కొరాను, బైబులు, బౌద్ధపిటకాది వేదములను ప్రధానముగా సంగ్రహించి ఒకకథకుని నియమించి ఆయన మూలమును, నిరంతర ధర్మవ్యాఖ్యానమును గావించుట.

ఘ. ప్రజాభ్యుదయమునకు, సమిష్టిన జరుగదగిన సర్వతోముఖమైన సేవావిధానమును స్థానికవిశేషముల గ్రహించి నిరంతరము నిర్వహించుట. అనగా యిందు వనభోజనములు జరుపుట, ప్రసిద్ధపురుషులకు స్వాగతాదుల నర్పించుట, ప్రసిద్ధకళాభిజ్ఞుల సంభావించుట, సమిష్టికార్యము లిందు ఊహ్యములు.

చ. నిష్పాక్షికములును, సర్వప్రాణి సమత్వాభిలక్ష్య సమన్వితములును నగు సేవాసంఘములను గ్రామములందు నెలకొల్పి సమిష్టిప్రజాసేవ గావించుట.

ఛ. ప్రతిగ్రంథాలయ వార్షికవేదికయందు పైవిషయములనుగూర్చి చేసినపనిని విస్పష్టముగా తెలుపుచుండుట.

ఉపపాదకుడు:—కొల్లంకొండ రాఘవరావుగారు.
ఆమోదకులు:—సూరి నరసింహశాస్త్రిగారు.
చిలుకూరి నారాయణరావుగారు.

౪

ఈ సంవత్సరపు డిశంబరు నెలలో కాకినాడపట్టణమున అఖిలభారతదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభను ఆంధ్రసభ్యతను వ్యక్తీకరించు సర్వతోముఖ ప్రదర్శన సహితముగ సమావేశపరచుటకు ఈసభవారు తీర్మానించుచు ఈతీర్మానమును ఆచరణలోనికి తెచ్చుటకు ఈక్రింది వారిని ఉపసంఘముగా నియమించుచున్నారు:

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ అధికారసభ్యులు:
బులుసు సాంబమూర్తిగారు,
న్యాపతి సుబ్బారావు పంతులుగారు,
కంచుమర్తి రామచంద్రరావుగారు.

ఈసభ్యులు యితర సభ్యులను చేర్చుటకు అధికారము కలిగియుండవలెను.

ఉ—సూరి వెంకటనరసింహంగారు.
ఆమో—యాతగిరి లక్ష్మీవెంకటరమణగారు.
కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు.

౫

ఆంధ్రదేశచరిత్రను సంబంధించిన పూర్వరచితమైన మూలగ్రంథములను శాసనములను ఆంగ్లభాషయందు ప్రకాశింపజేయుటకు ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున 'పరిశోధక' పత్రిక నొకటి ప్రకటించుట అవసరమని ఈ సభవారుతీర్మానించుచు, ఈ తీర్మానమును అమలులోనికి తెచ్చుటకు, ఈ క్రిందివారిని ఉపసంఘముగా నేర్పరచుచున్నారు:

1. నడింపల్లి జగన్నాథరావుగారు, Convener.
2. చిలుకూరు నారాయణరావుగారు,
3. ఉన్నవ లక్ష్మీనారాయణరావుగారు,
4. కోటగిరి ప్రభాకరరావుగారు,
5. భావరాజు వెంకటకృష్ణారావుగారు,
6. పురాణం సూరిశాస్త్రిగారు,
7. పెద్దిభొట్ల వీరయ్యగారు,

ఉ— శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారు.
ఆ— చిలుకూరి నారాయణరావు పంతులుగారు.
ఈసంఘమునకు, ఉమ్మడిశెట్టి,
ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారు.

౬

ఆంధ్రదేశగ్రంథాలయ సంఘపక్షమున గ్రంథమాల నొకదానిని స్థాపించి ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి అవసరమగు గ్రంథములనన్నిటిని సులభముగా వెలకు ప్రకటింపవలెనని ఈసభవారు తీర్మానించుచు, వెంటనే ఈతీర్మానమును ఆచరణలోనికి తెచ్చుటకు ఈక్రిందివారిని ఉపసంఘముగా నియమించుచున్నారు:

ఉమ్మడిశెట్టి:—
1. కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు,
2. నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారు,
3. గోపాలుని రామలింగయ్యగారు,
4. గుంటూరు నరసింహారావుగారు,
5. ఉప్పులూరి లక్ష్మీనరసింహదాసుగారు,
6. చెట్టి లక్ష్మీనరసింహారావుగారు.
7. రావూరి శ్రీశైలపతిగారు.

ఉ—ఉప్పులూరి లక్ష్మీనరసింహదాసుగారు.
ఆ—పాణింగిపల్లి వరహాలుగారు,
కో. రామకోటేశ్వరరావుగారు

౭

ప్రతిసంవత్సరము వినాయకచవితినాడు భాండాగారసభ్యులెల్లరు ఆ యా గ్రామములయందు భిక్షాటనమొనర్చి సముపార్జించిన సాహిత్యపరికరములను అచ్చటచ్చట యుంచుకొనుటకును ధనమునందు 1/4 వంతును ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకు పంపవలయునని సభవారు తీర్మానించుచున్నారు.

ఉపపాదకులు:—కాశా శ్రీరామశాస్త్రిగారు.
ఆమోదకులు:—పాతూరి వెంకటేశ్వర్లుగారు, ధూళిపూడి.
నాళం మట్టపల్లిగారు, రెంటచింతల.

౮

ప్రతి గ్రంథాలయమువారును వసంతోత్సవమును జరుపవలయు ననియు. అప్పుడు సర్వకళ్యాణము జరిగించి స్వగ్రామమందలి సాహిత్యకోవిదులను శిల్పనిపుణులను బహూకరించవలయునని యీ సభవారు తీర్మానించుచున్నారు.

ఉ:—శ్రీయుతులు కాశా శ్రీరామశాస్త్రిగారు.
ఆ:—తెలికేపల్లి రామణేశ్వరశాస్త్రిగారు,
వి. ఎస్. శర్మగారు.

౯

తిరిగి ఆంధ్రగ్రంథాలయమహాసభ జరుగులోపల గ్రంథాలయ సభ్యులను ఈ దిగువ నుదహరించినకార్యములు నిర్వహింపవలయునని ఈమహాసభ విధించుచున్నది.

ఆయాగ్రామములందలి
(1) ధర్మప్రతిష్టాపనలు, మొదలగువాని చరిత్రలను వ్రాయుట.
(2) ఉత్సవములు మొ. వాని చరిత్రవ్రాయుట.
(3) వివిధజాతులు, మతములు, వారిచరిత్ర, వారివారి ఉత్సవములు—వాటికి సంబంధించిన చరిత్రను విపులముగ వ్రాయుట.
(4) ఆగ్రామమందు పురాతనవస్తువుల నొకచోట నుంచి వృత్తాంతము వ్రాయుట.
(5) వివిధజాతులు వారికుపకరించుపనిముట్లు వాని నామములు మొదలగువానిని సంగ్రహించుట.
(6) నెల కొకమారు కళాసభను గూర్చుట.

ఉ:—కాశా శ్రీరామశాస్త్రిగారు.
ఆ:—కొమాండూరు వేంకటాచార్యులుగారు, పంటపాడు,
ఆళ్వారుగారు, ఒంగోలు.

౧౦

రాజమహేంద్రవరములోని గౌతమీగ్రంథాలయ భవననిర్మాణముకొరకు రూ౧౦౦౦ లు విరాళము నొసంగిన మ॥ రా॥ శ్రీ కంచుమర్తి వెంకటరామచంద్రరావుగారికిని బెజవాడ శ్రీరామమోహనధర్మగ్రంథాలయమునకు రెండవ అంతస్థును కట్టించుచున్న కాశా సూర్యనారాయణరావుగారికిని యీసభవారుకృతజ్ఞతను తెలుపుచున్నారు.

౧౧

కాకినాడలో జరుగబోవు కాంగ్రెసు సమావేశ సందర్భమున, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు మొదలగుభక్తులు సంకల్పించిన సప్తాహమునకు ఆంధ్రదేశమునందలి ప్రజలెల్లరును, గ్రంథాలయములను సమస్తవిధముల సహాయము చేయవలెనని ఈసభవారు హెచ్చరించుచున్నారు.

ఉ:—బెల్లంకొండ రాఘవరావుగారు.
ఆ:—కుప్పా శ్రీరామశర్మగారు,
కందాడై వెంకటకృష్ణమాచార్యులుగారు.

౧౨

ఆంధ్రవాఙ్మయమునందు ముద్రితమైనట్టియు అముద్రితమైనట్టియు గ్రంథములను, శాసనములను శాస్త్రసమ్మతమగు విధానము ననుసరించి వర్గీకరణముచేసి పట్టీలు తయారుచేయుటకును, చదువరికి కావలసిన గ్రంథమును వెంటనే సులభముగ లభింపచేయుటకొనుటకు తగినట్లు చిహ్నములను గ్రంథముల కిచ్చుటకును గ్రంథవిభజన విధానము నొకదానిని నిరూపణచేసి ప్రచురించుటకు ఆంధ్రగ్రంథాలయసంఘమువారిని ఈ సభవారు కోరుచున్నారు.

ఉ:—బెల్లంకొండ రాఘవరావుగారు.
ఆ:—కుప్పా శ్రీరామశర్మగారు.

౧౩

అఖిలభారతదేశీయసామాన్యభాషగా వ్యవహరింపబడుచున్నట్టియు, రాజకీయవ్యవహారములయందు దవసరమైనట్టియు హిందీభాషను త్వరలో ప్రచారమునకు తెచ్చుటకు ఆంధ్రదేశ గ్రంథాలయసోదరులను యీసభవారు ప్రోత్సహించుచున్నారు.

ఉ—భా. గోపాలకృష్ణమూర్తిగారు.
ఆ—వె. సుబ్బారావుగారు.

౧౪

ప్రతిగ్రంథాలయమునుండియు సంవత్సరము కొకసారి అభివృద్ధిసూచకపట్టీని ఆంధ్రరాష్ట్రీయగ్రంథాలయస్థాయి సంఘమువారికి పంపుచుండవలయును. ప్రతిగ్రంథాలయము వారును వార్షిక ప్రవేశరుసును రూ౪-౦-౦ లను సదరు సంఘమువారికి చెల్లించుచుండవలయుననియు ఈసభవారు తీర్మానించుచున్నారు.

గ్రంథాలయసర్వస్వము నుచితముగ నట్టిగ్రంథాలయములకు పంపవలయును.

ఉ:—గర్నెపూడి సీతారామయ్యగారు.
ఆ:—టి. పి. ఆళ్వారుగారు.

౧౫

సర్వజనసమాదరణీయమైన ఖద్దరుచేత గ్రంథాలయములయందుంచబడు గ్రంథములను బైండుకట్టించవలయునని యీసభవారు తీర్మానించుచున్నారు.

ఉ:—కోడేటి రంగాచార్యులుగారు.
ఆ:—కాతా శ్రీరామశాస్త్రులుగారు,
అచ్యుతన్న పిచ్చయ్యశర్మగారు.

౧౬

గ్రంథాలయమహోద్యమమందు తీవ్రముగ పనిజరుగుటకుగాను ముగ్గురు కార్యదర్శులు చాలఅవసరమని తీర్మానించుచున్నారు.

౧౭

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకు ఈక్రిందివారిని కార్యనిర్వాహకసభగా ఏర్పాటుచేయడమైనది.

సామాన్యసభకు అధ్యక్షులు:—దగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు.

కార్యనిర్వాహకవర్గఅధ్యక్షులు:—సూరి వెంకటనరిసింహశాస్త్రిగారు.

ఉపాధ్యక్షులు:—చెలికాని లచ్చారావుగారు.

కార్యదర్శులు:—అయ్యంకి వెంకటరమణయ్యగారు,
బెల్లంకొండ రాఘవరావుగారు,
పాణంగిపల్లి వరహాలుగారు.

ఇతరసభ్యులు:—జిల్లా ౧కి రు 2 లు చొప్పున ఏర్పాటుచేయడమైనది.

గుంటూరు—ఉన్నవ లక్ష్మీనారాయణగారు,
టి. పి. ఆల్వారుగారు,
గుంటూరు నరసింహారావుగారు.
కృష్ణా—కాతా శ్రీరామశాస్త్రిగారు,
కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు,
ఆకొకపూడి రామశాస్త్రులుగారు.
గోదావరి—యాతగిరి లక్ష్మీవెంకటరమణగారు,
వేపూరి వేణుగోపాలదాసుగారు,
ద్రోణంరాజు కామేశ్వరరావుగారు.

మిగిలినసభ్యులను ఆ యాజిల్లాలవారితో ఆలోచించి, చేర్చుటకు తీర్మానించడమైనది.

౧౮

ఆంధ్రగ్రంథాలయప్రెస్, లిమిటెడ్, బెజవాడకు రాబోవుసంవత్సరమునకు బెల్లంకొండ రాఘవరావుగారిని డైరక్టరుగాఎన్నుకోవడమైనది.

౧౯

రాబోవుసభను రాజమహేంద్రవరము, లక్ష్మీనరసాపురం, బెజవాడ గ్రామములయందు జరుపుట కాహ్వానము జరిగినది.

గోదావరిజిల్లా లక్ష్మీనరసాపురం గ్రామమందు జరుపుటకై శ్రీకావ్యనిధి చెలికాని లచ్చారావుగారి ఆహ్వానము అంగీకరింపబడినది.

# గ్రంథాలయములు.

సీ॥ శ్రీభారతీసతి స్థిరనివాసంబున
కాలవాలములు గ్రంథాలయములు
అజ్ఞానతిమిరంబు హరియింప విమల వి
ద్యావిలాసములు గ్రంథాలయములు
సాంఘికమతరహస్యములెల్ల దెల్ప స
ద్ధర్మాలయములు గ్రంథాలయములు
జాతీయగౌరవాస్పదనిరాటంక శు
భాదర్శకములు గ్రంథాలయములు
తే॥ ఇట్టి గ్రంథాలయోద్యమ మెల్లగతుల
విస్తరింపగ భాషాభివృద్ధిగాంచి
భారతీయులు తొల్లింటిభంగి మెరయ
విన్నవించెద నీచిన్ని విన్నపంబు॥

సీ॥ మన పూర్వవిజ్ఞానఘన విరాజిలుటకు
గ్రంథాలయములె సత్కారణములు
మన సనాతనధర్మమహిమోన్నతికి సదా
గ్రంథాలయములె సత్కారణములు
మనసహోదరుల, సన్మార్గాభివృద్ధికి
గ్రంథాలయములె సత్కారణములు
మనదేశ మైకమత్యనిరూఢి గనుటకు
గ్రంథాలయములె సత్కారణములు
తే॥ ఇట్టి గ్రంథాలయోద్యమ మెల్లగతుల
విస్తరింపగ భాషాభివృద్ధిగాంచి
భారతీయులు తొల్లింటిభంగి మెరయ
విన్నవించెద నీచిన్ని విన్నపంబు॥

—ఏనుగు తిమ్మకవి.

# ఎనిమిదవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ.

మహానందిలో సభకూడినపిదప తిరిగి సభకూడుటకు ఆలస్యమైనది. ఇందువలన గ్రంథాలయోద్యమాభిమానుల యందు కొంత నిరుత్సాహము కల్గినది. తుదకు పమిడిపాడులో ఈసభ కూడినది. ఈ సభను సమావేశపర్చుటయందు ముఖ్యులు శ్రీయుత జెల్లంకొండ రాఘవరావుగారు. మా చదువరులలో శ్రీ రాఘవరావుగారిని ఎరుగనివారుండరని తలంచెదము. పిన్నవయస్కులై పితృపితామహార్జితమగు ఐశ్వర్యముతో తులతూగుచుండియు, నిరుపమానదేశాభిమానులై, నిరంతరభాషాసేవాపరతంత్రులై ఆంధ్రదేశమం దుద్భవించుచున్న అన్నిసముద్యమములకు పెట్టనికోటయై శ్రీ రాఘవరావుగారు వెల్గుచున్నారు. ఇట్టి ఉదారవంతుని, ఇట్టి యశస్కాముని, ఇట్టి భాషాకోవిదుని యాతిథ్యము నందుటకై ఆంధ్రదేశముయొక్క నలుదెసల నుండి సభకు ప్రతినిధులేతెంచిరి. 35 గ్రంథాలయముల నుండి 75 మంది ప్రతినిధులు వచ్చిరి. ఇందు పదిమంది స్త్రీలు. పమిడిపాడు రాఘవరావుగారి అగ్రహారము. చిరకాలమునుండియు పండితుల నివాసగ్రామము. పిన్నవయస్సులోనే, తమ నైదుష్యముచే దిగంతవిశ్రాంతకీర్తిని గని నిర్యాణమునందిన శ్రీ జెల్లంకొండ రామారావుగారి జన్మస్థానము. ఇప్పటికిని ఈ గ్రామమున సంస్కృత పాఠశాలయు, గ్రంథాలయమును గలవు.

ఈ అగ్రహారమందలి ప్రజలుకూడ దేశహితైకకార్యముల పాల్గొనుట కలవాటుపడిన వారగుటచే వారందరును ప్రతినిధులకు సౌకర్యముల నొనగూర్చుటయందు మిక్కిలి సహాయులైరి.

నగరసంకీర్తనముతో సభాకార్యములు ప్రారంభమాయెను. సభాధ్యక్షులగు శ్రీయుత ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య రామదాసుగారిని గుంటూరు మండలగ్రంథాలయసభాధ్యక్షతకు ఎన్నుకొనబడిన సుప్రసిద్ధ ఆంధ్రదేశసేవకులగు కుప్పా శ్రీరామశర్మగారిని నిరుపమాన దేశసేవాపరాయణులగు శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణగారిని, తురగశకటారూఢులుగ జేసి గ్రామవీధుల ఉత్సవముతో నూరేగింపు జరపిరి. గ్రంథాలయ భజనశాఖవారు భజనచేయుచును, బాలశాఖవారు కోలాటమువేయుచును ఉత్సవమునకు వన్నెదెచ్చిరి.

పిమ్మట సభ సమావేశమైనది. రాఘవరావుగారు సభ్యులకు మృదుమధురవాక్యములతో స్వాగతమొసంగిరి. పిమ్మట సూరి వెంకటనరసింహశాస్త్రిగారు అధ్యక్షుని ఎన్నుకొనుచు తీర్మాన ముపపాదించిరి. శ్రీయుత కోలవెన్ను రామకోటేశ్వరరావుగారును, పి. వరహాలం గారును తీర్మానమును బలపరుప అధ్యక్షులు శ్రీయుత ఆంధ్రరత్న బిరుదాంకితులు తమపదవి నధిష్ఠించిరి. అధ్యక్షకోపన్యాసము ఆనాటిరాత్రికి ఏర్పాటుచేయబడినది. అంతటితో ఉదయపుసభ ముగిసినది. మధ్యాహ్నము గుంటూరుమండలగ్రంథాలయసభ శ్రీయుత కుప్పా శ్రీరామశర్మగారి యధ్యక్షతక్రింద ప్రారంభమైనది. నాటిదినము రాత్రి 9 గంటలు మొదలు $2\frac{1}{2}$ గంటలవరకు అధ్యక్షుని యుపన్యాసము జరిగినది.

అధ్యక్షులు తమ సహజమృదుమధురవాక్యముల సెలవిచ్చిన యుపన్యాసమును ముందుసంచికలో ప్రకటించెదము. ముఖ్యాంశములనుమాత్ర మిచ్చుట పొందుపరచుచున్నాము.

“చెన్నపట్టణములో అఖిలభారత గ్రంథాలయ మహాసభ జరిగినపుడు గ్రంథాలయములు పాశ్చాత్యసంస్థలనియు, భారతీయ ధారావాహిక పరిజ్ఞానమును విరుద్ధములనియు నేను నుడివి అందునుగూర్చి చర్చజరిపితిని.

పిమ్మట గ్రంథాలయోద్యమమునుగూర్చి తీవ్రముగ యోచించితిని. గ్రంథాలయములు కేవలము గ్రంథములను సంరక్షించు స్థానములేయై, అచ్చటనుండు భాండాగారికుడు గ్రంథములను భద్రపరచి, చదువరుల కందిచ్చువాడేయైనచో గ్రంథాలయములు త్యాజ్యములు. ఏలననగా అధికారిభేదములేక కోరిన గ్రంథము నెల్ల చదువరికిచ్చినచో ఆ చదువరి అన్ని సందర్భములయందును ఉపయోగమునే పొందడు. ఒకపుడు ప్రమాదమునుకూడ పొందును. కావున చదువరికి తగిన గ్రంథమును నిర్ణయించుటకును ఏవిషయమునుగూర్చిన జ్ఞానము ఎట్లెట్లు సంపాదింపవలసినదియు బోధించి చెప్పుటకు తగు కథకుడొకడు ప్రతిగ్రంథాలయమం దుండవలెను. అచ్చట సర్వమతసహిష్ణుతను సర్వభూతహితమును బోధించు అన్నిమతములవారి గ్రంథములను చేర్చియుంచవలెను. లౌకికవిషయములందు ప్రత్యేకమగు గ్రంథసమూహములను సేకరించవచ్చునుగాని వీనికి మొదటి తరగతి గ్రంథములకివ్వవలసినంత ప్రాముఖ్యత నివ్వనవసరములేదు. గ్రంథాలయములు జాతియొక్క విజ్ఞానమును ప్రతిఫలించునవిగా నుండవలెను. సకలశాస్త్రము

లకును కళలకును సంబంధించు గ్రంథములమాత్రమే నచ్చుట భద్రపరచుటయేగాక తత్తత్స్థానీయులగు శాస్త్రపండితులను, కళాకోవిదులను గ్రంథాలయముల యాజమాన్యమున సమావేశపరచి వారివైదుష్యమును ప్రజలకు వ్యక్తీకరింపచేయుచు వీలగునపుడు వారల సత్కరించుచుండవలెను. గ్రామమందలి బీదవాండ్రందరియొక్కయు పట్టిని గ్రంథాలయమువారు తయారుచేసి అట్టివారి జీవనోపాధికొరకు వృత్తులను కల్పించుచుండవలెను. గ్రామస్థు లందరియందును ఐక్యభావము కల్పించుటకు వనభోజనములు మొదలగు పంపలను గ్రంథాలయములు జరుపుచుండవలెను. అన్యోన్యస్పర్థను పుట్టించునట్టిగాని, పెంపుచేయునట్టిగాని ఏవిషయమునందును గ్రంథాలయములవారు పాల్గొనగూడదు. ఇట్లు ప్రజాహితైక కార్యములనుగూర్చి గ్రంథాలయములు కృషిసల్పుచు జాత్యభ్యుదయమును సర్వజనభ్రాతృత్వమును ఒనగూర్చవలెను.”

ఇది యంతయు సభ మొదటిదినమున జరిగినది. రెండవదినము ఉదయమున సభ యంతయు విషయనిర్ణాయక సభగా నేర్పడి తీర్మానములు చర్చించబడినవి. సాయంత్రము పూర్తిసభలో తీర్మానములు అంగీకారము పొందెను. తీర్మానములన్నియు ఈసంచికయందే వేరొకచో ప్రకటింపబడినవి. అందు ముఖ్యమైనది గ్రంథాలయోద్యమముయొక్క వ్యాప్తిని, ప్రాశస్త్యమును నిర్ణయించునదియై యున్నది. తక్కిన తీర్మానములలో స్వయంసహాయముమీద గ్రంథాలయోద్యమ మాధారపడియుండుటకుగాను ప్రతిసంవత్సరము వినాయకచవితిపండుగనాడు ఆంధ్రదేశమంతటను భిక్షమెత్తి గ్రంథాలయోద్యమమును నిర్వహించవలెననునది. ఈ తీర్మానము ఉద్యమాభిమానులెల్లరు ముఖ్యముగా గమనించవలసినది. ఇందునుగూర్చి ఇప్పటినుండియే ప్రయత్నము చేయవలెను. అది ఎట్లనగా కొంత ప్రఖ్యాతినిపొంది సలుకుబడి సంపాదించినగాని ఏయుద్యమమునకును సర్వజనాదర మేర్పడదు. ప్రజాసేవ ఇప్పటినుండియు అకుంఠితముగా గ్రంథాలయములు చేసినగాని రాబోవు వినాయకచవితి పండుగనాడు ఈయుద్యమముపేరిట భిక్షమెత్తుటకు గ్రంథభాండాగారికులకు అధికారమేర్పడదు. ధనము లేనిది ఉద్యమము నడవదు గనుకను, యోగ్యతయుండినగాని ధనము చేకూరదు గనుకను ఈసభయందు నిర్ణయించిన మార్గములను తదితరమార్గములనుకూడ ననుసరించి నిరంతరము గ్రంథాలయములు కృషి చేయవలసి యున్నది.

గ్రంథాలయములు గ్రంథములతో ముఖ్యముగా పని గలవిగనుక మాతృభాషయం దుత్తమగ్రంథములు వెలువడుటకు ఆంధ్రగ్రంథాలయోద్యమము పాటుబడుటకు సహజము. స్వదేశభాషయందు వివిధవిషయిక గ్రంథములను ప్రచురించుటకు ఎన్నియో గ్రంథమాలలు మనదేశమున గడచిన సుమారు ఇరువది సంవత్సరముల నుండియు కృషిచేయుచున్నవి. ఐరోపా ఘోరసంగ్రామ కారణమున కాగితములకు కరవుఏర్పడి తన్మూలమున వీనికి అంతరాయము మేర్పడినది. ఇదియునుగాక ఎక్కువ గ్రంథమాలలు కేవలము నవలలు నాటకములను మాత్రమే ప్రచురించుచున్నవి. దేశచరిత్రలు, పరిశోధన గ్రంథములు, విమర్శలు మొదలగు విషయములందు ప్రత్యేక సమర్థతనొందిన పండితులచే రచియింపబడిన గ్రంథములు వెంటనే ప్రచురింపబడవలెను. దేశనాయకు లెందరో తాము శ్రీకృష్ణజన్మస్థాన మలంకరించి విశ్రాంతి నొందినకాలమున ఉత్తమము గ్రంథములను రచించిరని తెలియుచున్నది. ఈగ్రంథములను వెంటనే ప్రకటించుటకు తగుఏర్పాట్లు చేయవలసియున్నది. ఈయంశములన్నిటిని గమనించి గ్రంథాలయోద్యమపక్షమున గ్రంథమాల నొకదానిని, పరిశోధనపత్రిక నొకదానిని నిర్వహించుటకు తీర్మానింపబడినది. ఈకార్యమును నిర్వహించగల విద్యావంతులకు మనదేశమున లోపములేదు. గ్రంథమాలను నిర్వహించుటకు శ్రీయుత కోలవెన్ను రామకోటీశ్వరరావుగారును పరిశోధనపత్రికను నిర్వహించుటకు శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారును అంగీకరించిరి. ద్రవ్యసహాయము మాత్రము కావలెను. సరసమగు ధరలకు శీఘ్రముగా గ్రంథముల నచ్చొత్తించుటకు ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల స్థాపింపబడియున్నది. కావున ఆంధ్రవిద్వాంసులు గ్రంథములను రచించియు, ధనికులు ద్రవ్యసహాయము చేసియు ఈ తీర్మానము నాచరణలో పెట్టుటకు తగు సహాయము చేయ ప్రార్థితులు. అట్లు చేసినచో అచిరకాలమున స్వల్పఖరీదులకు అమూల్యగ్రంథములు ఆంధ్రజనులకు అందచేయవచ్చును.

కాకినాడలో రాబోవు డిసెంబరులో అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ జరుపుటకు మరియొక తీర్మానము ప్రవర్తిల్లినది. ఇది చాల ముఖ్యము. 1919 సంవత్సరములో చెన్నపట్టణములో మొదటిసభ జరిగినపుడు అందుకు జవాబుదారీ వహించినది ఆంధ్రులే. అయితే రెండవసభ బరోడారాజధానినగరమున జరుపబడునని ఆసభాధ్యక్షత వహించిన శ్రీయుత

కే. ఎన్. కుదల్కరుగారు సెలవిచ్చిరి. కాలగతిచే వారు చిన్నవయస్సునందే నిర్యాణము నొందిరి. అందుచే ఈవరకు రెండవసభ జరుగలేదు. మరియొకరీసభను జరుపుదురనుటకు నాధారములు లేవు. ఏలయందురా, మనదేశమున ప్రత్యేకముగా ఉద్యమముగా నిర్మాణమై గ్రంథాలయోద్యమము సమర్థింపబడుచున్నది. బ్రిటిషు ఇండియాలో ఆంధ్రరాష్ట్రమున మాత్రమే. మహారాష్ట్ర దేశమున కొంత కృషి జరుగుచున్నదిగాని ఈసభను అక్కడ కాహ్వానముచేసి నిర్వహింపదగునంత ఉత్సాహ మచ్చట యున్నట్లు గానరాదు. ఇతరగ్రంథాలయములు స్వదేశ సంస్థానములలో నున్నవి. బ్రిటిషు ప్రభుత్వమువారిచే నిర్వహింపబడునవి. వీరు ఈసభను సమావేశము చేయగనుమాట వేరుగ చెప్పనక్కరలేదు. కావున మరియొకతూరిగూడ ఆంధ్రులే ఈసభను సమావేశపరచుట యావశ్యకము. కావున ఉద్యమాభిమానులందరు ఇప్పటినుండియే శ్రద్ధవహించి ఈసభను జయప్రదముగా జరుపుటకు ప్రయత్నములు చేయుటకు ప్రార్థితులు. ఈసభతోపాటు చిత్రకళాప్రదర్శనము కూడ జరుపుటకు కూడ తీర్మానింపబడినది. ఈపని ఎక్కువ ప్రయత్నముతోగాని పనుకూడునది కాదు. ఇందునుగూర్చికూడ ఇప్పటినుండియే ప్రయత్నములు సాగించవలెను.

ఈయేడు సభ అనేక కారణములచే ప్రఖ్యాతిని వహించియున్నది. మొట్టమొదటిది విద్యాధికులని పేరుగన్న ఆంగ్లవిద్యావంతులు ఏపట్టణమందో మూడు దినములముచ్చటగా ఈసభ నిర్వహించక కేవలము ఉద్యమమునందు గాఢమగు విశ్వాసముకల్గిన జానపదులే ఈ సభను సమావేశపరచి నిర్వహించిరి. రెండవ విషయము ఈసభలో పాల్గొన్నవారిలో కొందరు రాజకీయరంగమున తీవ్రమగు కృషిసల్పుచు దేశాభివృద్ధికొరకు స్వరాజ్యప్రాప్తియే అవశ్యకార్యమని మనోవాక్కాయకర్మలయందు రూఢిపరచువారయ్యుండియు గ్రంథాలయోద్యమమును రాజకీయ వాతావరణమునకు సమాజములగు భేదభావములకు లోబర్చకూడదనియు, అన్ని పక్షములకును అన్ని వాదములకును గ్రంథాలయము లతీతముగానుంచి అందరకును సమానమగు ఆదరణ గలదిగా నుండునట్లు ఉద్యమాభిమానులెల్లపుడును కృషిసల్పుచుండవలెననియు సభయందు సర్వజనులచే యంగీకృతమాయెను.

ఈసభ జరుగుటకు ఆలస్యమైనపుడు ఆంధ్రదేశమున కల్గిన యాందోళనయే ఉద్యమముయొక్క శక్తివ్యాప్తిని చెప్పక చెప్పుచున్నది. కేవలము ఈయుద్యమముయొక్క మహాత్మ్యమును వర్ణించుటతోనే ఉద్యమాభిమానులు కాలము వ్యయపుచ్చక ఉద్యమకార్యములను సక్రమమగు మార్గముల నవలంబించి జరుపుటకు మిక్కిలి ప్రార్థితులు. ఈసభావృత్తాంతమును రాబోవు సంచికయందు విపులముగా ముద్రించెదము.

* * * *

# గుంటూరు మండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ.

ఈసభగూడ ఆంధ్రదేశగ్రంథాలయ సభతోపాటు పమిడిపాడు గ్రామమున జరిగినది. అధ్యక్షులు అనంతవరవాస్తవ్యులును స్వగ్రామమున ఎక్కువ ద్రవ్యము వెచ్చించి గ్రంథాలయభవన నిర్మాణము చేసినవారును, సహాయనిరాకరణోద్యమమున అతిరథులై నిల్చి తత్ఫలముగ ఒక సంవత్సరకాలము శ్రీకృష్ణజన్మస్థానము నలంకరించి కొద్దికాలముక్రిందటనే తిరిగివచ్చిన శ్రీయుత కుప్పా శ్రీరామశర్మగారు. వీరి యుపన్యాసము కేవల అనుభవపూరితము. వారిగ్రామమునకు గ్రంథాలయము చేసిన ఉపకారమును పూసగ్రుచ్చినట్లు ఇట్లు సెలవిచ్చిరి: "గ్రంథాలయమూలమున ప్రజలు విద్యావంతులైరి. అందు ముఖ్యముగా స్త్రీలు భాగవత భారతాదుల స్వయముగా చదువుకొని యానందము నందుచున్నారు. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము, స్వతంత్రేచ్ఛ ప్రజలయందు తీవ్రముగ వ్యాపించినది. ఇందుకు ఫలితముగ 23 గ్రామస్థులు ఖైదుకు వెళ్ళియున్నారు. ఇంకను వెళ్ళుటకు సంసిద్ధులుగా నున్నారు. గ్రామమునుండి కోర్టులకు వెళ్లు వ్యాజ్యములు చాల తక్కువైనవి. బాలురకును, బాలికలకును గ్రామస్థులే పాఠశాలల నేర్పర్చిరి."

ఈసభయందు రాబోవు సంవత్సరమున మండలమందంతటను ఉద్యమము దట్టముగా వ్యాపించుటకు తగిన కార్యవిధానము చర్చించబడి తీర్మానింపబడినది.

# శ్రీరామారాయ గ్రంథాలయము - పమిడిపాడు.

పమిడిపాడునందు జరిగిన గ్రంథాలయసభలను శ్రీ రామారాయ గ్రంథాలయ సభ్యులే జయప్రదముగా నిర్వహించిరి. శ్రీ రాఘవరావుగారు దీని కధ్యక్షులు. వీరి అధ్యక్షతక్రింద ఈగ్రంథాలయసభ్యులు చేసినసేవ అద్వితీయము.

ఊరేగింపుతో భజనలనుజేసిరి. ప్రతినిధులకును ప్రేక్షకులకును దినమంతయు సేవజేసియుండియు అలసటజెందక రెండు రాత్రులయందు పాదుకాపట్టాభిషేక, పాండవోద్యోగ నాటకములను ప్రదర్శించియు ఒకనాటి రాత్రి కత్తిసామును ప్రదర్శించియు ప్రతినిధులకు అమితానందమును కలుగజేసిరి. ఈగ్రంథాలయము ఆంధ్రదేశమునకంతకును ఆదర్శప్రాయమై వెలయుచున్నది.

# పశ్చిమగోదావరీమండల గ్రంథాలయసభ.

భీమవరం గ్రామమున, ఈసభ ఏప్రియల్ నెల ౧౯వ తేదీన జరిగినది. ఈసభయొక్క వృత్తాంతమును వేరొకచో గాననగును.

గ్రంథాలయసభలను ఇతర సభలతో అనుబంధములుగా పెట్టుటవలని నష్టములు ఈసారిగూడ స్పష్టముగ వ్యక్తీకరింపబడెను. ౧౮ వ తేదీన పశ్చిమగోదావరి మండల రాజకీయసభ జరిగినది. ఆసభకు వేనవేలు ప్రతినిధులు ప్రేక్షకులు విచ్చేసిరి. ఆసభకు శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు, కాశీనాథుని నాగేశ్వరరావుగారు, దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు, అయ్యదేవర కాళేశ్వరరావుగారు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు, దేశభక్త కొండ వేంకటప్పయ్యగారు మున్నగు ప్రముఖులు విచ్చేసి ఉపన్యాసముల నొసంగియు, తమ దర్శనముచేతనే జనుల నుద్బోధించియు సభజయప్రదమునకు తోడ్పడిరి.

మరుచటిదినమున అనగా ౧౯ వ తేదీన గ్రంథాలయసభ. ఈసభాసమయమునకు శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు గారు, నాగేశ్వరరావు పంతులుగారు, సుబ్బమ్మగారు, వేంకటప్పయ్యగారు—ఇంకను చిల్లరనాయకులనేకులు వెడలిపోయియుండిరి. ఆనాడు ఉదయమున మండలకాంగ్రెసుసంఘసభ జరిగినది. మధ్యాహ్నమున 3 గంటలవరకు మండల కాంగ్రెసుసంఘ కార్యనిర్వాహకసభ జరిగినది. పిమ్మట గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ ప్రారంభమైనది.

సభాప్రారంభసమయమునకు సుమారు ౧౫౦ మంది ప్రతినిధులును ప్రేక్షకులును గలరు. ప్రారంభసమయమున మండలనాయకులగు శ్రీ దండు నారాయణరాజు గారు ఉండి పిమ్మట వెడలిపోయిరి. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఉత్తరములు వ్రాసికొనుచుండిరి. శ్రీ యామినీపూర్ణతిలకమ్మగారు ప్రథమమున సభ నలంకరించి పిమ్మట నొకవైపున కొందరితో మాట్లాడుకొనుచుండిరి. శ్రీ యర్రమిల్లి మంగయ్యగారును, అయ్యదేవర కాళేశ్వరరావు గారును, ఆత్మకూరి గోవిందరావు గారును సభావేదిక సమీపమందే చిన్న ప్రయివేటు కాన్ఫరెన్సును సమకూర్చిరి. ఈచిల్లర కాన్ఫరెన్సులవలన సభాధ్యక్షుని ఉపన్యాసము వినబడక చాలగల్లంతు జరిగినది.

సభయందు సరియైన సానుభూతి లేకపోయినయెడల తమ బసలకుపోయి విశ్రాంతి గైకొనుట యోగ్యముకాని ఇట్టి చిల్లర కాన్ఫరెన్సులను చేయుచు, సభయొక్క కార్యక్రమమునకు భంగమునుగూడ కలుగజేయుట సమంజసముగాలేదు.

దేశనాయకులకు గ్రంథాలయోద్యమమునెడల ఇంకను తగినంత అభిమానము గలుగకుండుట మిక్కిలి శోచనీయము. గ్రంథాలయోద్యమమునందు పనిజేయు వారందరును యువకులు. ఒకరి అనుగ్రహముగాని, అభిమానముగాని లేనందువలన నిరుత్సాహులగువారు కారు. కాని నాయకులు ఇట్టి యుద్యమములయెడల తగిన అభిమానము జూపుటవలన ఇంకను ఎక్కువ కార్యకారులయ్యెదరని వినయముతో మనవిజేయుచున్నాము.

ఇంకొకసంగతి: ౧౮ తేదీన రాజకీయసభయొక్క వృత్తాంతమును వ్రాసికొనుటకు మద్రాసునందు ప్రకటింపబడుచున్న "స్వరాజ్య" "హిందూ" పత్రికల విలేఖకులు వచ్చియుండిరి. కాని గ్రంథాలయసభ ౧౯ వ తేదీన జరుగునప్పటికి, ఒక్క "హిందూ" పత్రిక విలేఖకుడుమాత్ర ముండెను.

# MAGIC WAND.

# ఐంద్రజాలిక కరదండము.

## జీవితమునందు జయమును సౌఖ్యమును గాంచుడి!

ఈక్రింది గమనింపులను జాగ్రత్తగా అనుసరించినయెడ ఐంద్రజాలికకరదండము ఊహాతీతమైనంతఫలమునిచ్చును. ఇవి యాడువారికిని, మగవారికిని, ప్రేమించువారికిని, స్నేహితులకును, రాజకీయోద్యోగులకును, తత్త్వశాస్త్రజ్ఞులకును, రాజులకును, మహారాజులకును, నవాబులకును, బిరుదులను గోరువారికిని, పరదార్లకును, జమీందార్లకును, మంత్రులకు, తాలూకాదార్లకును, సభ్యులకు, న్యాయవాదులకు, వైద్యులకు, ఉద్యోగులకు, గుమాస్తాలకు, ధనాగారాధికారులకు, వ్యాపారముచేయువారికి, అమ్మువారికి, కొనువారికి, పనియిచ్చువారికి, పనిచేయువారికి—వేయేల? జీవితమునందు జయసుఖముల గాంచగోరు ప్రతిమనుజునికిని తప్పక యుపయోగపడగలవు.

1. చేతులుకలిపి ప్రజలను చూచినంతమాత్రముచే వశ్యముచేసికొనుటకు శాస్త్రయుక్తమును, అనుభవసాధ్యమును, క్లుప్తమును నగు గమనింపులు:

విషయ సూచిక.

ప్రప్రథమము.
సాధారణకరమర్దనము.
వానిపద్ధతులు.
చూచినతోడనే ప్రజల వశంవదులనుగ జేయువిధము.
చేయిపట్టువిధము.
దృక్కులు ప్రసరింపజేయువిధము.
మాటలాడుతీరు.
యోచనాపద్ధతి.

2. జీవితమునందు జయసౌఖ్యములకొఱకు జనుల వశంవదులచేసికొను నద్భుతమార్గములు.

విషయ సూచిక.

1. కరగ్రహణములవలన I
2. కరగ్రహణములవలన II.
3. మాటలాడుశక్తివలన
4. మాటలాడుశక్తివలన II.
5. దూరమునందుండు జనులను (ఉత్తరముల యవశ్యము లేకయే) వశంవదుల జేసికొనుట.
6. జాబులవలన జనులను వశపఱచుకొనుట.
7. చేరుమాలు మొదలగునవి బహుమతిగా పోస్టుద్వారా పంపిగాని, స్వయముగా యిచ్చిగాని వశపరచుకొనుట.

ఇతరులవశమునుండి యెట్లుతప్పించుకొనుట?
ఉపసంహారము.
గమనింపులు.

3. సత్వరప్రజానురాగమును వడయు విద్యపై కొన్ని సాధ్యమైనట్టి చిన్న గమనింపులు.

విషయ సూచిక.

ప్రప్రథమము.
సంతోషపరచుశక్తి.
దరహసించుశక్తి.
ప్రేమించుశక్తి.
వినెడుశక్తి.
ఇతరులను సంతోషపరచి వారి యనురాగమును నమ్మకను సంపాదించుట,

జీవితమునందు జయసౌఖ్యములకు గూఢమార్గముల గుఱించి నీకేమియు తెలియదని నీకు తెలిసినయెడల, పై గమనింపులు నీకు బోధింపగలవు.

అవి నీకు తెలియవని నీవు తెలియజాలనియెడల పై గమనింపులు నీకు తెలియునట్లు చేయగలవు.

నీ కిదివరకే యవి తెలియునని నీవు తలచునెడల పై గమనింపులు నిన్ను సంశయవిముక్తుని చేయగలవు.

ఆగూఢమార్గములు నీకు తెలియునని నీకు తెలిసియున్నచో పై గమనింపులు నీకు యింపుగూర్పకపోవు.

ఒక్క యుద్యోగమందుగాని లేక వ్యాపారమందుగాని నీవు ప్రవేశింపవలెనని కోరుచుండిన యెడల పై గమనింపులు నీకు దారిచూపగలవు.

నీకు సాధనగాని, యెక్కువ ఖ్యాతిగాని, ప్రేమగాని కోరుచుండిన వానిని పై గమనింపులు సమకూర్చగలవు. నీకు కోరికయుండినను దానిని సమకూర్చి నిన్ను సంతృప్తి పరచగలవు.

విజయమను వృక్షముయొక్క ఫలము ప్రయత్నించి యందుకొనువానికే లభించునుగాని వృక్షముక్రింద కూర్చుండి ఆఫలము తనయంతట తనునోటిలో పడునుగదా యని వేచియుండువారికి గాదు. ఏలయన, వారట్లు వేచియుండ ధైర్యసాహసము గలవారే తెంచి యున్నవానిలో నుత్తమ ఫలముల గైకొందురు. ప్రయత్నింపనిది యేమియు దొరకదు. కాబట్టి పైగమనింపులను బడయుము. పైకెగసి ఫలమునందుకొనుమను వాక్యార్థము ననుసరింపుము.

అద్భుతమైన, శాస్త్రీకమైన పద్ధతులు తులలేని, సాధ్యమైనట్టి పద్ధతులు. విసుగు కలుగజేయునది కాదు. ఉత్ప్రేక్షారహితములగు యథార్థాంశములు. యోగశాస్త్రాదులనిగ్గు. రెండును రెండును జేర్చిన నాలుగెట్లగునో యట్టితప్పని పర్యవసానముల నొసంగును. ఇట్టిగమనింపు లందరికిని గావలసినవే; నీకును వలయును! ఎంతమూల్యము నిచ్చినప్పటికిని చౌకగానే తలపబడును. మూడింటికిని మూల్యము రు 15-8-0, 12-8-0, 15-8-0 మాత్రమే. కాని యీ రీపత్రికను జేర్చుకొనుచు నీరోజునసే వ్రాయునెడల మూడింటిని రు 21-0-0లకే యొసగబడును. పైకము ముందుగా బంపవలెను. V. P. P. గా బంపుటకు వలనుపడదు. తరుణము తనంతట వచ్చినది. విజయమును సుఖమును తప్పక మీవి కాగలవు. ఆలస్యము వలదు. పైకము అడ్వాన్సుగా పంపుచు వెంటనే యీక్రింది అడ్రసుకు వ్రాయుడు:

డాక్టర్ జి. యస్. డి. శర్మన్,

సక్సెస్ హౌస్, ఫత్తేపూర్ సిక్రి,

ఆగ్రా (ఇండియా).

మాకు తెలుగు తెలియదు గాన ఎప్పుడును ఇంగ్లీషులో విస్పష్టముగా వ్రాయుడు.

**Dr. G. S. D. SHARMAN,**

**G. Sc., N. Y. (U. S. A.,) Ps. D., Ph. D. (Ary) D. Ped., etc.,**

**SUCCESS HOUSE, FATEHPUR SIKRI,**

**AGRA. (India.)**

---


## ఫ్రెండ్సు కంపెని,

బెజవాడ.

అన్ని వస్తువులు సరసమైన ధరలకు కావలయుననిన ఫ్రెండ్సు కంపెనీ కొకసారి దయచేయుడు. ఫౌంటెన్ పేనాలకు, తలనూనెలకు, సెంటులకు, తెలుగు పుస్తకములకు, సిగారు లైటరులకు, యెలెక్ట్రిక్ దీపములకు, లేసులకు, పన్నీరుబుడ్లకు, గ్లాసుసామానులకు ఫ్రెండ్సు కంపెనీకే వెళ్ళుడు.

**మనసు ఫౌండేషన్**

**పుస్తకాల పరిశీలనాపట్టిక**

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVm01 A 183 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | no |
| మొత్తం పేజీలు | 55 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 9, 21 |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనిది | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |